శ్రీ:

# వేణీసంహారనాటకము

( సంస్కృతమూలము : భట్టనారాయణుడు )

8 వ శతాబ్దమునుండి

సంస్కృత సాహిత్యములో ప్రఖ్యాతి గాంచిన నాటకమునకు

తెలుగు అనువాదము.

సాహిత్యాభిమానులైన ఆంధ్రులకు వినయముతో అందించిన కానుక .

అనువాదకుడు

బొడ్డుచెర్ల మార్కండేయ ప్రసాద్

ఆంధ్ర బ్యాంక్ విశ్రాంతాధికారి.

పటేల్ నగర్, బాపట్ల,

గుంటూరు జిల్లా ,ఆంధ్ర ప్రదేశ్ - 522101

చరవాణి : 94402 60163

**తెలుగు అనువాదము - మార్కండేయ ప్రసాద్ .**

# *అంకితము*

ఆపత్కాలములో ఆదుకొన్న మా

మేనమామలు

**శ్రీ గుంటుపల్లి వేంకట అప్పారావు,**

**శ్రీ గుంటుపల్లి భానుప్రసాదరావు**

**వారలకు**

ఈ నా ప్రథమరచనము అంకితము..

--- మార్కండేయ ప్రసాద్.

గుంటూరు -

ప్రమోద - ఆశ్వయుజ - విజయదశమి

29-09-1990.

# మనవి

సంస్కృతనాటకాలలో ప్రసిద్ధమైన వాటిలో ఒకటిగా పేరుపడ్డ ఈ వేణీసంహారనాటకాన్ని నేను మొట్టమొదటిసారి1990 లో చదివాను. *( చదువుతూ చదువుతూనే, దీనిలోని రెండవ అంకమంత చెత్త అనౌచిత్యం ఇక ఉండదని ఒక 'తీర్పు'ను కూడ ఇచ్చుకొన్నాను.)* బేతవోలు రామబ్రహ్మం గారి వ్యాఖ్యతో తెలుగు విశ్వవిద్యాలయం వాళ్ళు చేసిన ప్రచురణ అది. తరువాత, 2015 లో, నిర్ణయసాగరం వాళ్ళ ప్రచురణను కూడ చూచాను.

ఎందుకో దీనిని తెలుగులోనికి అనువదించాలని బుద్ధి పుట్టింది. ఎప్పుడో 1920 ప్రాంతాలలో, వసురాయకవి అనే వడ్డాది సుబ్బారాయుడుగారు దీనిని ఆంధ్రీకరించి ఉన్నారని తెలుసుగాని ఆ అనువాదాన్ని నేను చదవలేదు. దాదాపు పదేళ్ళ తరువాత, గుంటూరు ప్రభుత్వగ్రంథాలయంలో అది దొరికింది. ఆయన శక్తి, ఆయన శైలి ఆయనవి, నా బులుపు నాది.

కావ్యరచనకు హేతువులంటూ మనపూర్వులు కొన్ని చెప్పారు గాని వాళ్ళు చెప్పనిది నాదగ్గర ఒకటుంది. అదే ఉబలాటం. అనుకోవటమే ఆలస్యం, అనువాదం పూర్తి చేసి, ఒకసారి ఆ రచనను చూడడానికి వీలుంటుందా అని అప్పుడు రాజమహేంద్రంలో ఉంటున్న ఆ బేతవోలు రామబ్రహ్మం గారికే ఒక ఉత్తరం వ్రాసాను. ఆయన సూచన మేరకు నా అనువాదాన్ని గుంటూరులో ఉన్న శ్రీ కోగంటి సీతారామాచార్యులుగారికి (వీరిప్పుడు కీర్తిశేషులు.) వినిపించాను. తద్వారా నాకు ఆచార్యులుగారితో పరిచయం ఏర్పడింది. ఇదంతా 1990-1991 సంధిలో మాట. అంతటితో ఇక ఈ పుస్తకం విషయం

ముగిసింది. కాని, ఆచార్యులుగారితో కలిగిన పరిచయం, నేను, తిరుపతి వేంకటకవుల ఉద్యోగవిజయాలను సంస్కృతంలోనికి అనువదించటానికి పరోక్షంగా కారణమైంది. ఆ రెండు నాటకాలూ 1991-92 లో పూర్తి అయ్యాయి. వాటికికూడ ఆచార్యులుగారే మొదటి శ్రోత. కనుక, వేణీసంహారం అనువాదం నా తరువాత రచనలకు కారణమని చెప్పవచ్చు. ఆ పైన దాదాపు పాతికేళ్ళదాక రచనా లేదు, చదువూ లేదు.

చిరకాలానికి, 2014 లో, నేను ఆంధ్రబ్యాంక్ లో ఉద్యోగంనుండి విరమించుకొన్న తరువాత, నా కొత్త రచనలతోపాటు దీనిని గూడ నేను నడిపే www.vyshnavikrishnamemorial.in అనే విశ్వవేదిక (వెబ్ సైట్) లో ఉంచాను.

కుర్రతనం నాటి వ్రాత గాబట్టి, కొంచెం (అంటే విపరీతమైన) ఆరభటమూ, అనువాదంలో ఎక్కువ (అనగా- మితి మీరిన) స్వతంత్రతా, ఉన్నట్లు నాకే అనిపిస్తున్నది గాని, అప్పుడు ఎలా ఉన్న దానిని ఇప్పుడు కూడ అలాగే ఉంచుదామనే ఉద్దేశంతో నేను దీనినేమీ మార్చలేదు. వ్యావహారికార్థాలలో వాడిన శాస్తి, రాద్ధాంతము, నిర్లక్ష్యము, అడుగో వంటి పదాలను సైతం అలానే ఉంచాను.

ఈ రచన, ఆంధ్రసాహిత్యాభిలాషులను తనవైపు క్రేగంటనైనా చూచేటట్లు చేసుకోగలిగితే, నేను ధన్యుడననే అనుకొంటాను.

మార్కండేయప్రసాద్. బాపట్ల,

2015.

# ముఖపత్రము

భారత మన్న సత్కవికి వారిధి వంటిది, దానినుండి యు
ద్ధారము సేయబూనిన నుదారకవిత్వము వచ్చు నక్షయం
బై, రహిఁ జెప్పఁ జాలిన మహాకవు లేతము లెత్తఁ జూచి, నా
నేరిచినట్టు లీ బరిణ నింపఁ బ్రయత్నముఁ జేసి తీ గతిన్. 1

ఊరి జనమ్ము లెల్లఁ దినుచుండిరి కొన్ని తరాలనుండి యా
భూరిరసాలభూజఫలముల్, రుచి యుండదు పాతబడ్డ, వేఁ
బారగ పైతు నన్ను విని, పక్కున నవ్వరె లోకు! లెప్పుడో
వారును వీరుఁ జెప్పిరని భారతరామకథల్ దృజింతురే? 2

వ్యాసుడొసంగె రాశివలె భారత, మిద్దరు ముగ్గురందులో
వాసి దొరంగకుం డొడిసి పట్టిరి గంపెడు, దాని నుండి, యే
దోసెడొ, చేరెడో తమకుఁ దూగినటుల్ గొనినారు కొంద, రం
తేసి గ్రహింపనేరకయు, నీ విధి నేఁ జిటికెండు బట్టెదన్. 3

నవ్యప్రజ్ఞయు, పాండితీపటిమయున్, నానాగమాధీతిమే
ధావ్యుత్పత్తులు లేకపోయినను, శాస్త్రంబుల్ బురాణంబులున్
కావ్యంబుల్ బఠియింపకుండినను, స్వానందార్థమై యీ కవి
త్వవ్యాపారవిహారమున్ జలుపఁ జాపల్యంబు జాలున్ గదా! 4

-***-

| వేణీసంహారము - పాత్రసూచిక-పురుషులు (20) | | | | |
|---|---|---|---|---|
| సంఖ్య | పాత్రము | పాత్రప్రవేశము | పద్యసంఖ్య | మొత్తము |
| | నాందీప్రస్తావనలు - | | 9 | 9 |
| 1 | భీముడు | 1,5,6. | 20,6,3. | 29 |
| 2 | సహదేవుడు | 1 | 5 | 5 |
| 3 | వినయంధరుడు | 2 | 8 | 8 |
| 4 | దుర్యోధనుడు | 2,3,4,5 | 25,4,11,21 | 61 |
| 5 | అశ్వత్థామ | 3,5. | 33,1. | 34 |
| 6 | రుధిరప్రియుడు | 3 | 1 | 1 |
| 7 | అశ్వసేనుడు | 3 | 3 | 3 |
| 8 | కృపుడు | 3 | 7 | 7 |
| 9 | కర్ణుడు | 3 | 9 | 9 |
| 10 | సారథి | 4 | 3 | 3 |
| 11 | సుందరకుడు | 3 | 3 | 3 |
| 12 | అర్జునుడు | 5,6. | 2,-. | 2 |

| వేణీసంహారము - పాత్రసూచిక-పురుషులు (20) | | | | |
|---|---|---|---|---|
| సంఖ్య | పాత్రము | పాత్రప్రవేశము | పద్యసంఖ్య | మొత్తము |
| 13 | సంజయుడు | 5 | 1 | 1 |
| 14 | ధృతరాష్ట్రుడు | 5 | 10 | 11 |
| 15 | యుధిష్ఠిరుడు | 6 | 35 | 35 |
| 16 | బుధకుడు | 6 | - | - |
| 17 | పాంచాలకుడు | 6 | 6 | 6 |
| 18 | జయంధరుడు | 1,6 | 1,1. | 2 |
| 19 | చార్వాకుడు | 6 | 2 | 2 |
| 20 | కృష్ణుడు | 6 | 1 | 1 |
| | నేపథ్యములో | 1,3,4,5,6 | 1,2,2,3,2. | 10 |
| | వేణీసంహారము - పాత్రసూచిక - స్త్రీలు (9) | | | |
| 1 | ద్రౌపది | 1,6. | - | |
| 2 | బుద్ధిమతిక | 1,6. | - | |
| 3 | భానుమతి | 2 | - | |

| వేణీసంహారము - పాత్రసూచిక-పురుషులు (20) | | | | |
|---|---|---|---|---|
| సంఖ్య | పాత్రము | పాత్రప్రవేశము | పద్యసంఖ్య | మొత్తము |
| 4 | సువదన (సఖి) | | | |
| 5 | తరళిక (చేటి) | | | |
| 6 | దుస్సల | | | |
| 7 | రాజమాత | | | |
| 8 | వసాగంధ | 3 | 1 | 1 |
| 9 | గాంధారి | 5 | - | - |
| | | | మొత్తము | 243 |

**ఈ క్రింది విధంగా కాని, వీలైనట్లు మార్చుకొని కాని, ఈ నాటకాన్ని 6 గురు పురుషులు, 5 గురు స్త్రీలు ప్రదర్శించవచ్చు.**

**పురుషులు:** 1.భీముడు-కృపుడు-బుధకుడు; 2.అర్జునుడు-కర్ణుడు-పాంచాలకుడు; 3.ధర్మరాజు-అశ్వత్థామ; 4.సహదేవుడు-సుందరకుడు-ధృతరాష్ట్రుడు; రుధిరప్రియుడు-చార్వాకుడు; 5.దుర్యోధనుడు-కృష్ణుడు; 6.సంజయుడు-జయంధరుడు-వినయంధరుడు;

**స్త్రీలు:** **1. ద్రౌపది- గాంధారి-భానుమతి; 2. బుద్ధిమతిక-సఖి; 3. వసాగంధ-చేటి; 4. .సింధురాజమాత. 5.దుస్సల.**

| వేణీసంహారనాటకము – ఛందఃసూచి | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| సంఖ్య | ఛందస్సు | ప్రస్తావనలు | 1 వ అంకం | 2 వ అంకం | 3 వ అంకం | 4 వ అంకం | 5 వ అంకం | 6 వ అంకం |
| 1 | ఉత్పలమాల | 4 | 6 | 6 | 15 | 6 | 18 | 12 |
| 2 | చంపకమాల | 1 | 4 | 5 | 11 | 3 | 8 | 8 |
| 3 | మత్తేభము | 1 | 1 | 5 | 7 | 1 | 5 | 13 |
| 4 | శార్దూలము | | 5 | 1 | 2 | 1 | | 4 |
| 5 | మహాస్రగ్ధర | | 1 | | | | 1 | |
| 6 | తేటగీతి | 2 | 8 | 4 | 16 | 6 | 9 | 9 |
| 7 | ఆటవెలది | 1 | | | 3 | 1 | 3 | 1 |
| 8 | కందము | | 2 | 2 | 4 | 1 | 1 | 1 |
| 9 | సీసము | | 1 | | 1 | 1 | | 1 |
| | 243 | 9 | 28 | 33 | 59 | 20 | 45 | 49 |

చివరి పద్యం సంఖ్య 246. 29 వ,44 వ,81 వ పద్యాలు- 238 వ, 45 వ,82 వ పద్యాలుగా పునరుక్తాలు. ఈ 3 పునరుక్తాలు పోగా, 246-3= 243.

# వేణీసంహారము

## నాంది

మును భార్యామణి కన్న మాటమెయిఁ, దెంపున్ బీరమున్ మీరగా,
దన దాయాదుడె యైన దేవవిభునిన్, దత్సర్వయోధాళితో
నని నిర్జించి, సతీమనఃప్రియకరుండై పారిజాతంబుఁ దె
చ్చిన శ్రీకృష్ణు డరాతిభీము డొసగున్, శ్రేయోమహైశ్వర్యముల్ .1

రాసవినోదమం దలుక గ్రమ్మి, చివాలున లేచిపోవు రా
ధాసతిఁ దేర్పగాఁ జనుచుఁ , దత్పదచిహ్నకృతాత్మపాదవి
న్యాససముద్భవత్పులకితాంగుడు, కృష్ణుడు బన్ను చాటుభా
షాసరణుల్ జయంబొసగు , సర్వవిధంబుల సర్వవేళలన్. 2

శైలజ ప్రేమతో, మునులు శాంతముగా, హరి నవ్వుతో, సుప
ర్వాళి ముదంబుతోడ, నసురాంగనలెల్ల భయంబుతో, సగ
ర్వాలపనంబు లొప్ప దితిజాధిపులున్ గనఁ బొల్చినట్టి యా
శైలధనుర్ద్విధీర్ఘు, వఘుసంఘదిధక్ష వహించు గావుతన్. 3

(నాంద్యంతమున సూత్రధారుడు బ్రవేశించును )

సూత్ర: (అంజలించి )

అంజలిఁ జేసి కొల్చెద ననంతశయానకథావినోదవృ
త్తిం జన గోరువారికి నతిప్రమదంబుగఁ, దత్వశాస్త్రసి
ద్ధిం జనులెల్లఁ బొందుటకుఁ దీరిచి దిద్దెను భారతేతిహా
సాంజన మెవ్వ డా విమలు, వ్యాసమహర్షి నరాగమోహునిన్. 4

పరిషత్తునకు నమస్కారము. రూపకాభిమానులకు
స్వాగతము. ఉదారసామాజికులారా!

చాలినభంగిఁ జేయుదుము, స్వల్పములయ్యు గుణంబులున్నచో

**మేలనుడయ్య! తప్పుల నమేయకృపస్  సహియింపుడయ్య! ధీ**
**శాలుల నాటకంబులను సాటికిఁ దెచ్చి పరస్పరంబుగాఁ**
**బోలిక బెట్టి  చూడకు డమోఘమొనర్పుడు మత్ప్రయోగమున్.   5**

మరొక్క మనవి.

**కైత గలిగినట్లు  గాన్పించు నెడఁ  గైతఁ,**
**గైత లేని చోటఁ గథనుఁ , గథయు**
**లేని చోట నటన నేనియుఁ  గని ముదం**
**బందు డయ్య రసికులార! మీరు.          6**

**(తెరవైపు జూచి)** మారిషా! త్వరగా రమ్ము.

**మారి:** ఇదె వచ్చితి నేమి యానతి?

**సూత్ర:** రసభరితనవనాటకదర్శనలాలసోత్త్వరాయమాణచిత్తు లగు పారిషదులనుఁ గాలవిలంబనచే నేల విసివింతువు?

**మారి:** క్షమింపుడు. పూర్వోక్తసమయమునకే యారంభించి యుండుము గాని, మనలోనొకనికి  వాని తమ్మునిచే నించుక వాగ్వాద మేర్పడినది. అది చినికి చినికి గాలివాన యగుచుండగా  మనవారు జోక్యము జేసికొని శాంతింపఁ జేసిరి, దాన నింత విలంబమైనది.

**సూత్ర:** సోదరకలహమా!  ఏమి వీరి మూఢత్వము!

**పసితనమునుండి పగఁబూని పాండవులకు**
**నిత్య మపకారములఁ జేసి, నెత్తి పైకి**
**యుద్ధమునుఁ దెచ్చుకొన్న సుయోధనక్షి**
**తీశుఁ  గని కూడ తెలియలే రేమి వీరు!       7**

**మారి:** ఆర్యా! అది నిజమే కాని, వారి పోరు నివారించి సంధిఁ

గావింప శ్రీకృష్ణుడే స్వయముగా ధృతరాష్ట్రమహారాజు కడ కేగుచున్నాడని వింటిని. అత డీ యుద్ధము నాపఁ జాలకుండునా!

**సూత్ర:** ఓహో! అటులయా! సర్వనియంత యగు శ్రీకృష్ణునిచేఁ గాని దేముండును! **(స్మృతి నభినయించి)** మన ప్రసంగములోఁ బడి మొదటి మాటనే మరచితిమి.ఇక నాలసింపఁ దగదు గాన, గాన మారంభింపఁ జేయుము.

**మారి:** చిత్తమట్లే. కాని ఏ విషయము నధికరించి?

**సూత్ర:** **(నవ్వి)** ఏ విషయమోనా? కనుల ముందు గన్పించుట లేదా! హంసక్రౌంచాదిపక్షికులముల చేతను, భాస్వర నక్షత్రపంక్తుల చేతను, నధఃకృతడిండీరధావళ్యములైన చంద్రికల చేతను, నపేతపంకమ్మైన యీ జగత్తునకు దివారాత్రములు తెలిపూతఁ బూయుచున్నట్లున్న యీ శరదృతువును గూర్చియే! ఆహా! శరత్కాలప్రభావము!

> **సత్వశాలిపక్షమ్ము, ప్రసాధితాశ**
> **మును, మధురగీః కలితము, స ముద్ధతమద**
> **రాజితమ్మగు నీ ధార్తరాష్ట్రరాజి**
> **కాలవశమయి మేదిని వ్రాలుఁ గనుము.** 8

**మారి:** **(సంభ్రమముతో)** శాంతం పాపం. ఆర్యా! ఇదేమిటి?

**సూత్ర:** శరత్సమయసంచారసుందరమైన హంసబృందమును స్వభావస్ఫోరకముగాఁ జెప్పితిని, దీనఁ బాపమేమి? శాంతించుట యేమి?

**మారి:** అది యట్లే కావచ్చుఁ గాని, ధార్తరాష్ట్రపదమునకు సద్యః

స్ఫూర్తిచేఁ గౌరవులని యర్థాంతరము స్ఫురించి,
దానివలన యమంగళము ద్యోతితమైనది సుమా!

**సూత్ర:** **(చింతించి)** అవును. ఐనను నిది కేవలము పొరబాటు.

**మారి:** ఏమయినను, నా కీ మాటలు వినుటచేత, హృదయము
కంపించుచున్న ట్లున్నది.

**సూత్ర:** భయపడ నేల! మారిషా! సాక్షాద్భగవత్స్వరూపుడగు
శ్రీకృష్ణుడే దౌత్యకార్యనిర్వహణధురంధరుడై నిలిచి నప్పు
డెవరి కే యమంగళ మగును?

**అహితవినాశనప్రశమితాహితతానలులౌచుఁ బాండవుల్**
**మహితముదంబుఁ గాంచెదరు మాధవుఁ గూడి,....**

**మారి:** కృష్ణసాహాయ్య ముండుటచే వారి కెప్పుడును గుశలమే.
మరి ధార్తరాష్ట్రుల మాట?

**సూత్ర:** వారికిఁ గూడ శుభమే యాసింతము.

**... మహీప్రసాధనా**
**వహనిజరక్తులౌ సకలబంధుజనమ్ములతో క్షతోరువి**
**గ్రహులయి స్వస్థులయ్యెదరు గాక యవశ్యము ధార్తరాష్ట్రులుస్. 9**

**(తెరలో)**

ఓరీ అసహ్యావృథామంగళ పాఠక! ఎమిరా నీ కావరము?

**మారి:** ఆర్యా! ఏవరది!

**సూత్ర:** **(అటు జూచి)** అడుగో! కౌరవులతో సంధి తన కనంగీకార్య
మగుటఁ జేసి, శ్రీకృష్ణగమనోద్దీపితక్రోధుడై మండిపడు
చున్న భీముడు,సహదేవుడు వెంటరా రౌద్రాకారముతో
నిటే వచ్చుచున్నాడు. ఇక మనమిచ్చట నిలువరాదు.

పోవుదము పద.

**(ఇరువురును నిష్క్రమింతురు)**

**(ఇది ప్రస్తావన.)**

-*-

# వేణీసంహారము

## ప్రథమాంకము.

(అంతటఁ గ్రుద్ధుడైన భీముడును వెంట సహదేవుడునుఁ బ్రవేశింతురు.)

భీము: (క్రోధముతో)

రే వాచాల! విషాన్నజాతుషగృహద్యూతచ్ఛలాచార కృ
ష్ణావాసఃకచకర్షణాదుల, సదాస్మత్ప్రాణసంపజ్జిహీ
ర్షావిష్కారుల, ధార్తరాష్ట్రుల, మహాహంకారులన్, స్వస్థులం
చేవీకన్ వచియింపజెల్లు నిట నే జీవించియే యుండగన్? 10

సహ: (సానునయముగా) అన్నా! ఆగ్రహింపకుము. ఈ శైలూషుని మాటలుగూడ నీ మనోరథార్థమునే ప్రకటించుచున్నవగుట మనకంగీకార్యములే. ఇటు చూడుము.

(అహిత...ఇత్యాదిఁ జదివి, అర్థాంతరమును స్ఫురింపఁ జేయును.)

భీము: (అధిక్షేపముగా) అయ్యో! కౌరవులనుగురించి మీరిటువంటి యమంగళము లాడవచ్చునా! వారు మీకుఁ గలిసి మనఁ దగిన సోదరశ్రేష్ఠులు గదా!

సహ: (ఇంచుక రోషముతో) అన్నా! ఇందు నీ వెరుంగని దేమున్నది! నీతోడి వారందరమే కదా మే మందరమును!

చిన్నతనముననుండియుఁ జెట్టఁ జేయు
ధార్తరాష్ట్రధూర్తుల సైపఁ దలచు వాడు
గలడె నీతమ్ములందు నొక్కరుడుగూడ
యడుగడుగునందుఁ బెద్దన్న యాపకున్న?11

భీము: అగునగును, నేటి దాక మీరందరు నాతోడివారేమో కాని,
నేటినుండి నేను మాత్రము మీతోడి వాడను గాను.

గాంధారేయవిరోధకారణతరుస్కంధమ్ము నేఁ జుమ్ము, నీ
వుం ధర్మాత్మజఫల్గునుల్, నకులు డెప్టుం గారు, కానిం డిటుల్
సంధిం జేసి యనిష్టతత్సహనివాసం బీరు గూర్పస్, జరా
సంధోరస్థలిఁ బోలె, భీము డది చీల్పం జాలడే యెక్కటిస్? 12

సహ: కాని, నీ విట్లు క్రోధపరవశుడవగుట యన్నగారికి
మనఃఖేదకారకాం బగునేమో కదా!

భీము: ఆయన ఖేదపడుటయా! అన్నగారికి ఖేదమననేమియో
కూడ తెలియునా?

కురుసభలోన నాడు మన కోమలికా దురవస్థఁ జూచియుస్,
జిరము వనమ్ములస్ దబిసి జీవితముస్ గడుపంగఁ జూచియుస్,
విరటుని మ్రోల వాకొనగ నీచపు రీతిఁ జరింపఁ జూచియుస్,
గురుశతమన్న సుంతయునుఁ గోపముఁదాల్పడు,నన్ను మెచ్చడు స్ .13

అప్పుడెప్పుడును లేని బాధ యిప్పుడు గలుగ
వలసినంత యగత్య మేమి వచ్చినది?కనుక, నీవేగి,
పెద్దన్న గారితో, చిరకాలప్రవృద్ధక్రోధదందహ్యమాన
హృదయుడైన భీమసేనుని మాటలుగా యిట్లుజెప్పుము.

సహ: ఏమని?

భీము: భవదాజ్ఞస్ దెగి దాటిపోయిన మహాపాపమ్ము రానిమ్ము పా
పవిచారుండితడంచు నన్నవరజవ్రాతంబు తప్పెన్ననీ,
వివశోత్తంభితలోకభీకరగదావిధ్యారికిన్నాకు న
న్నవుగావీదిన మేను నీకు ననుజుండంగాను,మన్నింపుమీ!14

అని తెలుపుము.**(పరిక్రమించును )**

సహ: **(అనుసరించుచుఁ దనలో)** ఓహో! అన్నగారు పాంచాలీ సదనమున కరుగుచున్నారు. నే నిందే యుందును. **(నిలుచును)**

భీము: **(మరలి చూచి)** తమ్ముడా! నీవేగి మహారాజుతో నేఁ జెప్పి నట్లు జెప్పుము. నేనిదే యాయుధా గారమున కేగి సన్నద్ధుండ నయ్యెదను.

సహ: అగ్రజా! ఇది శస్త్రాగారము గాదు. పాంచాలీసదనము.

భీము: **(సవిమర్శముగా)** ఏమీ! ద్రౌపదీసదనమా! సరియే కానిమ్ము ద్రౌపదినిఁ జూతము. **(సహదేవుని వైపు తిరిగి)**

**రమ్ము కుమార నీవు నిటు, రాజొనరించిన తొంటివెల్లఁ బో**
**ని, మ్మిపుడర్థరాజ్యము గ్రహించి కురుప్రభుతోడ సంధికిన్**
**సమ్మతిఁ జూపి యెట్లు మన సర్వులకున్ వ్యథఁ గూర్చుచుండెన**
**యిమ్మగువన్ గనుంగొనుచు నీవ యెరుంగుదుగాని యిచ్చటన్.15**

**(ఇరువురు బ్రవేశము నటింతురు)**

సహ: అన్నా! ఇదె యాసనము. కృష్ణాగమనపర్యంత మిందు విశ్రమింపుడు.

భీము: సహదేవా! కృష్ణాగమనపర్యంత మనుటచే జ్ఞప్తికి వచ్చినది. సంధి ఘొసగించుటకై కృష్ణుడేగెను గదా! ఇంతకు సంధినిబంధనము లేమని?

సహ: ఐదూళ్ళనిచ్చుట.

భీము: **(విస్మయముతో)** ఐ దూళ్ళా! నేనిందనుక నర్ధరాజ్యమని భ్రమించుచుంటిని! **(విచారముతో)** ఎట్టి వానికెంత దైన్య

మాపేశించినది!

**భూమీశుల్ బ్రణతుల్ బొనర్ప, ననుజుల్ భూమండలంబెల్ల ది**
**క్సీమాంతమ్ముగ గెల్చి యీయ, నతులశ్రీప్రాభవం బొప్పగా,**
**నామై యే పతి విశ్వసంస్తుతవిభుండై రాజసూయమ్ముచే**
**ప్రాముఖ్యమ్ము గడించె, నా పతియ యీ భంగిన్ బ్రవర్తించునే! 16**

**(ఖిన్నుడై యాలోచించుచుండును)**

సహ: **(తెరవైపు జూచి)** అయ్యో! అశ్రుధారాసిక్తగండమండలయై, యాజ్ఞసేని యగ్రజుని కడకు వచ్చుచున్నది. ఇది పెద్ద సమస్యయే కాఁగలదు.

**క్రుద్ధుడగు నన్న మనసులోఁ గ్రోధరేఖ**
**ద్రుపదకన్యకావ్యవసాయదోహదమున,**
**వృద్ధిఁ గాంచెడు ననివార్యరీతి నిపుడు,**
**మించుతీగ ప్రావృట్టునం బెరుగునట్లు. 17**

**( అంత యథోక్తముగా ద్రౌపదియు, వెంటఁ జేటియుఁ బ్రవేశింతురు)**

చేటి: అమ్మా! చింతపడకుము. నిత్యానుబద్ధకురువైరుడగు భీమసేనకుమారుడు నీ శోకమునుఁ ద్వరగానే తీర్పఁ గలడు.

ద్రౌప: బుద్ధిమతికా! మహారాజు ప్రతిబంధింపకుండినఁ గదా అట్లగుట !

చేటి: **(ఎదుటఁ జూచి)**అడుగో! భీమసేను డిచ్చటనే యున్నాడు. నీకొరకే నని తలంతును. పోవుదము పద.

ద్రౌప: అట్లే, పద.

చేటి: **(సమీపించి)** కుమారునకు జయము.

భీమ: **(అనాకర్ణితముగా)** సహదేవా! అట్లయిన నేనేమియు నడుగలేదు, నీవేమియుఁ జెప్పను లేదు.

**ఆత్మరాజ్యమ్ము దాయాది కప్పగింప**
**దాపురమ్మైన నాటి జూదమ్ము నందు**
**క్షత్రసహ జోగ్ర తేజస్సుఁ గూడ**
**పాచికల కన్న నాడె కోల్పడియె, నిజము.18**

కాకున్న నింత దీనుడగునా!

చేటి: **(వెనుదిరిగి)** అమ్మా! నీ నాథుడేలనో కుపితుడైనట్లు గనుపించుచున్నాడు.

ద్రౌప: అట్లయిన నీ యలక్ష్యత గూడ నాకొక యూరడింపే కాగలదు. ఇటనే యుండి యార్యపుత్రుని గమనింతము గాక. **(ఇరువురు నట్లొనర్తురు.)**

భీమ: **(క్రోధముతో, సహదేవు నుపలక్షించి )** పంచగ్రామసంధి యట, పంచ-గ్రామ-సంధి!! అందును సుయోధనుని వేడుటయా!

**అనుజులఁ గూడి మమ్ము పరిహాసమొనర్పగ వచ్చి, చిత్రసే**
**నునిరథమందు బంది వడ, నోరును నెత్తియుఁ గొట్టుకొంచు నే**
**డ్చిన కురుకాంతలంగని, కడింది దయన్ మన యన్న బంపఁగాఁ**
**జని విడిపించి పంపి, చెయి సాచుదుమే యిక వానిముందిటుల్19**

**(తలపంకించుచు)** కానిమ్ము. సంధి కుదురునే కాక!
అంత మాత్రమున, కౌరవులకు బ్రదుకుఁ గలుగనిత్తునా?

**ఘోరరణమ్మునన్ దునుమకుందునె కౌరవరాజినెల్ల?, దు**
**ర్వారత, దుస్ససేనునెద ప్రచ్చనె త్రావనె వేడినెత్తురున్?**

**ఊరులు పిండిసేయనె సుయోధను నుగ్రగదారణమ్మునన్?**
**గోరునుగాక మీనృపతి కొండికచందపు సంధిపొందికన్.** 20

ద్రౌప: **(జనాంతికముగా)** చెలీ! శ్రవణసుఖకరములైన యార్య పుత్రుని మాటలే నా మనస్తాపమును సగము దీర్చుచున్నవి.

సహ: అన్నా! మహారాజుగారి సందేశము నీ కవ్యుత్పన్న మనియు, నిరర్థకమనియు దోచినట్లున్నది.

భీము: కాక, దీనిలో సార్థక్యమేమైన గలదా?

సహ: మహారాజు గారి సందేశమిది.

భీమ: ఎవరికి? సందేశము?

సహ: సుయోధనునకు.

భీమ: ఓహో! ఏమనియో!

సహ: ఇట్లు.

**వారణావతమ్మును, వృకప్రస్థమును, జ**
**యంతపురము, నింద్రప్రస్థ మనెడు నాలు**
**గూళ్ళ తోడ నేదే నోక యూరిఁ గలిపి**
**యైదు గ్రామమ్ము లిమ్ము మా కైదుగురకు.**21

భీము: దీనిలోని పాండిత్యమేమియో నా కించుకంతయుఁ దెలియ లేదు.

సహ: ఏమియు లేదు గాని,

**నాలుగు గ్రామనామములు నాల్గు విధమ్ములఁ జాటి చెప్పగాఁ**
**జాలును దొల్లి కౌరవులు సల్పిన కీడుల, దాన వారలన్**
**బాలిశు లందు రెల్లరును; పంచమనామముఁ జెప్పకుంటచే**

**నాలము దెచ్చిపెట్టిన మహాఘము నీదని చెప్పినట్లగుస్.** 22

భీమ: **(ఏకసక్కెముగా)** అందుచే నొరగునదేమి?

సహ: తద్వారా, కురురాజు దౌష్ట్యమును, సంధి కాత డనుకూలుడు గామియుఁ, గులక్షయమున కే మాత్రము జంకమియుఁ దెల్ల మగును.

భీము: ఆఁ!,ఇది యంతయు వ్యర్థమే.కురురాజు గాని, మరొక్కడు గాని, యనుకూలుడో ప్రతికూలుడో యయినఁ గాని సంధి విషయ మెరుగరానిదా? మూఢుడా!

**వనములకేగుచో శపథవాక్కులు బల్కిన నాడె తెల్లమ**
**య్యెను గురుపాండవుల్ గలిసి యింక వసించుట గల్ల యంచు, ని**
**ష్టనుకొన నేల, సంధి యగునా చెడునా యని? క్రొత్తయా సుయో**
**ధనునివిధంబు లోకులకుఁ ? దత్‌క్షయ మెట్లును నిశ్చితంబ కా!23**

సహ: నిశ్చితమే. కాని, వంశనాశనకారణభూతులమైతి మను లజ్జావహమగు నింద నొందుట యన్నగారి కభిమతము గా దనుకొందును.

భీము: తమ్ముడా! వెర్రియెక్కినదా యేమి!

**నిరతాపకారులును ము**
**ష్కరులగు శత్రువుల కులము క్షయ మగు టది ప్రీ**
**కరమై, భార్యాంబరకచ**
**పరకర్షణ మీకు సహనభాజనమయ్యెస్!** 24

ద్రౌప: నాథా! వారికేమియును లేదు గాని, మీరు మాత్రము నన్ను మరవకుడు.

భీము: వత్సా! పాంచాలి యింకను రాకున్నదేమి?

సహ: అగ్రజా! ఆమె వచ్చి చాలసేపైనది. కాని రోషపరవశుడవై నీవే కానకుంటివి.

భీము: **(మరలి ద్రౌపదినిఁ జూచి యాదరముతో)** కోపాంధుడనై చూడనైతిని. అన్యథా తలపకుము.

ద్రౌప: నాథా! మీరు నిస్తేజముగా నుండుట నాకు విషాదహేతు వగును గాని, కోపావిష్టులై యుండుట ముదావహమే కదా!

భీము: ఇక నీ హృదయవ్యథ తీరినట్లే యనుకొనుము.**(పరికించి)** ఉద్విగ్నవైనట్లు గనిపించుచున్నావేమి?

ద్రౌప: మీరు నా చెంత నుండగా నాకుద్వేగమేల?

భీము: ఇంతకును విచారహేతువునుఁ దెల్పవైతివే! **(కేశములఁ జూచి)** ఐనను, నేడు నీవు క్రొత్తగ జెప్ప వలసిన దేమున్నదిలే!

**పాండుపుత్రులైదుగురును బ్రదికియుండి,**
**కట్టగట్టుక యెదుటనే కలిసి యుండ,**
**యజ్ఞసంభవ కీ దశ ప్రాప్తమయ్యె.**
**నింకఁ దెలిపింపఁ దగు హేతువేమి యుండు?** 25

ద్రౌప: బుద్ధిమతికా! ఆర్యపుత్రున కెరిగింపుము. నా పరాభవమును మనసున బెట్టువా రింకెవరున్నారు!

చేటి: చిత్తము **(సమీపించి)** కుమారా! దేవిగారి దుఃఖమున కింతకంటె ముఖ్యమైన కారణమే కలదు.

భీము: ఇంతకంటె ముఖ్యమైనదా! దేవీ!

**కౌరవకులవనదావము**

**మారుతి నేనుండ, నెవడు మరల శిఖిశిఖో**
**దారస్ విముక్తవేణీ**
**ధారిణి నిస్ జెనకి, శలభతాపదమయ్యేస్?** 26

**చేటి:** కుమారా! నేటి యుదయమున దేవి, సుభద్రాదిసపత్నీ జనపరివృతయై గాంధారీపాదవందనమునకై యేగినది.

**భీము:** పెద్దలు పూజ్యులు గదా! అది యుక్తమే!

**చేటి:** మరలి వచ్చుచున్నపుడు భానుమతీదేవి యెదురైనది.

**భీము:** శత్రుకాంతకే యెదురుపడెను గా! ఇది నిక్కముగా దేవికి రోషకారణమే.

**చేటి:** అంత నామె విలాసముగా స్వపరివారమునుఁ జూచుచు సగర్వహాసముతో దేవి కిట్లనెను.

**భీము:** ఓహో! చూపులే కాక మాటలు గూడ నడచినవా! ఏమనినది?

**చేటి:** 'పాంచాలీ! పంచగ్రామసంధిప్రస్తావన జరుగుచున్నదని వింటిని.ఇంకను నీ కురులు ముడువకున్నావేమి?'అని.

**భీము:** సహదేవా! వింటివా!

**సహ:** అగ్రజా! వింటిని. కాని-

**చెప్పెడిదేమి, కౌరవుని చేడియ గాదె! సతీజనాళికిస్**
**దప్పక భర్తృసంగతినిఁ దత్సదృశంబగుఁ జిత్తవృత్తి; తా**
**నొప్పెడిదయ్యుఁ దీవ, సహజోజ్జ్వలమాధురి యెల్ల వీడి పె-**
**న్నొప్పి ఘటించుఁ, బ్రాకిన యనోకహమే విషయుక్తమైనచో.** 27

**భీము:** అప్పుడీమె యేమియు ననలేదా?

**చేటి:** కుమారా! నేనుండియు, దేవి మాటలాడునంత పని

రానిత్తునా!

**భీము:** మంచిది. నీవేమంటివి?

**చేటి:** 'అమ్మా! భానుమతీ దేవీ! మీ కేశములు విడివడకుండ మా దేవి కేశములెట్లు ముడివడు?' నంటిని.

**భీము:** మేలు మేలు. మా పరిజన మనవలసిన మాట యంటివి. భానుమతి కింత యయుక్త పరిహాసమా? కానిమ్ము.

**మగడు పరిహాసముల ఫల మనుభవించు**
**వెనుక నీ గేలిసేత కీ వెలది కగును**
**దగిన శాస్తి; యెరుగుఁ గాక, ద్రౌపదీశి**
**రోజసంయమనం బెంత క్రూర మగునొ !** 28

దేవీ! ఐనను నీ వీ పరాభవము నెంతో కాలము సైప నక్కర లేదు.

**ఉద్దామప్రతియోధయూథహననోద్యోగప్రతాపాఢ్యభా**
**స్వద్దోర్దండసముద్ధృతభ్రమితవిస్ఫాయద్గదాఘాతపా**
**తౌద్దండ్యాసహచూర్ణదూరురిపురక్తక్లిన్నదుర్లక్ష్యమూ**
**ర్త్యుద్దీప్తుండగు భీముడీ కురుల సంయోజించు శీఘ్రమ్ముగన్.** 29

**ద్రౌప:** మీ కోపమున కెదురేమున్నది? మీచేఁ గానిదేమున్నది! మీ సహోదరులు మీకు సర్వవిధముల సహకరింతురు గాక.

**సహ:** తప్పక యట్లే కాఁగలదు.

**(తెరలో కలకలము. భేరీ నాదము. అందరాకర్ణింతురు.)**

**భీము:** సహదేవా! వినబడుచున్నది గదా!

ప్రమథితాంభోధివాఃపరిపూర్ణకందర
మందరధ్వానసామ్యంబుఁ గాంచి,
ప్రళయనీరదపరస్పరఘట్టనోద్భవో
దీర్ఘరావంబు నతిక్రమించి,
శత్రుదర్శనమహోత్సాహోత్థమత్సింహ
గర్జానినాదసఖ్యమ్ము నొంది,
ధార్తరాష్ట్రక్షయోత్పాతకేతువు నాగ,
ద్రుపదజాక్రోధాగ్రదూత యనగ
రిపుపరాభవతప్తమద్ధృదయనిరత
కాంక్షితాహవసిద్ధివాగ్దానమనగ,
సంభ్రమోద్గ్రీవసైనికశ్రవ్యమగుచు,
భూరిభేరీనినాదంబు మీరు నేల? 30

(సంభ్రమముతోఁ గంచుకి ప్రవేశించును)

కంచు: కుమారా! మన శ్రీకృష్ణభగవానులు.....

(అందరు లేచుచున్నారు )

భీము: ఏడి? ఎక్కడ?

కంచు: పాండవపక్షపాతి యని కినిసి, దుర్యోధనుడు బంధింప నుంకించెనట!

భీము: ఏమి? బంధించెనా?

కంచు: లేదు. బంధింపఁ బ్రయత్నించె నట.

సహ: అపుడు శ్రీకృష్ణుడేమి చేసెను?

కంచు: ఏమి చేయుట యేమి కుమారా!

సాధువాక్యసరణిచేతఁ జక్కఁబడమి,

**విశ్వరూపంబుఁ జూపించి వెగడు పరచి,**

**వారు మీచేతఁ బడదగువారు గాన**

**నేమియునుఁ జేయకే యిట కేగుదెంచె. 31**

ఇప్పు డ య్యనఘుం డన్నగారితోఁ గలిసి మిమ్ముఁ జూడఁగోరుచున్నాడు.

భీము: **(దుర్యోధనునుపలక్షించి)** ఓరీ భూభారభూత! చంద్రవంశ కళంక! ఇక మీ సర్వనాశమునకుఁ బాండవక్రోధము కేవలము నిమిత్తమే.

సహ: అన్నా! ఈ దుష్టదుర్యోధనుడు తుదకు శ్రీకృష్ణునిఁగూడ స్వరూపమున నెరుగ లేకున్నాడేమి!

భీము: సహదేవా! వానికంత తెలివిగూడనా!

**జ్ఞానుల్ గామజయుల్, సమాధిరమణుల్, సత్త్వైకనిష్ఠుల్ మునుల్,**

**గానస్ జాలుదు రే పరాత్పరు, హరిస్, గైవల్యదుస్, సర్వశ**

**బ్దానిర్వాచ్యుని, నిర్గుణుస్, బ్రతను, ద్వంద్వాతీతుఁ, దా నవ్విభుస్,**

**గానస్ నేర్చునె గ్రుడ్డిరాజుకొడుకీ కష్టుండు మోహాంధతస్? 32**

జయంధరా! మరి, యన్నగారిపుడేమని నిశ్చయించిరి?

కంచు: తమరక్కడకేగినప్పుడే సర్వమును విశదము కాఁగలదు.

**(తెరలోఁ గలకలము, తదనంతరము, నేపథ్యమునుండి .)**

ఓహో! ద్రుపదవిరాటధృష్టద్యుమ్నాదిపాండవచమూపతు లారా! కౌరవయోధులారా! వినుడు, వినుడు.

**బోధప్రాభవసంయతంబు, ద్రుపదోద్భూత్యంగవస్త్రాపహృ-**

**త్యేధోవర్ధిత, మన్వయార్థ శమితోత్సేకంబు, యౌధిష్ఠిర**

**క్రోధజ్యోతి, యవార్యమై కురువనక్షోణిస్ విజృంభించెఁ, గృ**

**ష్ణాధర్షాసహనప్రభంజనముహుర్వ్యాపారసంపుష్టమై.** 33

భీము: **(సంతసముతో)** భళీ! అగ్రజక్రోధజ్యోతి యప్రతిహతముగా విజృంభించుఁగాక!

**(తెరలోనుండి మరల మరల భేరీనినాదము వినఁబడును)**

ద్రౌప: నాథా! విలయసమయపయోదగర్జాభీలముగ భేరి మరల మరల మ్రోగుచున్నదేల?

భీము: ఏమున్నది! యజ్ఞము జరుగుచున్నదని యాహ్వానించుటకు.

ద్రౌప: **(ఆశ్చర్యముతో)** యజ్ఞమా!

భీము: అవును. యజ్ఞమే.

**అనుజుల మేము ఋత్విజుల, మగ్రజుడే క్రతుకర్త, దేవకీ**
**తనయుడు కర్మదేశికుడు, తత్కురువంశకళంకముల్ పసుల్,**
**జనపతులే సదస్యులుగ, సంగరయజ్ఞము సాగు, నంగనా**
**జనపరిభూతిఖిన్నమతిశాంతిఫలంబనిభేరి చాటెడుస్.** 34

సహ: అన్నా!మనమిక యగ్రజాజ్ఞానుసారము విక్రమకేళి నెరపఁ బోవుదమా?

భీము: ఇదే సన్నద్ధుడను. దేవీ!

**వోరితమైనఁ జాలును, రిపుప్రకరంబుల నుగ్గుజేయఁ జే**
**కూరునటంచు నెప్పుడునుఁ గోరుదు, నేటికిఁ బ్రాప్త మయ్యె, భూ**
**భారము దీర్తు దుష్టకురువర్గమహాటవిఁ గాల్చివైచి, త**
**త్కౌరవవంశనాశమునకై ననుఁ బంపుమ హర్షమొప్పగస్.** 35

ద్రౌప: నాథా! అసురసంగ్రామములో హరివలె జయలాభముతో మరలి రండు.

ఇరువురు: మంగళాశంసనము ప్రతిగృహీతము.

ద్రౌప: ఆర్యపుత్రా! రణమునుండి వచ్చి నన్నూరడింతురుగదా!

భీము: పాంచాలీ! ఇక మాటలకవసరము గాదు.

**పరిభవక్షాంతిలజ్జావివర్ణముఖుని**
**నకృతకౌరవ్యసర్వసంహారు నన్ను**
**మరలఁ జూడవు నమ్ము మీ మాట. కోర్కెఁ**
**దీర్ప నున్నాఁడ, వట్టి యోదార్పు లేల? 36**

ద్రౌప: స్వామీ! శత్రుబలము లప్రమత్తసంచరణీయము లని తెలియ వచ్చుచున్నవి. పాంచాలీపరాభవప్రవృద్ధక్రోధ వివశులై యనపేక్షితశరీరులుగా సంచరింపకుడు.

భీము: ద్రుపదరాజపుత్రి!

**క్షతవైరీభాహతోద్యద్గజరుధిరవసాగాఢమస్తిష్కపంక**
**ప్రతిరుద్ధస్యందనాశ్వోపరికృతచరణాక్రాంతివిక్రాంతపత్తిస్,**
**బ్రతతాస్పృక్పానగోష్ఠీవదదశివశివావాద్యనృత్యత్కబంధ**
**ప్రతతిస్,యుద్ధార్ణవాంతర్జలమునఁదిరుగన్బండితుల్పాండుపుత్రుల్ 37**

(అందరు నిష్క్రమింతురు. తెర పడును.)

**భట్టనారాయణుని సంస్కృతవేణీసంహారనాటకమునకు**
**బొడ్డుచెర్ల సుబ్బారావు, జోగాంబల పుత్రుడు,**
**మార్కండేయప్రసాద్ చేసిన ఆంధ్రానువాదమునందు**
**ఇది ప్రథమాంకము.**

-*-

# వేణీసంహారము

## ద్వితీయాంకము.

## విష్కంభము

**(అంతటఁ గంచుకి ప్రవేశించును.)**

**కంచు:** దుర్యోధనమహారాజు పుణ్యమున సేనాయననుఁ
గనిపెట్టుకొని జీవితము సుఖముగాఁ గడపుచున్నాను.
ధార్తరాష్ట్రులు పుట్టకముందునుండియుఁ గౌరవరాజుల
నాశ్రయించియే జీవిక సాగించుచుంటిని. ప్రాయము
జెల్లినది.

**పైనఁ బడినది వార్ధక్యభార మిపుడు,**
**యౌవనమునాటి దేహదార్ఢ్యంబు తగ్గెఁ.**
గానఁ , **బ్రాఁగొల్వుకాడను కరుణచేత,**
**నలతి** పనులకు **రాజు న న్ననుపుచుండు.38**

**(ఆలోచించి)** ఐనను, దీనివలన మహారాజు కరుణాతి
శయమే తెలియుచున్నది గాని, నాకీ ముదుసలితనము
వలన వచ్చిన క్రొత్త బాధలేమున్నవి? అంతఃపురసేవకు
లందరకువలెనే నాకును కాలమువలనఁ గలుగని
ముదిమి లక్షణములు మొదటినుండియే యున్నవి.

**కనులివి యున్నవయ్యుఁ గనగాఁ జన, దీ శ్రవణంబులుండియున్**
**వినఁ** దగ, **దోపియున్ నృపతివేశ్మవిధంబని యష్టి బూనితిన్.**
**అనిశము సావధానమతినై మెలమెల్లగ నే చరింతుఁ;** గొ
**ల్వున బ్రదుకీడ్చువాని కికఁ గ్రొత్తగ నీ ముదిమేమి దెచ్చెడున్! 39**

**(స్మృతినభినయించి)** నిన్నటి పోరిలో నభిమన్యుం

జంపిన రాధేయజయద్రథాదికురుసేనానులను

సత్కరింపఁ జనుటకు ముందు భానుమతీదేవినిఁ జూడఁ

గోరిన దుర్యోధనమహారాజు, 'శ్వశ్రూజనవందనమునకై

యరిగిన యామె తిరిగి వచ్చినదేమో చూచి రమ్మ' ని

నన్ననిపినారు'. **(పరిక్రమించి తెర వైపు జూచుచు )**

విహంగికా! శ్వశ్రూమందిరమునుండి భానుమతీదేవి

గారు మరలి వచ్చిరా లేదా? **(చెవి యొగ్గి)** ఏమీ!

కృతగురుజననమస్కారయై, భర్తృవిజయకాంక్షచే

నేటినుండి వ్రతము పట్టిన యామె, బాలోద్యానమున

నున్నదా! సరి సరి, మహారాజున కెరిగింతును.

**(పరిక్రమించి)** తల్లీ భానుమతీ దేవీ! యుక్తాయుక్తకార్య

ప్రవర్తనమున నీ పతికంటె నీవే మెరుగు.

**ఇంతివ యయ్యు నన్నియు గ్రహించి రణమ్మున గెల్పు గూర్చి చిం**

**తింతువు గాని, నీ మగనిదీమస మేమొ, విహారలోలుడై**

**యంతిపురంబుఁ జొచ్చె, హరి యంతటివానిసహాయమొప్పగాఁ**

**బంతముతోడఁ బాండవులవంటిబలాఢ్యులె యెత్తివచ్చినన్. 40**

**(సాలోచనగా)** ఏమో మహారాజుగారి ప్రవర్తన

వింతగా నున్నది.

**రాజుల గొంగయౌ పరశురాముని గెల్చిన జోదు తాత ను**

**గ్రాజి, విరోధిశస్త్రపరికల్పితతల్పునిఁ గాగఁ జూచి యు**

**ద్వేజన లేదుగాని, కురువీరజయశ్రము నొక్క బాలు వి**

**ద్యాజితుఁ బార్థపుత్రు విగతాయుధు వంచనఁగూల్చి యుబ్బెడున్41**

లక్ష్మణ కుమారుం గూర్చి పుత్రశోకముఁ గల్గించిన వా
డగుట నాతని వధ తోషకారణమే యైననుఁ గావచ్చును.
కానిమ్ము. భగవంతుడు కౌరవులకు మేలుఁ జేయుఁగాక.
నేనరిగి మహారాజునకు దేవిగారి వార్తనుఁ దెలుపుదును.

**(నిష్క్రమించును.)**

**(ఇది విష్కంభము)**

**(పిదప యాసీన యైన భానుమతియు, సఖియుఁ, జేటియుఁ బ్రవేశింతురు)**

**సఖి:** రాజ్ఞీ! అభిమానధనుడు, నరివీరభయంకరుడు నైన దుర్యోధనమహారాజునకు దేవేరివి, నీకిట్లు స్వప్న మాత్రమున కింత బెంగ వడుట తగదు సుమా!

**చేటి:** ఔను దేవీ! నిద్రలో కలవరింతలవలెనే స్వప్నదృశ్యములు గూడ లెక్కలోనికి రావు. కనుక భయపడకుము.

**భాను:** నిజమే కాని, నాకు మాత్ర మీకల కడు నమంగళ కరముగా యనిపించుచున్నది.

**సఖి:** ఐన నీ స్వప్నమేమియో తెలుపుము. దానినిబట్టి దాన హోమాదులచే శాంతిఁ గావింతము.

**చేటి:** నిక్కము. దుస్స్వప్నములు దేవతారాధనవలన శుభపరిణామము లగునని విందుము. చెప్పుము.

**భాను:** భయముచే మరచితిని. కొంచెమాగుము. జ్ఞప్తికిఁ దెచ్చుకొని చెప్పెదను. **(స్మరించుకొనుచుండును.)**

**(అపుడు రెండవపైపునుండి కంచుకియు, దుర్యోధనుడునుఁ బ్రవేశింతురు.)**

**దుర్యో:** కంచుకీ! నిన్నటినుండి మనస్సు తేలికపడినట్లున్నది సుమా! ఎందుకనిన,

**సడి యెరుగనీక గాని, పెల్లడిగ గాని,**
**స్వయముగా నైన, నితరులవలన నైన,**
**తెలిసియో తెలియకయొ, శత్రులకుఁ జేయు**
**హాని సుంతైన యత్యంతహర్ష మొసగు. 42**

ఇక మనవారభిమన్యునే కూల్చిరన్నప్పుడు, దానివలనఁ గలిగిన ముదమునకు మేరలుండునా!

**కంచు:** దేవా! రాధేయజయద్రథాదుల కిది యొక్క ఘనకార్యము గాదు గదా! ఇక ద్రోణాచార్యశస్త్రాస్త్రప్రతిభాపాటవముల కిది యొక లెక్కయా!

**దుర్యో:** వినయంధరా! వాడేకాకియు, బాలుడును, నిరాయుధుడునుఁ గనుక వానిఁ గూల్చుట మన యోధులకుఁ గీర్తికరము గాదందువా! అమాయికుడా! పాండవులు వహించిన ఘనత మాత్ర మేపాటి దేమి?

**పోర శిఖండిని మున్నిడ**
**నేరమొగమ్మైన తాత నుర్విం గూల్పన్,**
**వారల కేయశ మబ్బెనొ,**
**వీరల కా యశము యబ్బు వేరన నేలా! 43**

**కంచు:** దేవా! నా భావ మదికాదు. తమ పౌరుషమున కితఃపూర్వ మెరుంగని కళంకము వచ్చుట యనభిలషణీయమగుట యట్లంటిని.

**దుర్యో:** కడచిన దానికేమిలే! వినయంధరా! ఇది వినుము.

**అచిరమున యుద్ధమందు బలాఢ్యుడగుచు**
**భ్రాతృమిత్రసేవకసుతబంధుయుతుని**

**శూరుడు సుయోధనుని పాండుసుతుడు గూల్చి**

**యఖిలసామ్రాజ్యవైభవ మందగలడు,** 44

**కంచు:** **(చెవులు మూసికొని)** శాంతం పాపం. అమంగళము నశించు గాక.

**దుర్యో:** వినయంధర! నేనన్నదేమి!

**కంచు:** **అచిరమున యుద్ధమందు బలాఢ్యుడగుచు**

**భ్రాతృమిత్రసేవకసుతబంధుయుతుని**

**శూరుడు సుయోధనుడు పాండుసుతునిఁ గూల్చి**

**యఖిలసామ్రాజ్యవైభవ మందగలడు.** 45

అనవలసినది, తద్విపరీతముగాఁ బల్కితిరి.

**దుర్యో:** వినయంధరా! నేడు భానుమతీదేవి యేలనో నాతోఁ జెప్పకయే ప్రాతఃకాలముననే శయనగృహమును వీడి చనినది గదా! దానంజేసి డెందము గలతపడినట్లున్నది. ఆమె యున్నకడకుఁ బోవుదము పద.

**కంచు:** చిత్తము, ఇటు దయచేయుడు.

**(పరిక్రమింతురు)**

**కంచు:** దేవా! ఇదే బాలోద్యానము. **(ఆఘ్రాణించి)** చూచితిరా! తుహినకణశీతలవాతపోతపాతితములైన నానావిధ కుసుమరాజులతోడను, ముగ్ధాంగన లేయెరుపు జెక్కిళ్ళవలె నొప్పు లోధ్రకుసుమపాటలిమంబుచేతనుఁ, బ్రభాతరమణీయమై యాహ్లాదపరచుచున్నది. అవిగో అటు చూడుడు.

**హిమమకరందభరానత**

**తమస్వినీబుద్ధపుష్పతతి వెడలి, యుషో౽**
**ర్యమకరభిన్నోదరసాం**
**ద్రమనోజ్ఞామోదజలజతతి వ్రాలు నళుల్.** 46

**దుర్యో:** **(పరికించుచు)** అటు జూడుము , మరొక సుందర దృశ్యము.

**జలజాతాప్తకరప్రబోధితములై, స్వల్పాంగరాగమ్ములై,**
**చెలువుస్ దాము వికస్వరాంబుభవరాజీకర్ణికాంతఃస్థల**
**మ్ములలో నుండి వినిర్గమించు నళు లొప్పుస్ సుమ్ము, వైతాళికా**
**వళిసుఘ్ఘాదితసుప్రభాతవిగతస్వాపావనీశుల్ బలెస్.** 47

**కంచు:** దేవా! సువదనా తరళికలతోఁగూడ దేవిగారిచటనే యున్నారు. దయచేయుడు.

**దుర్యో:** నీవేగి నా రథమును సన్నాహపరుపుము. నేనును

దేవిని వీడ్కొని నీ వెనుకనే వత్తును.

**కంచు:** చిత్తము . దేవర యానతి. **(నిష్క్రమించును)**

**సఖి:** దేవీ! జ్ఞప్తి రాలేదా!

**భాను:** వచ్చినది. నేను మన ప్రమదోద్యానములోఁ గూర్చుండి యుంటిని .దివ్యరూపాతిశయమహిత మైన యొక నకులము నా యెదుట నహిశతమును వ్యాపాదించెను.

**ఇరువురు:** **(విషాదమును దాచుకొనుచు)** తరువాత?

**భాను:** భయమువలన సరిగ గురుతు దెచ్చుకొనఁ జాలకున్నాను. చెప్పెద నాగుము.

**దుర్యో:** **(పరిక్రమించి)** ఇదిగో! సఖులతో నేమో మాటలాడు చున్నది. ఈ లతామండపమువలన డాగి వీరి

విస్రబ్ధాలాపము లేమో విందును. **(ప్రక్కన దాగును.)**

సఖి: సంతాపము మానుము. చెప్పుము.

దుర్యో: సంతాపమా! ఈమెకు సంతాపకారణమేమొ కదా! శయనగృహమునుండి నాకుఁ జెప్పకయే వెడలి వచ్చుటచేత నాపై యలిగి యున్నదని యూహింతును. ఆ యలుకయే సంతాపహేతువై యుండును. దేవీ! నాపైననా నీకు కోపము?

**స్వాపమునన్ వివర్తనవశమ్మున నేఁ బెడమోముబెట్టినా**
**నో! పరిరంభబంధమున నూల్కొని నే సడలించికొంటినో!**
**యే పొరబాటుఁ గంటివొ సఖీ యిక యీ భవదీయదాసునం,**
**దోప భవత్క్రుధాభర మనూహ్యమసహ్య మపూర్వజాతమున్.** 48

**(చింతించి)** అవునింతే యై యుండును.

**గాఢమగుప్రేమ నాయెడఁ గల కతాన,**
**యేదియో నాదొసంగొకయింత దొరల,**
**దానఁ దానినుత్ప్రేక్షించి , తద్ద యలిగి**
**యున్న దీకాంత, పతి నేర మోర్చు నెవతె?**49

**భాను:** అంత నేనా దివ్యరూపాతిశాయినకులదర్శనమువలనఁ బొడమిన కౌతుకమునఁ జూచుచు నచ్చటనే యుంటిని.

దుర్యో: **(ఉలికిపాటుతో)** దివ్యరూపాతిశాయినకులదర్శనముఁ, గౌతుకమునా! ఒకవేళ మాద్రేయానురక్తయై యీ కులట నన్ను వంచించుచున్నదా యేమి? మూఢ దుర్యోధన! ఇపుడైన నీపైన యీమెకు గల గాఢమైన ప్రేమ తెలిసెనా! **(ఆలోచించి)** ఓహో! ఈ దుష్ప్రసంగలాలస వలననే

కాబోలు, నింత ప్రాతఃకాలముననే వివిక్తమున సఖులతోఁ
గలిసి యున్నది. అది యెరుంగక నే నేమేమియో
యనుకొనుచుంటిని. ఛీ! నారీజనకళంకమా!

**ఎంతటి భీరుభావ, మది యెంతటి సంభ్రమ, మెంత భక్తి, యిం**
**కెంతటి మెచ్చుకోలు వెలయించెదు నాయెడలన్ సమక్షమం,**
**దింతటి పాపచింతన, పరేచ్ఛయుఁ గల్గునటంచెరుంగ, నా**
**వంతయు మచ్చలేని కులమందునఁ బుట్టియు , నిట్టిశీలమా! 50**

సఖి: దేవీ! పిమ్మట!

భాను: నేన నా పీఠమునుండి లేచి సమీపలతామండపము
లోనికిఁ బోయినను, నన్ను వెన్నంటియే వచ్చెను.

దుర్యో: ఆహా! ఈ నీచురాలినేమందును?

**భాసురనిర్భరప్రణయభావము లుప్పతిలంగ, ము**
**న్నే సఖితోడఁ దాను వచియించెనొ మత్సురతోపభోగమున్**
**వేసట లేక, యా సఖిక వేడ్క నిజవ్యభిచారముల్ నిరా**
**యాసముగా వచింప నిసుమంతయు సిగ్గిల దెంత జాణయో! 51**

సఖి: దేవీ! ఆ తరువాత!

భాను: అంతట సగర్వకరప్రసారంబున నా స్తనాంశుకమునుఁ
బట్టుకొనియెను.

దుర్యో: స్తనాంశుకమును బట్టుకొనియెనట! ఛీ! ఇంకను
వినవలయునా! ఓరీ పరవనితావినోదాసాదప్రగల్భ!
మాద్రీసుత! నేటితో నీవు లేవు. **(పరిక్రమించి)** అట్లు
గాదు. తొలుత నీ కులటనే శిక్షింపవలయును.
**(మరలును)**

**సఖి:** దేవీ! తరువాత!

**భాను:** అంతట నార్యపుత్రప్రబోధకములైన ప్రభాతమంగళతూర్యా రావములవలన మేలుకొంటిని.

**దుర్యో:** **(సిగ్గుతో)** మేలుకొంటిననుచున్నది. ఈ చెప్పిన దంతయు స్వప్న వృత్తాంతమేమో! కానిమ్ము సఖి మాటలవలనఁ దెల్లమగును గదా!

**(సఖియుఁ జేటియు నన్యోన్యము సాభిప్రాయముగాఁ జూచుకొందురు.)**

**సఖి:** దేవీ! ఇందేమైన యమంగళమున్నయెడలఁ, దాన గానున్న కీడు, హోమదానవిప్రాశీస్సులచేత నివృత్త మగును గాక.

**దుర్యో:** నిస్సంశయముగా నిది స్వప్నగాథయే. ఔరా! శంకా విశ్వాసక్రోధములకు స్థానాస్థానములు లేవు గదా! కానిమ్ము మేలే యైనది.

**ఇది సగమాలకించి కనలెక్కి చనం దలపోయకుంట, యిం**
**తదనుక దాల్మి బూని తన దాపున కేగక యుంట, యిట్లు నా**
**హృదయపు శంకదీరఁ గథ యెల్ల వచించుట నిన్నిటస్ శుభం**
**బొదవె, విశుద్ధచిత్త సతి, యూరక వెంగలి యూహ సేసితిస్** 52

**భాను:** నాకుఁగూడ యిది యంత శుభసూచనముగా ననిపించుట లేదుగాని, యిందు గల యశుభ మేమందువు?

**సఖి:** అమ్మా! ఇది యంతయు నమంగళసూచనమే. క్రూరజంతువులు గలలలో గనబడుట యమంగళ సూచకమని స్వప్నశాస్త్రవిదులు దెల్పుదురు.ఇక

నకులము, పైపెచ్చు శతసర్పసంహారమును గూర్చి వేరే చెప్పవలయునా?

**దుర్యో:** ఇది యుక్తమే. నకులమొనర్చిన స్తనాంశుక గ్రహణాదికము గాని, యహిశతవ్యాపాదనము గాని కేవల మనిష్టసూచకము.

**జనులకు శుభాశుభమ్ములు పొనరునట్లు**
**స్వప్నములు గూడ పర్యాయవర్తనమున**
**నగు శుభాశుభావహము; లట్లయ్యు, దీన**
**శతమనెడు సంఖ్య మద్భ్రాతృశతముఁ దగులు. 53**

**(కన్నదరుటను సూచించి)** ఎడమకన్నదరుచున్నది! ఏమీ! దుర్యోధనునకు, నాకుఁగూడ దుశ్శకునములు బాధకములగునా! విజ్ఞులు చెప్పలేదా!

**స్వప్నశాస్త్రమ్ము, శకునశాస్త్రమ్ము, జ్యోతి**
**షంబు, కాకతాళీయఫలంబొసంగుఁ,**
**బేద మానిసి వీనికి బెదరు గాని,**
**ప్రాజ్ఞుడుగణింప బోవ డీపాటి వాని. 54**

కనుక నైజభీరువైన యీమెకుఁ దన కలవలనఁ గలిగిన భయమునుఁ బొగొట్టవలయును.

**భాను:** సువదనా! చూడుము. సహస్రరశ్మి యిపుడిపుడే ప్రయత్నదర్శనీయమండలు డగుచున్నాడు.

**సఖి:** అవును. పూజాసమయమైనది.

**భాను:** చేటీ! నీ వేగి పూజాద్రవ్యములు దెమ్ము. నేనింతలో బ్రత్యక్షదైవమగు నీ సూర్యభగవాను నారాధింతును.

**చేటి:** చిత్తమట్లే. **(నిష్క్రమించును).**

**దుర్యో:** ఇదే ప్రకాశపడుట కనుపైన సమయము.

**(పరిక్రమించును)**

**చేటి:** **(ప్రవేశించి)** అమ్మా! ఇదిగో! పూజావస్తుపాత్రము.

**సఖి:** **(చూచి చేటితో , జనాంతికము)** అయ్యో! మహారాజుగారు! ఇక దేవికి నియమభంగమైనట్లే తలపవలయును.

**(రాజు సమీపించి, చేసన్నచే చేటిని నిలిపి పూలసజ్జ తానే యందుకొనును.)**

**భాను:** **(సూర్యునకు నమస్కరించుచు)** భగవాన్! కర్మసాక్షీ! ప్రాగ్దిశావధూ లలాటకుంకుమాంక! ఏతన్నమస్కారార్చన ప్రీతుడవై దుస్స్వప్న దోషమునుఁ బరిహరించి సభ్రాతృకముగా నార్యపుత్రుని గుశలునిఁ గావింపుము. తరళికా! పూవులందిమ్ము. ఇతర దేవతలనుఁ గూడ యర్చింతును.

**(రాజు పూవులందించుచు, స్పర్శసుఖమనుభవించుచుఁ గ్రిందఁ బడఁ జార్చును.)**

**భాను:** **(కోపముతో)** ఏమే ప్రమాదము! **(మరలి చూచి సంభ్రమముతో)** అయ్యో ఆర్యపుత్రులే!

**దుర్యో:** సేవాప్రకార మపరిచితమగుటచే నేమరిన యీ నీ పరిజనునిఁ దగినట్లు శిక్షించుకొనుము.

**భాను:** **(లజ్జించుచు దల వాల్చుకొనును).**

**దుర్యో:** ప్రియా!

**సంభ్రమంబేల ? పరిజనచర్య సేయు**
**నన్ గటాక్షించి, మధురమందస్వరమునఁ**

**బలుకు సుదతి! నీ సేవకై పట్టినాడఁ,**

**బాణిసంయోజితాంజలిబంధ మిదిగొ! 55**

భాను: ఆర్యపుత్ర! తమరనుమతించినచో, నా కనుష్ఠింపఁ దగిన వ్రతమొకటి కలదు.

దుర్యో: (నవ్వి) నీ స్వప్న విషయమంతయును వింటిమి గాని, సహజకోమలమైన నీ తనూలతనూరక శ్రమపరుపకుము.

భాను: కాని, శంకాపీడితను. దయతో ననుమతి నిండు.

దుర్యో: శంకయా! ఏ విధమైన శంకయు నీకక్కర లేదు.

**తరుణీ నీవిటు ఖిన్నవైన , బహుళైతత్సైన్యసంరంభముల్,**
**గురుడున్ గర్ణుడికేటికిన్? సమరమున్ గోలాహలం బేల? వి**
**స్తరమత్సోదరబాహుకాననఘనచ్ఛాయాసుఖోపస్థితిన్**
**వెరపా! కౌరవకేసరీంద్రగృహిణీ? భీతిల్ల నీకేటికిన్? 56**

భాను: ఆర్యపుత్ర! తమరుండగా నా కే భయము నుండదు గాని, తమ మనోరథసిద్ధినే నిరంతరము గోరుచుందును.

దుర్యో: నా మనోరథసిద్ధి నీ చేత నుండగా, నీవే దానికై వేరు నియమములు దాల్చెదవా! ఇంతకు నా మనోరథ మేమియో తెలియునా?

**ప్రేమాబద్ధవిశాలలోచనయుగాపేయాంబుజశ్రీకమున్,**
**హ్రీమంద్రాస్ఫుటవాక్యమున్, స్మితలవక్రీడాస్థలమ్మున్, సదా**
**కామాస్త్రప్రతిమల్లమున్, నియమముక్తాలక్తకాగ్రాధర,**
**మీమోమున్ గనుచున్కి దుర్లభమనోభీష్టమ్ము మాకెప్పుడున్. 57**

**(తెరలోఁ గలకలము. )**

**భాను:** **(భయముతోఁ గౌగిలించుకొని)** ఆర్యపుత్రా! ఏమిది?

**దుర్యో:** **(చుట్టునుఁ జూచి)** దేవీ! భయపడకుము. ఏమియును లేదు.

**ధరణీరేణువు పెల్లురేగి చదలన్ స్తంభాకృతిన్ నిల్వ, భూ**
**మిరుహాంగమ్ముల రాయిడిన్ బొగ సమున్మీలంబు గాగన్, భయం**
**కరగంభీరపయోదనాదనిభఝూంకారప్రచారమ్ము, చం**
**డరయమ్మై పెనుగాలి వీచె నిదె కాంతా సంభ్రమబేటికిన్? 58**

**సఖి:** మహారాజా! ఆ దారుపర్వత ప్రాసాదమున కరిగి యుద్వేగకారి యైన యీ భీషణసమీరణ ప్రసారణమువలనఁ దొలగవచ్చును.

**దుర్యో:** ఈ వాత్య, యందరకు నుద్వేగకారి యైనను, నాకు మాత్రము తద్విపరీతము. ఏలయన,

**మా మదిఁ గల్గు కోరిక సమస్తము దీరగ, స్వప్నభీతయై**
**నీమము పేరు జెప్పి మము నిల్వగఁ జాల శ్రమించుచున్న యీ**
**లేమ కనిష్టతావ్యథయు లేక, పయోధరఘట్టగాఢమౌ**
**యీ మెయి కౌగిలింత నొదవించిన వాయువు నాకు మిత్రుడౌ. 59**

మీ రాజ్ఞి విచ్ఛిన్న నియమ యైనది గనుక సంపూర్ణ మనోరథుడనైన నాకు విహారావకాశము గలిగినది. దారుపర్వతప్రాసాదమునకే పోవుదము దారిఁ జూపుము.

**సఖి:** దేవా! ఇటు రండు.

**(అందరు వాయుబాధనభినయించుచుఁ బ్రయత్నమునఁ బరిక్రమింతురు)**

**దుర్యో:** ప్రియా!

**ధృతగమనబుద్ధి విడనాడు, తొట్రుపడక**

**యబల!ఇటురమ్ము మెలమెల్ల నడుగు లిడుము.**
**లలితభవదీయబాహువల్లరుల, మద్గ**
**ళమ్ము నవలంబనము జేసికొమ్మ కొమ్మ!.** 60

**(ప్రవేశము నటించి)** దేవీ! సంవృతమగు చోటగుటచే నిచ్చటికి వాయువు రానేరదు. కన్నులు దెరచి నలకలఁ దుడిచికొనుము.

**భాను:** అమ్మయ్య! ఇక్కడ వాయుపీడ లేకున్నది.

**సఖి:** మహారాజా! మా ప్రియసఖి యారోహణఖిన్నయై యున్నది. కనుక మీరీ యాసనవేదిక నలంకరింపుడు.

**దుర్యో:** **(పరికించి)** దేవీ! ఈ ప్రభంజనప్రచారము నీకుఁ బెద్ద బాధనే కలిగించుచున్నది.

**కనులతివిస్తరమ్ములివి, కాన యొకింతయు ధూళి యేచె; సు**
**స్తనభరితమ్మురస్స్థలము, స్వల్పవికంపనచేతఁగూడ వే**
**దనఁ గొనియెన్; బృథూరువులు దద్ద వడంకెను మందయానమం**
**దును; భవదంగకమ్ములిటు దోడ్పడ నిన్ను సమీరమేచెడున్.** 61

**(అందరుఁ గూర్చుందురు.)**

**దుర్యో:** **అతిసుకుమారదేహవు శిలాసనమందు వసింపనేల! యు**
**ద్ధుతవసనాంచలమ్ము, కడు తోరము , నా కనుపండువైన నీ**
**వితతనితంబమున్ నిలుప పీఠము గాఁదగు వస్తువొక్కటే**
**యతివ! త్వదీయవిభ్రమకటాక్షహరమ్ము మదూరుయుగ్మమే.** 62

**(తెరలో)**

విరిగినది ! విరిగినది!

**(అందరు సంశయముతోఁ జూచుచుందురు,)**

**కంచు:** **(ఉద్విగ్నుడై ప్రవేశించి)** దేవా విరిగినది!

**దుర్యో:** **(అసహనముతో)** ఏమిటది?

**కంచు:** మారుతౌద్ధత్యమున భగ్నమై.....

**దుర్యో:** ఆఁ ! ఏమి వదరితివి!

**భాను:** ఆర్యా! అమంగళము లాడెదవేమి?

**కంచు:** దేవా! నిజముగనే భీమవిజ్రంభణసమీ...

**దుర్యో:** ఛీ! వృద్ధాపశదా! మతి బోయినదా యేమి?

**కంచు:** దేవా! మతిభ్రాంతి గాదు. నిజమే చెప్పుచున్నాను.

**వాయుజాతమహోపప్లవమ్ము వలన,**
**భగ్న మయ్యెను దేవ భవద్ధ్వజమ్ము.**
**కలితకింకిణీక్వాణమాక్రంద మనగఁ**
**గూలె ధర నెల్లరము గనుగొనుచు నుండ.** 63

**దుర్యో:** మూర్ఖుడా! దానికింత రాద్ధాంతము జేయుట కది యేమైన యుత్పాతమా! సంక్షోభమా!

**ఉర్వి నున్న వస్తులనెల్ల యూపివైచు**
**తీవ్రమారుతధాటికి , దీర్ఘమగుటఁ**
**దట్టుకొనలేక , స్యందనధ్వజము గూలి**
**యుండుఁ , బెడబొబ్బలేల యిట్లుద్ధతముగ?** 64

**కంచు:** దేవా! ఏమియును లేదుగాని , యీ దుశ్శకునదోషము శమించుటకై తగు విధుల నాజ్ఞాపించెదరని స్వామిభక్తి వశుడనై యిట్లు జేసితిని.

**భాను:** స్వామీ! దుర్నిమిత్తము లొకదాని వెనుకనొకటి గలుగుచున్నవి. శాంతివిధు లవశ్యముగాఁ జేయింపఁ దగినవి.

**దుర్యో:** **(అనంగీకారముగాఁ గంచుకితో)** సరి సరి, నీ వేగి పురోహితున కెరిగింపుము.

**కంచు:** చిత్తము. తమ యానతి. **(నిష్క్రమించును)**

**(అంత నొక ప్రతీహారి సంభ్రమముతో బ్రవేశించును)**

**ప్రతీ:** **(త్వరగా సమీపించి )** మహారాజులకు జయము. సింధురాజమాతయుఁ , జెల్లెలు దుస్సలాదేవియు వాకిట నిలిచి యున్నవారు.

**దుర్యో:** **(తనలో)** సింధురాజమాతయును దుస్సలయునా! అభిమన్యువధక్రోధమునఁ బాండవు లేమైనఁ జేసి యుండరు గదా! వాడు జిక్కుటకు జయద్రథుడే ముఖ్యహేతువు. **(ప్రకాశముగా)** సత్వరము ప్రవేశ పెట్టుము.

**ప్రతీ:** చిత్తము. దేవర యానతి. **(నిష్క్రమించును)**

**(అంత రోదించుచు దుస్సలయు, సైంధవమాతయుఁ బ్రవేశింతురు.)**

**మాత:** నాయనా! దుర్యోధనా! కాపాడుము **(పాదములపైఁ బడును)**.

**(దుస్సల యేడ్చును.)**

**దుర్యో:** **(గౌరవముగ లేవనెత్తి)** అత్తా! భయపడకుము. ఏమి జరిగినది? అప్రతిహతరథప్రచారుడు జయద్రథుడు కుశలియే కదా!

**మాత:** నాయనా! ఇకనెక్కడి కుశలము?

**దుర్యో:** ఏమైనది?

**మాత:** పుత్రవధామర్షితుడైన కిరీటి 'నేడరుణాస్తమయమునకుఁ

బూర్వమే జయద్రధుని వధింతు' నని ప్రతిజ్ఞ సేసెనట.

**దుర్యో:** దానికా మీరింత వగచుట! ఆహా! ఎవడో తేలిక మానిసి పుత్రమరణశోకాకులుడై యేదో యనిన, దాని కింత యలజడియా! స్త్రీస్వభావమును గనబరచితిరే! చెల్లెలా దుస్సలా!దీనికై మీరింత భయపడవలసిన పనియేలేదు.

**మాత:** కుమారా! వారిపుడు పుత్రవధసంజాతక్రోధోద్ధతులై తెగించి చరించుచున్నారు సుమా! వారి యలుక సామాన్యమా! నేనెట్లు ధైర్యముగా నుండగలను! అందును ధనంజయు డనివారణీయవిజృంభణ ప్రతాపుడు గదా!

**దుర్యో:** **(నవ్వి)** ఆఁ! అవునవును. వారి యలుక మేమే కాదు. ఈ జగత్తంతయు నెరుంగును. గాండీవి మాత్రము నేనెరుగని వీరుడా!

**నలుగురు జూడఁ దత్సతిని నాడు మహాసభలోని కీడ్చి, మై**
**వలువల నూడ్చి, గేలి సలుపన్ బహుధా, భయవిహ్వలాంగియై**
**వలవల యేడ్చిన ష్డచట వాడును లేడె? కృతాస్త్రుడైన రా**
**ట్కులజున కంతకంటె నికఁ గ్రోధకరంబు మరొక్కటుండునే?** 65

అప్పుడు లేని పౌరుషప్రతాపములు వారికి నేడేమియుఁ గ్రొత్తగా రాలేదు. సంశయింపకుము.

**మాత:** వత్సా! ఫల్గునుడు, దన ప్రతిన నెరవేర్పలేనిచో నాత్మాహుతి గావించుకొందునని కూడ పలికినాడట.

**దుర్యో:** **(సంతోషముతో)** అనగా యుధిష్ఠిరుడు సానుజముగాఁ జచ్చె ననియే!

**మనకీ వార్త మహాముదావహమగుం, బార్థుండు పోరన్ సుయో**
**ధనగోపాయితునిన్ జయద్రథునిఁ జేతం జూపగానైనఁ జా**
**లునె? ప్రాణాంతకరప్రతిజ్ఞలనిటుల్ గుంభించి, భీముండు బో**
**యిన త్రోవం జను వీడుగూడ, భయమింకేలా ముదంబందుడీ! 66**

అదియుఁ గాక, ద్రోణాశ్వత్థామకృపకర్ణాదియోధ
సంరక్షితుండగువాని నర్జునుడేమి, మరొక్క డేమి, తేరి
పారఁ జూడలేడు. అత్తా! భయపడకుము. భయముతో నీ
సుతుని పరాక్రమమును నీవు విస్మరించినట్లున్నావు
గాని ,

**యమసుతునిఁ గవలనుఁ జెప్ప ననవసరమ.**
**యింక భీమార్జునులలోన నెవ్వడైన**
**యనవరతవృత్తచాపముక్తాస్త్రుడైన**
**సింధుపతి చెంతకైననుఁ జేరగలడె? 67**

**భాను:** నాథా! మీరన్నది నిజమే కాని, గాండీవి, యందును,
సుతహత్యాజనితక్రోధబహుగుణీకృతప్రతాపుండును,
నాత్మాహుతికే యుంకించి యున్నవాడును నగుట,
మనమించుక యోజింప వలసినదే

**మాత:** నీ తల్లికడుపు చల్లగ,సమయోచితమైన మాటఁబలికితివి.

**దుర్యో:** దుర్యోధనునకు, నాకుఁ గూడ పాండవులొక లెక్కలోని
వారేనా?

**కలికీ! ధిక్కృతశత్రువీరులు, కనత్కాండాసనుల్, త్యక్తవ**
**ర్మలు, శ్వేతాబ్జవనభ్రమావహమరుల్లోలాతపత్రుల్, మహో**
**గ్రులు మత్సోదరు లానతీయ, బహుళక్రూరాయుధాభీలముల్,**

**బలముల్ సర్వదిశాగతమ్ములు రిపు వ్రాతమ్ములన్ జీల్చెడున్. 68**

పాండవుల పస నెరిగిన నీవే యిట్లెతివేమి? కానున్న
దానిని మరలఁ జెప్పుచున్నాను, వినుడు.

**తమ్ముని యెడంద రక్తమ్ముఁ ద్రావుటందు,**
**నూరుభంగమ్మునందు వాయుజుని ప్రతిన**
**లెట్ల, యట్లయౌ సైంధవుపట్లఁ గ్రీడి**
**ప్రతిన ; పాటియే వారి బీరములు మాకు? 69**

**(తెరలోనికిఁ జూచి)**ఎవరక్కడ?నా రథముఁ బన్నింపుము.

**కంచు:** **(ప్రవేశించి)** జయము దేవా!. సర్వము సన్నద్ధము.

**గమన వశమునఁ గింకిణీగణము మ్రోయ,**
**వరలు మాలికల్ జామరప్రభలఁ బెనుప,**
**యమిత వల్గితాకులజాతిహయములొప్ప,**
**హృతవిరోధిమనోరథం బిదిగో రథము. 70**

**దుర్యో:** దేవీ! అభ్యంతరమున కేగుము . దుస్సలా నీవును నీ
మందిరమునకరుగుము.అత్తా!నిశ్చింతముగనుండుము.
జయద్రథుని రక్షించి,తన్మూలమున నా పాండవమధ్యమ
ప్రగల్భునకు నక్షత్రియోచితంబును నశస్త్రపూతంబును
నగు నికృష్టప్రాణనష్టంబునుఁ గల్గింతును.

**(అందరు నిష్క్రమింతురు) (తెర పడును.)**

**భట్టనారాయణుని సంస్కృత వేణీసంహారనాటకమునకు,**
**బొడ్డుచెర్ల సుబ్బారావు,జోగాంబల పుత్రుడు మార్కండేయ ప్రసాద్**
**చేసిన ఆంధ్రానువాదమునందు ఇది ద్వితీయాంకము.**

-*-

# వేణీసంహారము

## తృతీయాంకము

### ప్రవేశకము

**(అంతట వికృతవేషముతో వసాగంధయను రాక్షసి ప్రవేశించును.)**

**వసా:** ఆహాహా! యేమి నా యదృష్టము! నేటి దాక నేనెరిగిన యుద్ధములన్నియు నొక యెత్తు. ఈ కురుక్షేత్రమహా సంగ్రామ మొక యెత్తు. సమరమనిన నొక పాటి సమరమా!

**హతమనుజమాంసరాశు లవ్యయములయ్యె,**
**స్వాదుతరవసాఘటసహస్రమ్ములొదవెఁ,**
**దనివి దీరగ రక్తమ్ముఁ ద్రావుచుంటి,**
**నిట్లె యగుగాక రణము నూరేండ్లపాటు. 71**

అర్జునుడు గనుక జయద్రథవధము నాటి వలెఁ బ్రతి దినము సమరముఁ గావించెనా, నా యిల్లు సదా మాంసభాండసహస్రపరిపూర్ణమై యుండదా! **(స్మరించి)** మరి నా మగడు రుధిరప్రియుడు దానీ సంకుల సమరమున నెక్కడున్నాడో గదా! పిలిచి చూచెదను. **(బిగ్గరగా)** రుధిరప్రియా! రుధిరప్రియా!

**(అంతట నలసట నటించుచు రుధిరప్రియుడు ప్రవేశించును.)**

**రుధి:** **మిక్కిలి తిరుగుట స్రుక్కితి,**
**గ్రుక్కెడు ప్రత్యగ్రనిహతకోష్ణరుధిరమున్,**
**బుక్కెడు మాంసపు ముక్కలు**

**దక్కిన నా శ్రమము దీరు తత్క్షణముననే.** 72

**వసా:** అరే రుధిరప్రియా!

**రుధి:** **(చెవి యొగ్గి)** ఎవరది నన్ను బిలుచుచున్నది! **(చూచి)** అరే! నా ప్రియ వసాగంధ! **(సమీపించి)** వసాగంధా! ఏమి యిట్లరచుచున్నావు? అదిగో! ఆ మూల వేయిమంది జచ్చిరని వినఁబడుచున్నది.....

**వసా:** ఇదిగో! ఇప్పుడే చచ్చిన యొక రాజు శరీరమునుండి ప్రభూతస్నేహవసాసాంద్రమగు కవోష్ణరక్తమును, నగ్ర మాంసమును నీకొరకని తెచ్చితిని.

**రుధి:** **(ఆనందముతో)** మంచిపని చేసితివి. ఇటిమ్ము. మిక్కిలి యలసి యుంటిని, దప్పి గొంటిని.

**వసా:** ఈ యసంఖ్యేయనరవాజిగజశోణితప్రవాహముల మధ్య దిరుగుచునుఁ దప్పి గొనినావా! వింతగా నున్నదే!

**రుధి:** లేదు. నేను పుత్రశోకపీడిత యైన మన రాజమాత హిడింబాదేవిగారిని జూచుట కని యామె కడ కేగితిని.

**వసా:** పాప మామెకు ఘటోత్కచవధశోకమింకను నుపశమింప లేదా?

**రుధి:** మహావీరుడైన పుత్రునిఁ బోగొట్టుకొన్న యామె శోకమున కుపశమనమా! తనవలెనే యభిమన్యువధదుఃఖిత యైన సుభద్రయు యాజ్ఞసేనియు నోదార్చు**చుం**డగా నెట్లెట్లో తేరుకొనుచున్నది.

**వసా:** సరే. ఇదిగో ఏనుగుకపాలము నిండ వేడి నెత్తురును క్రొత్త మాంసమును. తిని త్రావి దప్పిఁ దీర్చుకొనుము.

రుధి: ఇంతకు నీ సమరావకాశమున రుధిరవసామాంసాదులనే మాత్రము సంపాదించితివి?

వసా: మునుపు దాచినది నీవెరుగుదువు గదా! నూతనముగ ద్రుపదవిరాటభూరిశ్రవోభగదత్తసోమదత్తబాహ్లికప్రముఖ నరనాయకుల దేహములనుండియు మరియుఁ పెక్కండ్రు ముక్కడి మూకల శరీరములనుండియు సంగ్రహించిన వసామాంసశోణితముల గుంభముల నిండ నించి గృహము గ్రిక్కిరియఁ దాచితిని.

రుధి: **(సంతోషముతో గౌగిలించికొని)** భళీ! నీ సుగృహిణీత్వ మిట్లుండుట చేతను, నేడు మన స్వామిని హిడింబాదేవి నాకప్పగించిన మహాకార్యము వలనను నా జన్మ ధన్య మైనది.

వసా: ఏమి మహాకార్య మప్పగించినది?

రుధి: రాజమాత నన్ను సాదరముగా రప్పించి, 'ఓరీ రుధిర ప్రియా! నేడు నీవు రణరంగమున భీమసేనుల వారి వెన్నంటియే తిరుగుచుండుము.' అని యాజ్ఞాపించినది. కనుక భీమసేనులవారి ననుసరించు నాకు క్షుత్పిపాసలఁ దీర్చు లెక్కకు మిక్కిలి యగు శోణితనదీ ప్రవాహములు స్వర్గసుఖముల నిచ్చటనే చూపునుగదా!

వసా: అవును గాని, యెందులకని భీమసేనులవారి ననుగమించి యుండుట?

రుధి: ఆయన దుశ్శాసనుని గుండెఁ జీల్చి నెత్తురుఁ ద్రావుదు నని ప్రతిజ్ఞఁ జేసెను గదా! ఆ సమయమున, రాక్షసుల

మైన మనచే నావిష్టుడై త్రావవలయునని.

**(తెరలోఁ  బెద్ద కలకలము. ఇరువురును విందురు. )**

**వసా:** ఏమా పెను కలకలము?

**రుధి:** **(చూచి)** అడుగో! ధృష్టద్యుమ్నుడు గత్తితో ద్రోణాచార్యుని శిరస్సు నరకి దేహమును రథముమీదినుండి క్రిందకు దొరలించుచున్నాడు. పితృవధప్రతీకారము గాబోలు!

**వసా:** ఏదైన నేమి! రమ్ము ద్రోణుని రక్తముఁ ద్రావుదము.

**రుధి:** బ్రాహ్మణరక్తము జోలి మనకేల? అది కంఠముఁ గాల్చును. మరొకవైపునకుఁ బోవుదము రమ్ము.

**(తెరలో మరల గలకలము.)**

**వసా:** ప్రియా! మరల యీ వైపున నేదియో గోల యగుచున్నది!

**రుధి:** **(తెరలోఁ జూచి)** అవును. అడుగో అశ్వత్థామ కత్తి దూసికొని ఇటే వచ్చుచున్నాడు. ఇది జూచెనేని ధ్రుపదసుతునితోఁ బాటు మనలనుఁ గూడ మట్టు బెట్టును. త్వరగాఁ దప్పుకొందము పద.

**(ఇరువురును నిష్క్రమింతురు.)**

**(ఇది ప్రవేశకము.)**

**(అంతటఁ గలకలము నాకర్ణించుచు ఖడ్గధారి యైన యశ్వత్థామ ప్రవేశించును.)**

**అశ్వ:** **ప్రళయసమీరసంక్షుభితవారిదసంచయఘోరఘోషణా**
**వళికిఁ బ్రతిత్వ మొంది, శ్రుతిభైరవమై, భరితాంతరాళమై**
**యలజడి వించు నల్లదె రణావనినుండి, యభూతపూర్వమీ**

**కలకల, మింత రాయిడికిఁ గారణమేమయి యుండనోపునో?** 73

**(ఆలోచించి)** ఏముండును! యౌవన మదముచేత, యే
భీముడో, యర్జునుడో, సాత్యకియో తండ్రిగారినిఁ దాకి
మేరమీరి యుండును.అంతనాయన శిష్యవాత్సల్యమును
విస్మరించి తనకు దగిన రీతినఁ బరాక్రమించి యుండును.
తప్పక యంతే.

**కురుపతిసైన్యనాయకునకుస్ భృగురామసుశిక్షితాస్త్రసం**
**భరణపరాక్రమాఢ్యునకుఁ, బ్రౌఢధరాజగదేకధన్వికిస్,**
**దురమునసెట్లు జేయఁదగునో యటులిప్పుడు జేసి చూపగా**
**దొరకొని యుండు మత్పిత, విధూతవిరోధిబలప్రధానుడై.** 74

**(వెనుకకుఁ జూచి)**ఎవరక్కడ! రథమునుఁ దెమ్మురా!
సమరభూమికరిగి తండ్రిగారి విక్రమవిహారముఁ
గన్నులారఁ గాంతును. పోనీ, రథమేల! నీటి మొగిలుపై
మెరుపు వలె మెరుగులు గ్రమ్ముచు, వెండి పిడితో
వెలుగుచు, శత్రుప్రాణానిలమహాహియై మెరయుచున్న
యీ ఖడ్గరాజముఁ జేకొనియే రణభూమి కరుగుదును.
**(కొంచెము నడచి)** ఇదేమి, యెడమ కన్నదరుచున్నది!
అశ్వత్థామకుఁగూడ దుశ్శకునములవలన వెరపు
గలుగునా! **(ఆటోపముతో బరిక్రమించి)** అరే! ఇదేమి?

**అరయక రాచపాటి విడనాడి, మహీశుడు జేయు మన్ననల్**
**మరచి, భయాకులాత్ములయి, మార్మొగమైరి మహారథుల్, చమూ**
**వరులును నిల్వరింపఁగల వారొకరేనియుఁ గానరారు, సం**
**గరమున వెన్నుఁ జూపి కులగౌరవముస్ జెడఁగొట్టుకొందురే!** 75

అదియునుఁ గాక, నా తండ్రి సేనాముఖమున నుండగా
గూడ వీరికీ లఘుచేష్టలేమి? ఆహా! కర్ణాదిప్రముఖ
యోధులు గూడ పరచుచున్నారే! ఛీ!ఛీ! నిలువరింతును
గాక! **(బిగ్గరగా)** ఓహో! కౌరవ చమూసముద్రవేలాపాలన
మహీభృన్మహీభృత్తులారా!

**భండనము వీడఁ జావు రాకుండునేని,**
**యర్థమగుఁ బలాయనకర్మమాశ్రయింప,**
**నెల్లరకుఁ జావు నిత్యమంచెరిగి కూడ**
**పిరికి చేష్ట లివేటికి, పేరు మాయ? 76**

నిలువుడు. నిలువుడు. అయ్యో! ఏమంత యపాయము
సంభవించినది?

**అరిబలవార్ధిగర్భబడబానలుడున్ సకలాస్త్రవేత్తయున్**
**గురుడు సమస్తధన్వులకుఁ గుంభజుడుండగ సైన్యనేతగా,**
**వెరచెదవేల కర్ణ! చను వెన్కకు మాతుల! శంకవీడు మ**
**ద్రరమణ! ద్రోణుడే రణభరంబునుఁ బూన భయంబికేటికిన్? 77**

**(తెరలో)**

ఇక యెక్కడి ద్రోణుడు!

**అశ్వ:** **(విని )** ఏమీ! ఇక యెక్కడి ద్రోణుడా! **(క్రోధముతో)** ఓరీ!
క్షుద్రుడా! ఇట్లు వదరిన నీ నాలుక యీ పాటికిఁ జీలి
యుండ లేదా!

**ఇనులొక మూడునాల్గులుదయింపరు విశ్వమునెల్ల గాల్పగన్,**
**జనవిట సప్తవాయువులు సప్తవిధంబులఁ జీలి దిక్కులన్,**
**గనబడవే దివిన్ బ్రళయకాలఘనంబులు , శౌర్యరాశి మ**

**జ్ఞనకున కిట్లమంగళపు వాక్కులు బల్కెదవేల పాపిపై?** 78

**(క్షతగాత్రుడైన సారథి ప్రవేశించును.)**

**సార:** **(ఏడ్చుచు)** కుమారా! కాపాడుము. కాపాడుము.

**(పాదములపైఁ బడును)**

**అశ్వ:** అరే! తండ్రిగారి సారథి యశ్వసేనుడు! త్రిజగత్త్రాణ సమర్థుడు తండ్రిగారికి సారథివి గదా,నన్నాశ్రయింప నేల!

**సార:** **(లేచి దిగులుగా)** ఇక నెక్కడి నీ తండ్రి నాయనా!

**అశ్వ:** **(ఆవేగముతో)** ఏమీ! తండ్రిగారే లేరా?!

**సార:** **(నెమ్మదిగా)** అవును.

**అశ్వ:** హా తండ్రీ! **(మూర్ఛిల్లును).**

**సార:** **(పట్టుకొని)** కుమారా! నిగ్రహించుకొనుము.

**అశ్వ:** **(తెలిసి)** హా తండ్రీ! సుతప్రణయ! లోకైకధనుర్ధర! పరశురామ ప్రియశిష్య! ఏమయితివి? పలుకవేమి?

**(విలపించును)**

**సార:** నాయనా! ఊరడిల్లుము. ఆ మహనీయుడు వీర పురుషోచితమైన గతి నందెను. నీవు ధైర్యము నవలంబించి శోకసాగరమునుఁ దరింపుము.

**అశ్వ:** **(కన్నీటినిఁ దుడిచికొనుచు)** ఆర్యా! అంతటి సమగ్రభుజ శౌర్యనిధి యెట్లస్తమించెనో గదా!?

**భీమునిమీది కూరిమికి భీము గదాహతిఁ గాన్కఁ గాంచెనో!**

**సార:** శాంతం పాపం.

**అశ్వ:** **ప్రేమము నెంచకర్జునుడె వీతనయుండయి యిట్లు సేసెనో!**

**సార:** అది యసంభవము గదా!

**అశ్వ:** **తా మును సేయు బాస దిగఁద్రావి మురారియె చక్రమెత్తెనో!**

**సార:** కాదు వత్సా!

**అశ్వ:** **ఏ మగవార లింక సమయింపగ శక్తులు వోర మద్గురుస్?** 79

**సార:** కుమారా! వారు వీరులే కాని, యాయన ముందు వీరులు గాఁజాలరు గదా!

**అమ్మహనీయుడే కుపితుడై సశరుండయి నిల్వ నాజిలో**
**నిమ్ముగురైన గాని సరియే త్రిపురారికిఁబోలె? తీవ్రశో**
**కమ్మున మున్గి శస్త్రమెడగాఁ బడపైచిన యంతలో, యనా**
**ర్యమ్మొనరించె, దుష్టరిపు డక్కట! యల్పు డనల్పబుద్ధికిస్.** 80

**అశ్వ:** ఐన మరి శోకమునకుగాని శస్త్రత్యాగమునకు గాని కారణ మేమి?

**సార:** తన కుమారుడే.

**అశ్వ:** ఏమి! నేనా? అదెట్లు?

**సార:** అవును. వినుము.

**ఋజువచనుడనుకొన్న ధర్మజుడు నేడు**
**సమరమందు 'నశ్వత్థామ జచ్చె' ననుచు**
**నరచి, 'గజ' మని మెల్లగా ననియెఁ జివర.**
**సత్యవాక్కగు నతనిపై బ్రత్యయమున**
**బాష్పములతోడ్ శస్త్రముల్ వదలె గురుడు.** 81

**(ధర్మజుండు గొంతెత్తి మీ తండ్రి వినగఁ**
**జచ్చె జచ్చె నశ్వత్థామ జచ్చె ననుచు**
**నరచి, 'గజ' మని మెల్లన ననియెఁ జివర.**
**సత్యవాక్కగు నతనిపై బ్రత్యయమున**

**బాష్పములతోడ శస్త్రముల్ వదలె గురుడు.)** 82

**అశ్వ:** తండ్రీ! నీ సుతవాత్సల్యము యుధిష్ఠిర ప్రేమాతిశయము, నేటికీ రీతిగా బరిణమించినవా!

**(దుఃఖించును)**

**సార:** కుమారా!నీ వంటివాని కీ రోదనము దగునా! మానుము.

అశ్వ: తండ్రీ!

**నా మిథ్యామృతి విని నీ**
**వా మెయి శస్త్రములతోడ నసువులు బాయన్,**
**నీ మృతి నెరిగియు బ్రదికితి,**
**యీ మిక్కిలి ప్రేమ వ్యర్థ మీ క్రూరునిపై.** 83

**(మరల మూర్ఛిల్లును)**

**(కృపుడు ప్రవేశించును)**

**కృపు:** **(నిట్టూర్చి)**

**నృపసభ నట్లు ద్రౌపదిని, నేడు రణావని ద్రోణునిట్లు, ని**
**స్త్రపత, శిరోరుగ్రహపరాభవభాక్కులఁజేయ, బొమ్మల**
**ట్ల పలుకకున్న యీ నృపతు లందరు నేటికి ? పార్థులేల? జా**
**తిపరువు చేటుగా ధనువుఁ ద్రిప్పెడు మాదృశులేల? కాల్పనే?** 84

ఛీ! ఏ మొగముతో నశ్వత్థామనుఁ జూడగలను!

**(చింతించి)**

**లోకవర్తన మెరిగిన ప్రోడ గాన,**
**నితడు దుఃఖభారము సహియింప నేర్చుఁ**
**గాని, పితృపరాభవవార్త గనుక తెలిసె**
**నేని, క్రోధవేగమున నేమైనఁ జేయు.** 85

స్వభావముచేతనే యీతడు తీవ్రుడు.

**కలిగె కృష్ణాశిరోరుహగ్రహఫలమ్ము**

**దారుణమ్మగు నీ ప్రవిదారణమ్ము,**

**జరుగఁగలదీ ద్వితీయకేశగ్రహమున**

**విశ్వనాశనకరమైన విప్లవమ్ము.** 86

**(పరిక్రమించి)** అశ్వత్థామ యిచ్చటనే యున్నాడు.

**(సమీపించును)**

**అశ్వ:** **(తెలిసి)** హా! సకలభువనైకధనుర్ధర! తండ్రీ! **(ఆకసము వంక జూచుచు)** ధర్మరాజా!

**వితథములాడవీవెపుడు, ద్వేష్యులు లేమి యజాతశత్రువే**

**యితడని పేరుగాంచి, తిపు డంతయు నొక్కట వీటఁబోవ, నీ**

**గతి గురుడంచు విప్రుడని గాని గణింపక కల్లలాడగా**

**మతిఁ బొడమించె నీకు కృపమాలిన దైవము, నా యభాగ్యతన్.** 87

**సార:** నాయనా! మామ శారద్వతులు వచ్చియున్నారు.

**అశ్వ:** **(చూచి, డగ్గుత్తికతో)** మామా! ఈ ఘోరవార్తను వింటివా!

**నెయ్యముమీరఁ బల్గతుల నీ పరిహాసము సైచువాడు, నీ**

**వియ్యపుబావ, యుగ్రరణవేళలఁ దోడును, శూరరాజికిన్**

**గయ్యపు తీట మాన్పఁ గల గండరగండడు, సైన్యనేత, మా**

**యయ్య ధనుర్గురుండు సమరావని నేమయిపోయె! చెప్పవే! 88**

**కృపు:** ఎరుక చాలినవాడవు . నీకేమి చెప్పుదును? ధైర్యమూనుము.

**అశ్వ:** అవును. నిరర్థకముగా జీవించుటకంటె బుత్రవత్సలుడైన తండ్రిం జేరుటయే యుక్తము.

**కృపు:** అది నీవంటివాడు జేయఁదగినది గాదు గదా!

**సార:** కుమారా! ఏల యిట్టి దుస్సాహసము?

**అశ్వ:** అట్లు గాదు మామా!

**సుతవియోగభారమ్ముచే బ్రతుక వెరచి**
**యసువులను బాసె నా తండ్రి యైచ్ఛికముగ,**
**నట్టి వాత్సల్యమూర్తి నే ననుగమించి**
**నిత్యదర్శనప్రీతి సంధింతు నయ్య. 89**

**కృపు:** వత్సా! దీనికి పరంపరాప్రసిద్ధమైన సముదాచారమే కలదు గదా!

**బ్రదికి యున్న వారిఁ బరిచర్య లొనరించి,**
**చనిన వారిఁ దగిన శ్రాద్ధవిధులఁ,**
**దనుప వలయు నండ్రు తలిదండ్రులనుఁ బుత్రు**
**లింకఁ దనువు బాయ నేల నీకు? 90**

**సార:** నాయనా!మామ జెప్పినది సత్యము,ననుసరణీయమును.

**అశ్వ:** నిజమే. కాని శోకభారమువలనను, పిత్పవియోగము వలనను క్షణమైనను జీవింప శక్యము గానట్లున్నది. కానిమ్ము. తండ్రిగారు పడియున్న చోటికరిగి తనువు నైనను కనులఁ జూతును. **(లేచుచు ఖడ్గముఁ జూచి యాలోచించి )** ఇంకను నీ వృథాశస్త్రాలంకారము మాత్ర మేల? ఓ శస్త్రరాజమా!

**కూడనిదయ్యెఁ,బౌరుషముకోసము దాల్చి, 'యమోఘ' మంచు నె**
**వ్వాడు ప్రశస్తి నీకొసగె, వాడె విరక్తతఁ జేసి నిన్నుఁ దా**
**వీడెఁ, దనూజశోకమున వీరవరేణ్యుడు; నేనుగూడ నిన్**

వీడెద, నీకు స్వస్తి యగు, వీరిడి చేతుల శస్త్రమేటికిన్? 91

(కత్తిని విడుచును)

(తెరలో)

ఓ మహీపతులారా! కౌరవ పాండవయోధాగ్రణులారా!

ఆచార్యభారద్వాజునకు నీ నీచు డొనరించు నసహ్యమగు

పరాభవము నుపేక్షింతురేమి?

అశ్వ: (విని, మెల్లగఁ గత్తి నందుకొనుచు, బొమముడి వైచి)ఏమీ!

ఆచార్యభారద్వాజునకా? పరాభవమా?

(మరల దెరలో)

భువనగురుండు ద్రోణుడటు పుత్రమృతిశ్రవణోత్థశోకభా

రవశత, ఖిన్నుడై శరశరాసనముల్ ద్యజియించి యుండ, భై

రవత, సితోత్తమాంగముఁ గరమ్మునఁ బట్టి ఖరాసిఁ ద్రుంప, నో

యవనిపులార! కన్గొనుచు నక్కట! సైచెద రేల పార్షతున్? 92

అశ్వ: (విని, కోపముతో వణకుచు) ఏమది !

విలువీడి నియమ మూనిన

తలపండిన గురుని మౌళితలమున, ఖలుడై

యలుగెత్తి వ్రేసెనే రిపు?

డులుకు పలుకు లేక,చూచుచుండిరె నృపతుల్?93

కృపు: ఆత డట్లే ఘోషించుచున్నాడు గదా!

అశ్వ: ఆ దుర్మార్గుడు నా తండ్రి తలమీదనే చేయి వైచెను గా!

సార: కుమారా! ఆ తేజోరాశి కిదియే కాగూడని, మున్ను కాని,

పరాభవము.

అశ్వ: హా! జనకా! నా వంటి కృపణుని నిమిత్తమున శస్త్రపరి

త్యాగ మొనర్చుటవలన గదా తుదకీ నీచపశువుచేత
గూడ నీకీ పరాభవము ప్రాప్తించినది! వాడు నీ తలపైఁ
జేయిడుట యనగా నా తలపైఁ గాలిడుట గాదా! సరే!

**అతిశోకాకులచిత్తతాగతరణవ్యాపారమైనట్టి న**
**ష్టతనువ్రాతములన్ శ్వకాకములలో ధృష్టద్యుమ్నుడో సంస్పృశిం**
**చుత, దివ్యాస్త్రబలోద్ధతాత్ముడను సచ్ఛూరుండ నేతత్కృతి**
**ప్రతి గా వాని శిరస్సుపై నిదిగో నా పాదంబు నే పెట్టెదన్.** 94

ఓరీ! పాంచాలపశువా!

**బాలిశవృత్తివై, గురుని వాల్గయికోమి నెరింగి కూడ, శం**
**కాలవమేని లేక , చనఁ గాలము దాపురమైన నీవు, త**
**న్మౌళిని బట్టునప్డు, గురునందనుఁ, బాండవసైన్యతూలవా**
**తూలనిభున్ ననున్ మరచితో! స్మరియించియు లెక్క సేయవో!** 95

ఛీ! విప్రగౌరవమెరుగని ద్రుపదుని కొడుకవు నీ వేమైనఁ
జేయుదువు. నీకు కార్యాకార్యము లేమి? అమిథ్యావాదీ!
ధర్మనందనా! భీమార్జునులారా! తుదకు వాసుదేవుడైన
మీకు బోధింప లేక పోయెనా!

**ఆచార్యుండు సమస్తధన్వులకు, మీ కాబాల్యమున్ దేశికుం**
**డై, చాపాదిసమస్తయుద్ధకళలభ్యాసంబు జేయించి, వి**
**ద్యాచాతుర్యమొసంగినట్టి ద్విజు, నా తండ్రిన్, వయోవృద్ధు, నా**
**నీచుండట్లు శిరంబుఁ బట్టినను వానిన్ మీరుపేక్షింతురే?** 96

ఇది నా దౌర్భాగ్యమా, మీ కావరమా! హుఁ!అట్టి మనుజ
పశువును దండింపని మీరందరునుఁ బాతకులే.
ఎవ్వరినిఁ దక్కువగా నెంచరాదు. మామా! ఇది వినుము.

**ఇంచుక యైన గౌరవము నెంచక యీగతి పాపియై ప్రవ**
**ర్తించిన వానితో, ననుమతించిన వారిని, దానిఁ గాంచి సై**
**రించినవారి నెల్ల, సకిరీటిమురారిమరుత్సుతంబుగాఁ**
**ద్రుంచి, రణోర్వికిన్ రుధిరరోచులతో బలులెత్తి చిమ్మెదన్. 97**

కృపు: వత్సా! ద్రోణునంతవానికి నీకది యసాధ్యమా!

అశ్వ: ఓరీ! క్షత్రియకులకళంకములారా! పాండవమాత్స్య పాంచాలాదివీరమ్మన్యులారా!

**నిలువుడు వెన్క దీయకిట, నిల్వున నీరొనరింతు మిమ్ము, బొం**
**కులు సయిదోడుగా నిలుపుకొన్న మహా కుటిలాత్ములార! రా**
**ట్కులకృతదోషరుష్టమునికుంజరునిన్ జమదగ్నినందనున్**
**దలపక పోరు నేడు, సముదగ్రమదుగ్రరణాతిభీతులై. 98**

సారథీ! నీవేగి సాంగ్రామికోపకరణసన్నద్ధమగు నా రథముఁ దెమ్ము.

కృపు: వత్సా! అవశ్యప్రతికర్తవ్యమైన యీ దారుణపరాభవాగ్నిఁ జల్లార్పఁ గలవాడు మనలో నీవుగాక మరెవరు? అట్లయ్యును,

అశ్వ: ఇంకనేమి?

కృపు: నీవు సేనాపతిత్వాభిషిక్తుండవై రణమ్మునకరుగుట మంచిదని తలంతును.

అశ్వ: మామా! అది మన చేతిలోని పని గాదు గదా! ఐనను,

**అందరు జూడ, నాహవమునం దొక దుష్టుడు త్యక్తచాపు, దం**
**డ్రిం, దల బట్టి కోయుట నెరింగియుఁ దత్ప్రతిచర్యగాగ వా**
**నిం దునుమాడబోక , 'యవనీధవ! సైన్యపతిత్వమిమ్మ ' టం**

**చుం దిరిపెంబు లెత్తుదునె! చొప్పడి మాత్ర మదేమి గూర్చెడుస్?99**

సేనాపతిని గానంత మాత్రమున నా భుజబలప్రతాపశౌర్య
మహాస్త్రములు కొరత వడునా యేమి?

**కృపు:** నాయనా! నీకిది యకించిత్కరమే కావచ్చును గాని,
కౌరవపక్షమునకుఁ గాదు. ఎందుకనిన,

**లేడు భీష్ముడు, నీ తండ్రి లేడు, నేడు.**
**వారి సాటివి నీవ యీ భార మూన**
**వలయు; లేకున్న పాండవ పార్థతులకు**
**మారు నిలువంగ నేర్చునే మనబలమ్ము? 100**

చూడఁజూడ నిది పరతంత్రమునుఁ గాదు. సన్నాహ
విజృంభితుండవగు నీకు, యుధిష్ఠిరబలములే కాదు
ముల్లోకములైనను నొక లెక్క లోనివి గావని యెరిగి
యుండుటచే, కౌరవరాజుగూడ తానే యభిషేకోప
కరణములతో నీకై చూచుచుండు నని తలంచెదను.

**అశ్వ:** అట్లయిన,గురువధఖిన్నుడైన దుర్యోధనుని సైనాపత్య
స్వయంగ్రహణాదరమ్మున నాశ్వాసింతును. పరాభవాగ్ని
దందహ్యమానమగు నా మనమ్ము ప్రతీకారజలావగాహా
ర్థము తహతహలాడు చున్నది.

**కృపు:** ప్రతీకారము,ప్రభుకార్యము,రెండునుఁ దుల్యప్రతిపత్తికము
లే. పద, సుయోధనుని యొద్దకుఁ బోవుదము.

**(పరిక్రమింతురు.)**

**(అంతట రెండవైపునుండి కర్ణుడును, దుర్యోధనుడును బ్రవేశింతురు.)**

**దుర్యో:** కర్ణా!

**అరిహతబంధుశుగంబుధి**

**దరిఁ జేరును వీరుడాయుధప్లవములచే,**

**మరి సుతుని చావు విని, యని**

**గురు డస్త్రములేల విడచెఁ గోపంపు తరిస్?101**

లేక, స్వభావో దురతిక్రమః యన్నట్లు, శోకాంధుడగుట,

క్షాత్రధర్మ కార్కశ్యము వీడి విప్రజాతినైజమగు

మార్దవము నవలంబించె నేమో!

కర్ణు: మిత్రమా! కాదు. అశ్వత్థామ జచ్చెనే యనుకొందము.

పోయి ధర్మజు డది వాని తండ్రికిఁ జెప్ప వలయునా!

ఇంతదనుకః జచ్చినవారి వార్తల నెవరైన రణమధ్యమునఁ

బనిఁ గట్టుకొని పోయి వారి వారల కెరిగించిరా? ఒకవేళ

చెప్పినను, అది విన్నంతనే, క్షణమాత్రమున

నస్త్రసన్యాసముఁ జేయునా?

దుర్యో: మరి యీ యస్త్రత్యాగ మెందుల కందువు?

కర్ణు: **వినుము నరేంద్ర! యీ జరఠవిప్రుడు సర్వమహీపతిత్వముస్**

**దనయుని నెత్తికెత్తుటకుఁ దా మునుగోరుచు నుండువాడు; త**

**త్తనయుడ చచ్చెనన్న యిక దండుగ భండనభారమంచు నీ**

**పని నొనరించె, సైన్యపతి బాధ్యత నెంచక వీసమంతయుస్.** 102

దుర్యో: **(సాలోచనముగా)** ఐనఁ గావచ్చును.

కర్ణు: అంతే కాక, యింత దనుక నాతడు పేరుమోసిన

ప్రత్యర్థుల నెవ్వరినిఁ జంపకుండుట యేలనో తెలియునా?

**మీరును మీరుఁ బోరునెడ మేదినిఁ గల్గు సమస్తభూపతుల్**

**జేరిరి రెండువైపులనుఁ, జిక్కిన దీయవకాశ, మీ మిథో**

**మారణకాండ నెట్లయిన మ్రందుదు రందరు, దాన నుర్వి ని**
**ర్వైరముగా లభించునని వైరులఁ దానయి చంపడెవ్వరిస్.** 103

కాని, పాప మెవరినిఁ జంపకున్నను, ప్రాయము పైబడి సగము చచ్చిన విరాటుని, పూర్వపరాభవజాతక్రోధముచే ద్రుపదుని మాత్ర మెట్లో కూల్చెను.తుదకు దన యుపేక్ష చేతనే తమ్మి మొగ్గరముఁ జొచ్చిన యభిమన్యుని నేకాకిని సైతము, తానుగా నేమియుఁ జేయక నన్నును నిన్నునుఁ గవియించెను గదా!

దుర్యో: **(తలయూచి)** లెస్సగా బలికితివి.

**అట్ల కాబోలు, లేకున్న నభయమిచ్చి**
**కూడ సైంధవుస్ గ్రీడిచేఁ గూలనీడు.**
**తలచి యుండినఁ దన కసాధ్యమ్మె చెపుమ,**
**సైంధవుం గావ, బార్థులఁ జంపుటేని!** 104

కర్ణు : మిత్రమా! మరొకటి. అతనిపై గురుభావమును మాత్రమే చూపు నీ వెరుగవు గాని,

**బాల్యముననుండి ద్రుపదభూపాలు డితని**
**వక్రబుద్ధుల నెరిగిన వాడు గానఁ,**
**జెంత నుండనిచ్చినఁ జేటుఁ జేయు నని గ్ర**
**హించి, రాజ్యమునుండి బహిష్కరించె.** 105

దుర్యో: నిస్సందేహముగా నట్లే.

కృప: నాయనా! కురురాజడుగో! కర్ణునితో నేమియో మాట లాడుచు నీ న్యగ్రోధచ్ఛాయయందున్నాడు.

అశ్వ: **(సమీపించి)** కురురాజునకు జయము.

దుర్యో: **(చూచి)** కృపాశ్వత్థామలా! **(కృపునితో)** ఆచార్యా!
నమస్కారములు.**(అశ్వత్థామతో)**మిత్రమా!గురునందనా!

**మముమన్నింపుమ క్రూరులన్ ఖలుల, నస్మత్కార్యసంసిద్ధి య**
**త్నములన్ దండ్రినిఁ గోలుపోవలసె నన్నా! నీకు,**
**( కౌగిలించుకొని) నెంతెంత క**
**ష్టములన్ సైతము నాకుఁ దావకపరిష్వంగమ్ము చిత్తవ్యథా**
**శమమున్ గూర్చును, ద్రోణపాదయుగళస్పర్శంబుబో లెన్ సఖా106**

**(ప్రక్కనఁ గూర్చుండఁబెట్టుకొనును)**
**(అశ్వత్థామ కన్నీరు నించును)**

కర్ణు: ద్రోణాత్మజా! ప్రాజ్ఞుడవు, నీకీ విలాపము తగదు. ధైర్యముఁ దెచ్చుకొనుము.

దుర్యో: సోదరా! ఈ వ్యసనముపట్ల నీకును నాకును భేద మేమియు లేదు. ఎట్లందువా!

**నీకుఁ గన్న తండ్రి, నాకుఁ బితృసఖుండు**
**నీకుఁ బో లె గురుడు నాకుఁ గూడ,**
**యట్టి మహితు గూర్చి యనుతాప మేనువా**
**కొనగఁజాల నెరిగికొనుము నీవె. 107**

కృప: నాయనా! కురునాథుని మాటలు నిక్కువములు. నీ కెంతయో తనకును నంతయే దుఃఖము గదా!

అశ్వ: రాజా! నీవింత ప్రేమఁ జూపుటచే నాకు శోకమన్న తగ్గఁగలదు గాని, యొక్కటి మాత్రము మనసు నెరియించుచున్నది.

**కొడుకు బ్రదికియుండ, గురునిఁ గుంభజు నరుల్**

మౌళిఁ బట్టి యీడ్వఁ జాలిరనిన,
నింక సుతుల వలన నేయాసతోఁ బ్రేమ
మూనువారు జగతి నున్న వారు? 108

కర్ణు: గురుపుత్రా! నీవన్నట్లు సర్వత్రాణక్షముండైన ద్రోణున
కిట్లగుట మాకందరకుఁగూడ వ్యథఁ గూర్చుచున్నది.కాని,

మనలో నెవ్వరికే యపాయమయినం బైబడ్డచో, వచ్చి చే
కొన శక్తుండని నమ్మియున్న గురుడే, ఘోరాజిలో నేడ్చుచున్
ధనువున్ బాణములున్ ద్యజించి, తనకై తాఁ గోరి కావించు కొ
న్ననిటుల్, జేయునదేమి యెవ్వరయినన్? గన్నీటితోఁ జూచుటే109

అశ్వ: రాధేయా! ఏమంటివి? 'ఎవ్వరైనఁ జేయునదే' మనియా!
'ఎవరో' చేయలేకపోవచ్చును. కాని, నేను లేనా?
చేయునది, చేయబోవునది , యిది.

భుజమదంబునఁ బాండవుల పక్షమునఁజేరి
శస్త్రమెత్తిన ప్రతి క్షత్రియుండు,
పురుటి కందులతోడఁ బిరికి బాంచాలసం
తతిలోన మిగిలిన ప్రతి జనుండు ,
గురునంతవానికా ఘోరావమానమ్ము
జరుగ,సైచిన ప్రతి ధరణిపతియుఁ,
గన్నుగానకఁ, బోర నన్ను మార్కొనునంత
శౌర్యమూనిన ప్రతి శాత్రవుండు,
వాడు వీడేమి, యీ శత్రువర్గమెల్ల
మచ్ఛరాగ్నిలో మ్రగ్గించి మాడ్చి వైతు,
వచ్చుఁ గావుత వారికి బాసటగుచు

**దండధరుడైన, వాని నంతమ్మొనర్తు. 110**

అంతే కాదు, పరశురామాంతేవాసీ!

**పాపియొకండు తండ్రి తలఁబట్టినఁ, దత్ప్రతికారమేమియో**
**చూపెను భార్గవుండు రిపుశోణితపున్మడువుల్ సృజించి యి**
**చ్చో, పితృకేశమర్శనుడు క్షుద్రుడు నేడును క్షత్రియుండె, నా**
**కా పరమాస్త్రసంతతియె యండ,యదే యిపుడేనుఁ జేయుదుస్.111**

దుర్యో: ఆచార్యతనూజా!అనన్యసాధారణమైన నీ పరాక్రమమునకు దగిన ప్రతీకారమదియే కాని వేరొకటి కాదు.

కృపు: కౌరవేశ్వరా! గురుపుత్రుడు బూనిన కార్యభారము కడు పెద్దది గదా! నీచేఁ గృతపరికరుండైనచో నితనికిఁ ద్రిజగమ్ము లొకటైనను మారునిలువజాలవిక పాండవ బలము లేమి లెక్క?కనుక సేనాపతిగా నభిషేకింపుము.

దుర్యో: గురుదేవా! మీరన్నది ప్రత్యక్షరసత్యమే. కాని యిందుకై కర్ణుడీవరకే నిర్ణయింపబడెను.

కృపు: రాజా! తొలుత నీవట్లు ప్రతిపాదించుకొని యుండిన యుండవచ్చును.

**ఇరువురు నీకు మిత్రతము లిందెవరైన మరేమి? కాని, యే**
**యరికులముస్ వధించుటకు నంగపతిస్ నియమించుచుంటివో,**
**పరిభవఖిన్ను డీతడును వారలనే కద త్రుంపఁగోరు, నీ**
**వరయక యిట్లు సేసిన వ్యథావహమౌఁ గద వీనికియ్యెడస్! 112**

ప్రతీకారవాంఛాతంతప్యమానమానసుడైన యీతనినిఁ గర్ణుని నిమిత్తమై యుపేక్షించుట యయుక్తము గదా!

**అశ్వ:** సుయోధనా! ఇంకను నీ యుక్తాయుక్తవిచారణవిలంబ మేల?

**పార్థివ! గుండెపైనఁ  జెయివైచుక నిద్దురవొమ్ము నేడు, ని**
**ష్పార్థ, మకృష్ణముస్, విగత పార్షత మౌను జగమ్ము, సర్వకా**
**మ్యార్థము లొందు ని,న్నిక సమాప్తమగుస్ రణగాథ నేటితో,**
**వ్యర్థనరేంద్రదుర్భరమహావనిభారము నేడ తీరెడుస్.** 113

**కర్ణు:** **(పెడనవ్వుతో)** ఇది చెప్పుట చాల సుకరము. చేయుట దుష్కరము. ఐనను నీపాటికిఁ జాలినవారు గౌరవ బలమునఁ బెక్కురు వీరులు గలరు.

**అశ్వ:** అంగరాజా! నిజమే. కలరు. దుఃఖోపహతుడనై క్రోధోద్వేగమున నట్లంటిని గాని యితరవీరజనాధిక్షేపముగఁ గాదు.

**కర్ణు:** మూఢుడా! దుఃఖితుడైనవాని  కశ్రుపాతమ్మనుఁ, గ్రుద్ధుడైన వానికి శస్త్రమందికొని పోరి కురుకుటయునుఁ దగును గాని యిట్టి ప్రలాపములు గావు.

**అశ్వ:** **(క్రోధముతో)** ఓరీ ! సూతాధమ! రాధాగర్భభారభూత! అశ్వత్థామకు నాకుఁగూడ ప్రద్రవపండితుడ పైన నీ వంటి వారికి దగిన చర్యల నుపదేశించెదవా!

**నీ వోలెస్ బదినాళ్ళు డాగితినో, నేనింటస్ సమిద్భీతిచే?**
**నీ వోలెస్ గురుశాపభీషణవచోనిర్వీర్యశస్త్రుండనో!**
**నీ వోలెస్ రథకారవంశజుడనో, నీ వోలె నే లెంకనో!**
**యీ విద్వేషిభుజావలేపమును మాయింపంగ లేకేడ్వగస్.** 114

**కర్ణు:** **(మండిపడుచు)** ఓరీ! వాచాట! వృథాశస్త్రగ్రహణ

శూరంమన్యా!

**సూతుడనైననౌదు మరి సూతతనూజుడనైన నౌదు, నీ**

**జాతులు దైవనిష్ఠములు, శౌర్యము నాయది, దానికేమి? యే**

**రీతివొ యాయుధమ్ములు ధరించితిఁ గాని, త్యజింపలేదులే!**

**భీతి మెయిస్ భవజ్జనకు పెంపునఁ బెంపరి యుద్ధభూమిలో.** 115

**అశ్వ:** రథకారకులకళంక! వీథికొక ముక్కగా ధనుర్వేద మభ్యసించిన నీవు చాపాచార్యునే యధిక్షేపించు చుంటివిగా! పిరికి పందా!

**భీరువొ, శూరుడో ప్రథితవిక్రము డాతడు ముజ్జగమ్ములస్,**

**బోరిన యిన్ని నాళ్ళుఁ దన పోకడ నీ జగమే యెరుంగు, నే**

**తీరున శస్త్రముజ్ఝితమొ తెల్పగ సత్యముఖుండు ధర్మజ**

**క్ష్మారమణుండె సాక్షి, మొనగాడవు నీవపుడేడ నుంటివో?** 116

**కర్ణు:** **(నవ్వి)** అవును, నేనేమో పిరికి వాడను. ఇక నీవు, గతించిన తండ్రిని గూర్చి విక్రమనిధి, జగదేక వీరుడు నని పనవుకొనుచు నేమి జేయుదువా యని నాకు పెద్ద సందేహము. అయినను మూఢుడా! నీ తండ్రి నిక్కముగా నంతటి పోటరి యే యైనచో,

**శిరము నరకెడు వరకుదాసీనుడగుచు**

**నుండునే యెల్లరునుఁ జూడ నువిద వోలె?**

**యాయుధము లేక సాయుధులైన రిపుల**

**నెదిరి మరలింపరే వీరు లెవ్వరేని?** 117

**అశ్వ:** **(క్రుద్ధుడై)** అరే అసంబద్ధప్రలాపీ! రాజవాల్లభ్యమత్త! సూతాపశద! ప్రగల్భ! చూడుము.

భయమో శోకమొ కల్గి మజ్జనకు డా పాంచాలపాపాత్ము దు
ర్నయచేష్టాపరహస్తమున్ నిలుపఁ బూనండయ్యె, దుర్దర్పవా
గ్వ్యయిపై యుబ్బెడు నీ శిరమ్ము పయి నా పాదమ్ము ధట్టించుచుం
టి, యిదే త్వద్భుజశక్తి, పౌరుషము,వాడిం జూపి వారింపుమా!118

(లేచును.)

కృప, దుర్యో: గురుపుత్ర! శాంతింపుము.

అశ్వ: (కాలితోఁ గర్ణునిఁ దన్నబోవును)

కర్ణు: (చివ్వున లేచి , వాలు దూసి) ఓరీ! ఆత్మశ్లాఘానంద!

బ్రదికితి వవధ్యజాతిసంభవుడ వగుచుఁ,
గాని, కన్నును మిన్నునుఁ గానకుండ
నెగసిపడి పైకిఁ జూపిన యీ పదమ్ము
మాత్ర మొక్క ప్రేటున ధరం బడును జూడు119

(నరకఁబోవును. కృప దుర్యోధనులు వారింతురు.)

అశ్వ: ఏమిరా కులీనా! నే నవధ్యజాతిసంభవుడ ననియా?

(జన్నిదముఁ ద్రెంచి) ఇదిగో యా జాతినే విడిచితిని.

పౌరుషమ్మున్న శస్త్రమ్ముఁ బట్టి రమ్ము,
నేటితో ఫల్గును ప్రతిజ్ఞ వీటిబోవుఁ :
జావ భయమేనిఁ, జేమోడ్చి శరణమనుము.
స్వపరశౌర్యవిశేషవిజ్ఞానహీన! 120

(ఇరువురు బరస్పరము ప్రహరించుకొనబోవఁ గృపదుర్యోధనులు వారింతురు)

దుర్యో: కర్ణా! నీ పైన యుడుగుము.

కృప: వత్సా! ఏల యీ యస్థానక్రోధము? నీవు కత్తి దూయ

వలసినది శత్రువులపైన గాని యీతని పైన గాదు గదా!

**అశ్వ:** మామా! నన్నేల వారింతువు? ద్రోణనిందాసాహసి యైన వీడుగూడ ధృష్టద్యుమ్నపాతకునితోడనే పోవలసినవాడు.

**కర్ణు:** రాజా! నన్నాపకుము. వీనిని సైరింపరాదు.

**హీనుడని యెంచి ధీరు లుపేక్ష సేయ,**
**మేను మరచి ప్రగల్భుడై మేర మీరి,**
**మిడిసిపడుచుండు నీ రీతి వెడగు జనుడు.**
**చెలగి యించుక కన్నెఱ్ఱ జేయవలయు. 121**

**అశ్వ:** సుయోధనా! రానిమ్ము. మద్భుజదండాంతర నిష్పేషణమున తేలికగా చావనిమ్ము. అర్జునప్రతిస్పర్థి యని కాని, మిత్రుడని కాని, గురునిందాపాతకుడైన వీనిని నా బారినుండి కాచుటకు యత్నించుచుంటి వేమో, రెండును వ్యర్థములే.

**నీచకులుండువీడు, రజనీశకులుండవు నీవు, పాపకా**
**ర్యాచరణుండువీడు, సుగుణాఢ్యుడ వీ, విది తగ్గ చెల్మియే?**
**పీచమడంతు వీని, నృప! వీడుము, ఫల్గును నేను ద్రుంతు, సం**
**కోచముమాను, మే సలుపకుందునె, లోకమకర్ణపార్థముస్! 122**

**(కత్తి విసరబోవును)**

**కర్ణు:** బ్రాహ్మణాధమా! అట్లయిన ముందు నీవే చచ్చితివి. **(కత్తి నెత్తును)**

**(కృపదుర్యోధనులు మరల వారింతురు.)**

**దుర్యో:** కర్ణా! ఏమి మీకీనాడీ భ్రాంతి? రణమధ్యమున మనలో మన కవాంతరకలహమా!

కృపు: వత్సా! అశ్వత్థామా! జరగవలసిన దొకటైన జరగుచున్న దింకొకటియా! నీ మూలమున వీరికీ వ్యసనమును గల్పింతువా! **(సాభిప్రాయముగా కర్ణుని రాజును మార్చి మార్చి చూచుచు)**

**కౌరవవంశకార్యమునకై యసువుల్ దృజియించె గుంభజుం**
**డీరణమంద, తత్సుతు డహీనపరాక్రముడయ్యు దా నహం**
**కారము చే వృథాకలహకారకుడై చెడఁగొట్టె రాజసే**
**వారతి నున్నవారి నను వాదుపయిం బడవైచుకొందువా! 123**

అశ్వ: మామా!ఈ సూతకులీనుని దర్పమడచి దుష్ప్రలాపములకుఁ దగిన శాస్తిఁ జేయఁ గుదురకున్నది గదా!

కృపు: దుష్ప్రలాపములే కానిమ్ము, మరియేమైనఁ గానిమ్ము. ఇది స్వబలప్రధానవిరోధమునకు సమయము గాదు.

అశ్వ: మామా! అట్లయిన వీని పస యందరకుఁ దెలియును గాక!

**అని నీ దుష్టుడరాతిశస్త్రనిహతుం డై కూలు నందాక దా**
**ల్పను శస్త్రమ్ముల, రేపు క్రుద్ధులయి బీభత్సుండు భీముండు సై**
**న్యనికాయమ్ములఁ జెండుచుండఁ జకితుండై యున్న యీ సైన్యసే**
**తనుఁ గన్గొంచుఁ, గురుప్రభుం డెరుగునేతన్మిత్రు దోస్సారముస్.124**

**(ఖడ్గమును బారవైచును)**

కర్ణు: **(నవ్వి)** అస్త్రసంన్యాస మను నిది మీకు కులక్రమాగతమే కాదా!

అశ్వ: విడువక చేపట్టియే యున్నను. నిష్ఫలములగుట మీ బోటి పోటరుల శస్త్రములెప్పుడో విడిచివైచినట్లే లేరా గర్విష్ఠ!

**కర్ణు:** ఓయీ! నిరభిమాన!

**నా కరమ్మున విల్లుండు నంతవరకు,**
**నన్ను డొక్కడు బోరాడు టనవసరము,**
**నేను నా వింట సాధింపలేని దానిఁ**
**బూని సాధింపఁగలవాడు పుట్టలేదు.** 125

**(తెరలో)**

అరే కౌరవ పశువా! పాంచాలరాజతనయాకేశాంబరాకర్షణమహాపాతకీ! ఎంతకాలమునకు నా కంటఁ బడితివిరా!ఇప్పు డెక్కడకుఁ బోయెదవు? ఓరీ! దుర్యోధనశకునిరాధేయాదికౌరవపక్షవీరమ్మన్యులారా!మానధనులైన పాండవవిరోధిరాజన్యులారా! వినుడు.

**కులవృద్ధుల్,బహుబంధువుల్,గురువులుస్, గొల్వున్నచో,ద్రౌపదిస్**
**వలువల్ లాగి పరాభవించిన మహాపాపాత్ము, డెవ్వాని హృ**
**త్స్థలరక్తమ్మును ద్రావఁ దత్సభఁ బ్రతిజ్ఞల్ సల్పితిస్ నాడు, ద**
**త్ఖలు డస్మద్భుజపంజరమ్మునఁ బడెస్ గాపాడ యత్నింపుడీ!** 126

**(పాశమందు బడియెస్)**

**అశ్వ:** **(ఎగతాళిగా)** దుర్యోధనదయాలేశపరిలబ్ధాంగరాజ్యరమారమణా!జామదగ్న్యకరుణాప్రసాదప్రాప్తధనుర్విద్యాభరణా! ద్రోణాపహాసచణా! కర్ణా!

**వాడును వీడు నేల, రణ భారము నేన వహింతునంటివే!**
**వాడె సుయోధనానుజుని పైఁ బడె భీముడు; చేతనైనఁ గా**
**పాడుము వానిబారిఁ బడి ప్రాణముఁ గోల్పడకుండ, నేడు నీ**
**ప్రౌఢిమ తెల్లమౌను గురురాజునకుస్ గురువాహినీపతీ!** 127

**కర్ణు:** **(నిర్లక్ష్యముగా)** ఏమి! కర్ణుడు జీవించి యుండ ,

వృకోదరుడేమి, మరొకడేమి, దుశ్శాసనునిఁ గంటఁ జూడ నైనఁ జాలునా!**(వెనుకకుఁ జూచి)**యువరాజా!జడియకు మిదే వచ్చుచున్నాను. **(వేగముగా నిష్క్రమించును)**

**అశ్వ:** కౌరవేశ్వరా! భీష్మద్రోణులు లేమి, యనాథ వలె నున్న నీ సైన్యము నవలోడించుచున్న భీమార్జునులను- ఈ కర్ణుడో, యిట్టి వాడు మరొకడో, నిలువరింపఁ జాలరు. సోదరత్రాణేచ్ఛ గలిగినచో నీవే స్వయముగా పోయి యత్నింపుము.

**దుర్యో:** **(హుంకరించి)** దురాత్ము డీ పవనతనయు డొక్కడే కాదు, శమనుడైనను సరియే, నేను సాయుధుడనై యుండ నా తమ్ముని నీడనేనియుఁ ద్రొక్కఁజాలడు. **(తెరలోనికిఁ జూచి)** ఎవడురా యక్కడ! నా రథమునుఁ దెమ్ము. **(నిష్క్రమించును)**

**(తెరలో కలకలము)**

**అశ్వ:** **(ముందు జూచి)** మామా అటు జూడుము. అయ్యో! అగ్రజప్రతిజ్ఞాభంగభయమ్మున గాండీవి రాధేయ దుర్యోధనుల నిరువుర నేకకాలమ్మున నవార్యశర వర్షమ్ములచేఁ బారఁద్రోలుచున్నాడు. అకటా! దుశ్శాసను డిక నుండడు. ఛీ! అనృతమే యైన నగుగాక! మామా ఆయుధ మాయుధము !

**కృపు:** వత్సా! క్రోధావేశమున ననృతవాగ్దోషమునుఁ దెచ్చి పెట్టుకొనకుము.

**అశ్వ:** **అనృతఫలముగ నరకమే యగును గాక,**

**సమ్మతమె కాని, యెదుట దుశ్శాసనుడు వృ**
**కోదరునిచేతఁ జచ్చుచు నుండఁ జూచి**
**సైపఁ జాల, గ్రహింతు శస్త్రమ్ము మరల. 128**

**(అందుకొనఁబోవును)**

**(తెరలోనుండి )**

మహాత్మా! ఆచార్యపుత్రా! అనుల్లంఘితపూర్వమైన సత్యవాక్కు నుల్లంఘింపఁ దగదు.

**కృప:** వింటివా! అశరీరవాణియు నిన్నీ యకార్యమునుండి మరలించుచున్నది.

**అశ్వ:** **(విని)** ఛీఛీ! తుదకీ పాడు దైవము గూడ పాండవ పక్షపాతియేనా! మామా ! నిస్సందేహముగా భీముడింక కృతకృత్యుడే. ఇస్సీ! రాధేయుని మీది క్రోధమున నాయోధనము వీడి సాధునింద్య మగు పనిఁ గావించితిమి. నీవైనఁ బోయి సుయోధనునకుఁ దోడుపడుము.

**కృపు:** నేనేగి రాజునకు బాసటగా నిలచెదను. నీవిక శిబిరమునకే పొమ్ము. **(నిష్క్రమించును)**

**అశ్వ:** అశ్వత్థామ మేనఁ బ్రాణములుండగనే యింత ఘోరము జరిగిపోయెనుగదా! ఇక నా శౌర్యమేటికి? ఎప్పటికి? మూట గట్టుకొననా, ఏటఁ బారవేయనా?

**ఎట్ట యెదుట దుశ్శాసను నిట్లు జేసి**
**శోణితముఁ ద్రావు భీమునిఁ జూచుచుండ**
**వలసెనూర, కే నిక నాహవమున నిలచి**

యొరుగఁబెట్టెడి దేమి సుయోధనునకు? 129

(నిట్టూర్చి)

తులువన్ గైకొని నన్ను మెచ్చని నరేంద్రున్ సైప లేకుంట నిం
తలు బుట్టెన్, బది మంది కర్ణు లయినన్ దథ్యంబు గాండీవిచేఁ
గలనం గూలక తప్ప, దెట్లయిన నా ఖడ్గంబె దుర్యోధనున్
గెలిపించున్, గనుచుందు నందనుక నింకేమేమి గానున్నవో! 130

దైవమనివార్యము. ఒకానొకనాటికి నా కరవాలమే సుయోధనజయాలవాలమగునేమో! కాలము మహేంద్రజాలము వంటిది గదా! ఎట్లు చెప్పగలము?

(విషాదముతో నెమ్మదిగఁ బరిక్రమించి నిష్క్రమించును)

(తెర పడును)

భట్టనారాయణుని సంస్కృతవేణీసంహారనాటకమునకు
బొడ్డుచెర్ల సుబ్బారావు జోగాంబల పుత్రుడు,
మార్కండేయప్రసాద్ చేసిన ఆంధ్రానువాదమునందు
ఇది తృతీయాంకము.

-*-

# వేణీసంహారము

## చతుర్థాంకము

(పిదప ప్రహారమూర్ఛితుడైన దుర్యోధనుని రథముఁ

దొలగఁదోలుకొని వోవుచున్న సారథి ప్రవేశించును.)

సార: (సంభ్రమముతో నటు నిటుఁ బరిక్రమించును)

(తెరలో)

ఓ సరిలేని విక్రమమహోజ్జ్వలులార! సమిత్తృణీకృతా
త్మాసువులార! భూమిపతులార! రణమ్మునఁ బీతశేషదు
శ్శాసనరక్తసేచితనిజాంగుని భీమునిఁ జూచి భీతిమై
వాసిఁ దొరంగి సైన్యములు బారుచున్నవి. కావరారొకో! 131

సార: (విని) అయ్యయ్యో! భీకరాకారుడైన వృకోదరునిఁ జూచి సైన్యములెల్ల బెదరి చెదరి పారుచున్నవే! ఎవ్వరును గడంగకున్నారేమి? (నిరూపించి) అదుగో! రభసనంచరణ నదత్కింకిణీకమ్మను, గోవృషలాంఛనాంచితపతాకమ్ము ను నైన రథముతోఁ గృపాచార్యుడు, కర్ణుని పైకిఁ బోవు నర్జునుని వారించి నాడు. అమ్మయ్య! మనబలముల కాధారము దొరకినట్లే. శరవర్షప్రతిస్తంభితపరబలప్రసరుం డగు నీ విప్రు డపరద్రోణాచార్యునివలె కౌంతేయసేనా కాననంబుఁ దహింపగలడు.

(తెరలోఁ గోలాహలము, పిదప)

కౌరవపాండవసైనికులారా! ఏల మీరందరు నన్ను గని భయాకులులరై పరువులెత్తుచున్నారు? నేను, దుశ్శాసనరక్తాసవ పానమత్తుడను, కౌరవరాజునకు ద్యూతార్జితదాసుడను, భీమ

సేనుడను. ఓ సమస్త యోధులారా1 మీరందరు సాక్షులుగా నుండగాఁ జెప్పుచున్నాను. వినుడు .

**అభిమానధనుడు నుద్యతగదాయుధుడైన**
**కురురాజరాజు గన్గొనుచునుండఁ ,**
**గౌరవావళికెల్లఁ గడుఁగూర్చుపోటరి**
**యంగభూపతి యంగలార్చుచుండఁ,**
**గపటాక్షదేవనాకారయిత్రధముండు**
**గ్రుడ్లనీటినిఁ గ్రుక్కుకొనుచునుండ,**
**శల్యాదికౌరవసైన్యనాయకులెల్ల**
**దౌదవ్వులనె నిల్చి తలకుచుండ,**
**నార్తనాదమ్ము శ్రవణసుఖావహముగ,**
**గుండెఁ జీల్చి క్రొన్నెత్తురు గ్రోలినాడఁ,**
**గొల్వులోపలఁ బాంచాలి కొప్పు లాగి,**
**వలువ లూడ్చిన నరరూప పశువుఁ బట్టి. 132**

సార: **(విని భయముతో)** అమ్మో! కౌరవరాజపుత్రవనోత్పాత మారుతమైన యీ మారుతిహతకుడు దగ్గరకు రానే వచ్చినాడు. మహారాజింకను మూర్ఛనుండి తేరుకొన లేదు. ఈ దుష్టుడు మహారాజుపట్లఁ గూడ దుశ్శాసనుని యందు వలె నీచకృత్య మొనర్చునేమో!రథమెడముగాఁ గొనిపోయెదను. **(త్వరగఁ బరిక్రమించి)** ఇదిగో! సర స్తీరమున న్యగ్రోధచ్ఛాయలో రథము నిలిపెదను. జెండా కొయ్య విరిగి యుండుటచే చెట్టు క్రిందకు రథము నిర్నిరోధముగ బోవును.**(చుట్టును౯ జూచి)** ఈ సురభి

శీతలవాయుప్రసారమువలన మహారాజు సేద తీరును.
కాని, యొక పరిజనుడైనను లేడే! అట్లున్న భీముని౯
జూచి యందరును భీతులై పారిపోయిరి గాబోలు. అకటా!
ఎంతటి దురవస్థ!విధి యింత కాఠిన్యమును వహించునా!
సర్వవిధముల విధిప్రాతికూల్యము మమ్ము పరిహసించు
చున్నదే!

**గురుడభయమ్మొసంగినను౯, గోల్పడగా వలసెన్ జయద్రథున్,**
**హరి హరిణమ్ము౯ జీల్చి నటు లందరు జూడగ దుస్ససేను పే**
**రురము౯ బగుల్చి శోణితము౯ గ్రోలె వృకోదరు, డా విధాత దు**
**ష్కరపు౯ బ్రతిజ్ఞలన్ గడు సుసాధ్యము సేసెనె వారి కీ** గతిన్. 133

ఇక నైన దైవ మీ కురుకులమున కనుకూలించునో లేదో!
**(రాజును జూచి)** మహారాజింకను మూర్ఛ దెలియ లేదు.
**(నిట్టూర్చి)** సార్వభౌమా!

**వనతరువు లన్నిటిని మదేభములు గూల్చ౯,**
**బడక నొకట౯ జిక్కిన ద్రుమను భంగి నింక౯**
**గౌరవులకెల్ల నుంటి వొక్కడవు నీవ,**

**(విషాదముతో)**

**పాడు విధిచూపు పడునె నీపైన౯ గూడ!** 134

ఇంతకు నా వృకోదరహతకున కెదురు లేకున్నది!
దైవమా! ఏమి నీ భీమపక్షపాతము!

**ప్రత్యయముతోడ౯ దన జంటబాసలందు**
**మొదటి దానిని నెరవేర్చి, మదము హెచ్చ,**
**నక్షతుండయి నిల్చె నాహవము నందు౯,**

**దీర్చునే భీము డిక యీ ప్రతిజ్ఞ గూడ!** 135

దుర్యో: **(తేరుకొని)** ఆఁ! నేనుండగా, భీమునకు బ్రతిజ్ఞఁ దీర్చుపాటి శక్తి యెక్కడిది? సారథీ! రథము సత్వరముగ దుశ్శాసనుడున్న చోటునకుఁ గొనిపొమ్ము.

సార: ఆయుష్మన్! **(దుఃఖమాపుకొనుచు)** అలసి యున్న యీ వాహము లిపుడు నీ రథమునుఁ గడపఁజాలవు **(తనలో)** మనోరథమును గూడ.

దుర్యో: సరే! **(రథము దిగుట నటించి)** రథముకొరకు వేచి యుండు విలంబము మాత్ర మెందులకు?

సార: మహారాజు మన్నించు గాక!

దుర్యో: అరాతివ్యూహసంమర్దనిశ్శంకసంచారుడనైన నాకు , దుర్యోధనునకు, రథమేల? సారథి యేల? కేవలగదా సహాయుడనై విక్రమింతును!

సార: చిరంజీవీ! అందు సందేహమేమున్నది?

దుర్యో: మరి? నన్నేల యాపఁ జూచెదవు? సారథీ!

**అనుగుం దమ్ముని౯, బ్రాణతుల్యుని, మదీయాజ్ఞానువర్తిన్, రిపుం**
**డనుమానింపక , మత్సమక్షమున, నన్యాయంబుగా౯ జంప వ**
**చ్చిన, నన్, దత్ప్రతికారతత్పరుని యీ చేష్టన్ నివారించెదే?**
**చనునా నీకిది? లేవె సుంతయును లజ్జాక్రోధకారుణ్యముల్?** 136

సార: **(దుఃఖించుచు పాదములపైఁ బడి)** మహారాజా క్షమింపుడు. ఈపాటికి భీముడు దన ప్రతినఁ జెల్లించుకొని పోయియే యుండును గనుక యిట్లు విన్నవించితిని.

దుర్యో: **(మ్రాన్పడి, వైవర్ణ్యముతో)** హా దుశ్శాసనా!

మదాజ్ఞావిరోధితపాండవా! అస్తమించితివా తండ్రీ!

**(మూర్ఛిల్లును)**

సార: **(ఉత్తరీయముతో విసరును)**

దుర్యో: **(తెప్పరిల్లి, నిట్టూర్చి, గద్గదస్వరముతో)**నేనెంతటి పాపిని!

**పేరున కన్ననయ్యు నినుఁ బ్రేమగ లాలన సేయనైతి, యిం**
**పారగ సర్వభోగసుఖమందవ, యన్నిట యన్నిమార్లు నేఁ**
**బ్రేరణ సేసి యెగ్గు సలిపించితి వారికి , నీ విపత్తు కేఁ**
**గారణ మయ్యుఁ, గాచుకొనఁ గానకపోయితి నిన్ను తమ్ముఁడా! 137**

సార: మహారాజా! దుఃఖింపకుడు. సుక్షత్రియులకెల్ల సమరమరణ మనునది తప్పనిది, తగినది గదా!

దుర్యో: **(చేతులు విదల్చుచు)** ఛీ! సారథీ! రథముఁ దొలగించి యెంతటి పాడుపనిఁ జేసితివో చూడుము.

**అనవరతసేవిఁ, దమ్ము నాజ్ఞానువర్తి,**
**నేను రక్షించు టటులుండ నిచ్చి, వానిఁ**
**గోలుగా నిచ్చి రక్షించుకొంటి నన్ను,**
**నలుగు రిది విన్న,మొగమున నవ్వరొక్కొ!138**

సార: దేవా! శరతోమరప్రాసాదిశస్త్రఘాతమ్ముల భిన్న మర్ముఁడవై, మూర్ఛిల్లితివనియు, రథికరక్షణము సారథికర్తవ్య మనియుఁ దొలగఁదోలుకొని వచ్చితిని.

దుర్యో: అగునే కాక! కేవలము కానిపని గదా! **(నిట్టూర్చి)** దురదృష్టమెంత బలీయము!

**బెడిదపుటంపరస్, గడకు భీము గదాహతిచేతఁగాని, నేఁ**
**దడయక లేవనైతి, నట తమ్ముని నెత్తుటి గుండెమీద నేఁ**

**బడుటయొ లేక వానిఁ బడ పైచుటయో యొనరింపనైతి, భీ**

**ముడు సహజన్ముతోఁ గురువిభుస్ బొరిపుచ్చకనైన పోయెనే! 139**

తమ్ముని వాని బారికి విడిచివచ్చి యే మొగముతో

మరల యా విరోధి నెదిరింపఁ గలను? హా విధిహతకా!

నిర్దయా! నీ యిచ్చయే జర గనిమ్ము .

**చావు మూడె నేని చత్తును గాని వృ**

**కోదరుండు జంపకుండుఁ గాక!**

సార: **(చెవులు మూసికొని)** శాంతం పాపం. మహారాజ!ఏమిది?

దుర్యో: **సర్వబంధుహితులఁ జంపించుకొన్న నా**

**కేల రాజ్యసుఖ మికేల జయము? 140**

**(నిట్టూర్చి, చింతించుచుండును.)**

**(అపుడు రెండవపైపు నుండి యొడలినిండ గాయములతో**

**సుందరకుడను నొక సైనికుడు బ్రవేశించును.)**

సుంద: **(ఎవరినో యుద్దేశించి)** అయ్యా! సారథిద్వితీయుడైన

దుర్యోధనమహారాజును మీరెవరైనఁ జూచితిరా! **(చూచి)**

ఎవరునుఁ బలుక రేమి? సరియే, మరియొక చోట

నడిగెదను.**(పరిక్రమించి)** ఇక్కడ యొక యోధసమూహ

మున్నది. వీరేమైనఁ జెప్పగలరేమో! **(నిరూపించి)**

**మొగములు విన్ననై తెలివి బోయిన యట్టుల యున్న వీరు నే**

**త్రగళిత బాష్పధారలఁ గరమ్ములఁ ద్రోచుచు, మాటరాక, న**

**న్నెగదిగఁ జూచి యొక్కట మరింతగ నేడ్చిరి. దీనఁ దెల్లమ**

**య్యెగద యెరుంగరంచు నవనీశుని యున్న స్థలంబొ జాడయో141**

**(అటునిటు జూచి)** ఈ ప్రక్కన మరికొంద రున్నారు.

**(పరిక్రమించి)** అకటా! ఈ దృశ్యము గుండెనుఁ బిండి వేయుచున్నది.

**భండనమ్మునఁ గూలిన భర్త తోడ**
**సహగమించెడు సర్వభూషణవిభూషి**
**తాంగి యైన కోడలిఁ గూడి యరిగి , పొందు**
**చున్నదీ వీరమాత దుఃఖోపశాంతి.** 142

భళీ! వీరమాతా! రానున్న జన్మమునందైననుఁ జిరంజీవి యగు పుత్రునిఁ బడసెదవు గాక! **(పరిక్రమించి)** పాపము! వీరి యవస్థ దయనీయముగ నున్నది.

**దేహము నిండ గాయములు దీప్తములై చెలువారు నీ నిరా**
**రోహకసైంధవమ్ము కడ రోదన జేయుచు నుండి, రిక్క డ**
**వ్యాహతశత్రువీరదహనాహుతి యయ్యెను వీరి నేత యం**
**చూహ యొనర్తు, వీరలు సుయోధను జాడ నెరుంగరే కదా!** 143

అన్నిచోటుల నందరును దుర్భాగ్యవశమున వ్యసన పర్యాకులులై యున్నారు. వీరినెవరి నడిగిననుఁ బ్రయోజన ముండదు. కనుక నేనే వెదకెదను. **(అటు నిటుఁ దిరిగి)** ఆహా! విధి వైపరీత్యము! ఏకాదశాక్షౌహిణీ నాథుడై, శతసోదరాగ్రజుడై, యొక వెలుగు వెలిగిన సుయోధనమహారాజునుఁ గూడ వెదకవలసి వచ్చుట, వెదకిననుఁ గానరాకుండుట!**( నిట్టూర్చి)** విధి నేల నిందింప వలయునులే! ఆబాల్యము పాండవులయెడఁ బూనిన యీర్ష్యాసూయలే నేటికీ రీతిగఁ బరిణమించినవి. **(ఎదుటఁ జూచి)** అదిగో! నానారత్నవిశ్లేషితసూర్యకాంతి

సముత్పాదితశక్రచాపబాహుళ్యవిరాజితంబునుఁ, గేతన దండరహితంబును నగు రథంబు గనిపించుచున్నది. మహారాజిక్కడనే విశ్రమించుచుండఁ బోలును!
**(పరిక్రమించి)** వారే సుయోధనసార్వభౌములు! ఎంతటి మహావైభవాన్వితునకు నేకాకియై నేలపైఁ గూర్చుండ వలసిన దుఃస్థితి యేర్పడినది! స్వయంకృతము!
**(సమీపించి, సారథికి సైగఁ జేయును.)**

**సార:** **(చూచి)**మహారాజ! సంగ్రామరంగమునుండి సుందరకుడు వచ్చినాడు.

**సుంద:** **(సమీపించి)** మహారాజులకు జయము.

**దుర్యో:** సుందరకా! అంగరాజునకుఁ గుశలమే కదా!

**సుంద:** దేవా! శరీరమాత్రమునఁ గుశలమే.

**దుర్యో:** **(ఉద్విగ్నుడై)** ఏమి? కిరీటి యతని తేరు విరచెనా, సారథినిఁ ద్రుంచెనా. తురంగములఁ గూల్చెనా?

**సుంద:** దేవా! రథమేమియు గాలేదు గాని, మనోరథము మాత్రము భగ్నమైనది.

**దుర్యో:** **(అసహనముగ)** మొదటనే యాకులమై యున్న నా మనసును నీ సందిగ్ధవాక్కులచే నింకనుఁ బర్యాకుల పరచెదవేల? స్పష్టముగఁ జెప్పుము.

**సుంద:** దేవా! చిత్తము. దేవర కిరీటపు మణుల కాంతులచే నా ప్రహారవేదన గూడ శమించినది. **(ముందునకు వచ్చి)** అవధరింపుడు. నేడు కుమారదుశ్శాసనవధా...

**సార:** దైవమే వినిపించినదిలే సుందరకా కానిమ్ము.

**దుర్యో:** వింటిమిలే, చెప్పుము.

**సుంద:** చిత్తమవధరింపుడు . కుమారదుశ్శాసనవధామర్షితుడై యంగరాజు భ్రుకుటీభంగదుర్నిరీక్ష్యముఖుడై యనిరూప్యమాణశరగ్రహణసంధానాకర్షణమోక్షణ వ్యాపారుడై శిలీముఖాసారము తోరముగాఁ గురియించుచు భీమసేనుని మార్కొనెను.

దుర్యో: తరువాత?

**సుంద:** దేవా! అంత వారికి బాసటగా గవిసిన యుభయపక్ష సేనాంగమ్ముల పదఘట్టనలచే నెగసిన ధూళియు, మహాధానుష్కధనుర్విముక్తనారాచసమూహంబును, వైహాయసవీథీవిహరమాణ నానాయుధ వ్రాతంబునుఁ గలిసి గగనంబుఁ గనబడకుండఁ జేసినవి.

**దుర్యో:** తరువాత?

**సుంద:** దేవా! అంతట, నా యోధద్వితయమ్ము పరస్పర శరతాడితకవచోద్గమత్స్ఫులింగవిద్యుల్లతాకంబును, జ్యాలతాధీరనినాదభాసురచాపజలదంబును, నంతరాళ నిరంతరప్రసరచ్ఛరవర్షంబును నైన సమరదుర్దినంబునుఁ గల్పించెను.

**దుర్యో:** పిమ్మట?

**సుంద:** స్వామీ! ఆ సమయంబున నగ్రజపరాజయశంకచేఁ గాఁబోలును, గాండీవి రథనేమిధ్వానంబు విషమతల సంచరణంబుచే వజ్రనిర్ఘోషతౌల్యమ్ము వహింప హనుమ త్కేతుకంబును, గృష్ణసారథికంబునునగు తన రథమును

దేవదత్తగాండీవజ్యానిర్ఘోషములతో సమముగ నచ్చటికిఁ బరపించెను.

**దుర్యో:** తరువాత?

**సుంద:** తరువాత దేవా! భీమార్జును లిరువురితోఁ బోరుచున్న తన తండ్రినిఁ జూచి, జారిపోవుచున్న రత్నకిరీట మెగఁ ద్రోసికొనుచు, శరపుంఖవిఘట్టనలచే సారథిని పదపద మని యదలించుచు, శ్రవణబధిరీకరణముగ శంఖ మొత్తుచుఁ బిడుగువలె నచ్చటికి వృషసేనుడు వచ్చి చేరెను.

**దుర్యో:** ఐన సమరభూమిలో నిరువురు కర్ణులున్నట్లే. పిమ్మట?

**సుంద:** అంతట దేవా! వచ్చియు వచ్చుచునే నిశితశ్యామలస్నిగ్ధ శల్యములైన కంకపత్రముల నెడపెడ గుప్పించి ఫల్గునుని రథమునుఁ గప్పివైచెను.

**దుర్యో:** **(సంతోషముతో)** భళీ వృషసేనా! తరువాత!

**సుంద:** పిమ్మట దేవా! శ్రావణమేఘము జల్లులు గురియునట్లు నిశితసాయకములు నిగిడించుచు గాండీవి యించుక నవ్వి వృషసేనునితో 'ఓరి వృషసేనా! క్రుద్ధుడైన గాండీవి ముందు నిలువ నీ తండ్రికే శక్యము గాదు నీవెంత? పోయి యితరకుమారులతోఁ బెనగు ' మని పలికెను.

**దుర్యో:** వృషసేను డేమనియెను?

**సుంద:** దేవా! మాటలేమియు ననలేదు గాని పిత్రధిక్షేపజాత క్రోధుడై,పరుషవిషములును,కలితశ్రుతిసంగములును, మర్మభేదకములు నైన వాడితూపులనే ప్రత్యుత్తరముగా

నొసగెను.

దుర్యో: సాధు కర్ణాత్మజ! సాధు! తరువాత!

సుంద: దేవా! అప్పుడు శరాభిఘాతవేదనాజాతమన్యుడైన కిరీటి ప్రచండజ్యానాదనిర్జితవర్షర్తుమేఘగర్జారవుండై, చూపు జొరరానట్లు తూపుల గుములు గుములుగాఁ గురిపించెను. వృషసేన కుమారుడును బ్రత్యర్థికిఁ దగినట్లు శిక్షాబలము వెలయ, ధనుర్విద్యావైదగ్ధ్యము వెల్లివిరియఁ జేసెను. అది గాంచి కురుపాండవబలము లాత్మవైరముల మరచి కుమారుని సాధువాదముల నగ్గించినవి.

దుర్యో: తరువాత?

సుంద: అంతట దేవా! అట్లు స్వపరబలధానుష్కప్రశంసితుండైన తన తనయుని విక్రమంబునుఁ, బ్రతిక్షణవివర్ధమాన విజృంభణదుర్నివారుడైన గాండీవినిఁ బరికించి, యంగరాజు హర్షరోషకరుణామిశ్రితభావాకులుడై చూపుల కాత్మజునిఁ, దూపులకు భీముని లక్ష్యముగఁ గావించెను.

దుర్యో: అనంతరము?

సుంద: అప్పుడు సవ్యసాచియు, శత్రుప్రశంసాసహనబుద్ధితో, జాతామర్షుడై వృషసేనకుమారుని రథమున, సారథిపై, ధనుస్సుపైఁ, గేతనముపైఁ, దురంగములపై, ఛత్రముపై నేకకాలమునఁ దెరపిలేకుండఁ బ్రదరములను గుదులు గుదులుగా వదలెను.

దుర్యో: అంత?

సుంద: తరువాత నిరాయుధుండును విరథుండును నగు

కుమారుడు పరిభ్రమణైకప్రతిషిద్ధవైరిశరపాతు డయ్యెను.

**దుర్యో:** **(శంకతో)** తరువాత?

**సుంద:** ఆ సమయమున దేవా ! అంగరాజు భీముని సరకు సేయక, సుతత్రాణార్థియై కిరీటి నెదుర్కొనియె నంతలోఁ, గుమారుడునుఁ బరివారసామర్థ్యమున నొండు తేరిఁ గల్పించుకొని మరల నర్జునుని పైకి గవిసెను.

**దుర్యో:** మేలు మేలు వృషసేనా! తరువాత 1

**సుంద:** తరువాత స్వామీ! కుమారు డంతకు మునుపు కిరీటి దననన్న మాటల నుగ్గడించి, 'నా శరములు నీరక్తమునే కోరుచున్నవి, కాచుకొమ్మ' ని యంపతుంపరఁ గురిపించెను.

**దుర్యో:** ఆహా! బాలుని యమాయికత్వము, పరాక్రమాతి శయమును! తరువాత?

**సుంద:** తరువాత దేవా! క్రోధోన్మత్తుడైన కిరీటి యా శరజాలము నంతటినిఁ దూలించి, కనత్కనకకింకిణీమాలికా రాజితంబును, నైకరత్నప్రభాచారుభీషణదర్శనమ్మును నగు శక్తినిఁ గైకొని కటికినవ్వుతోఁ గుమారాభిముఖముగా విసరెను. నాల్కలు గ్రోయుచున్న యగ్నివలె నున్న యా శక్తినిఁ గాంచి, చేతి విల్లు జార నిరుత్సాహుడై యంగరాజు గావించిన హాహాకారముతో నర్జును నట్టహాసము, భీముని సింహనాదము, మనబలముల యాక్రందనములు నొక్క పెట్టున యెగసినవి.

**దుర్యో:** **(వ్యగ్రతతో)** అప్పుడు?

**సుంద:** దేవా! అప్పుడు వృషసేనకుమారుడు జడియక నిశ్చలుడై కర్ణస్పర్శిగా లాగి విడచిన యంబకమ్ముల నా శక్తిని, ముక్కంటి గంగనువలె, మూడు ముక్కలు గావించెను.

**దుర్యో:** సాధు కుమారా! సాధు! తరువాత!

**సుంద:** అయ్యెడ దేవా! అంగరాజది గని భీమునితో, 'ఓయీ భీమసేనా! మన యిరువుర సమరమింకను ముగియ లేదు. కాని క్షణకాలము నన్ననుమతింపుము. నా తనుజుడు నీ యనుజుడునుఁ బోరు తీరుల నాలోకింత మది నీకునుఁ బ్రేక్షణీయమే' యని పలుక నాత డొడంబడుడు, వారిరువురు తమ పెనగుటఁ జాలించి వీరి పోరాటముఁ జూడ నిలిచిరి.

**దుర్యో:** తనయవిక్రమదిదృక్ష యెవరికైన సహజమే. పిమ్మట?

సుంద: దేవా! అప్పుడు శక్తివైఫల్యామర్షితుడై గాండీవి యుచ్చై స్స్వరంబున 'ఓరీ దుర్యోధనప్రముఖ...' **(అని భయముతో మానును).**

**దుర్యో:** కానిమ్ము . పరులన్న మాటగదా!

**సుంద:** చిత్తము. కౌరవయోధులారా! దుర్నీతినౌకర్ణధారా! కర్ణా! మీరందరు నా పరోక్షమునఁ బెక్కురు గలిసి నా సుతు నసహాయు నిరాయుధుని వధించితిరి గదా! నేనిట, మీరెల్లరుఁ జూడ, నేడీ వృషసేనుని నిర్గతప్రాణునిఁ జేసెద' నని పలికి గాండీవము నారి సారించెను. అంగవిభుడునుఁ దన కాలపృష్ఠమును సజ్జీకరించుకొనియెను.

**దుర్యో:** అది కాదగ్గదే. తరువాత!

**సుంద:** అనంతరము దేవా! తనకుఁ దోడ్పడఁ గడగు భీముని వారించి, సవ్యసాచి కురిపించిన బాణములు, రెండు పాయల నదివలె కర్ణవృషసేనుల రథముల వైపుగఁ బ్రవహించినవి. వీరునుఁ బరస్పరస్పర్ధాప్రదర్శితనిజశిక్షా బలానురూపవిక్రములై మార్కొనిరి.

**దుర్యో:** తరువాత?

**సుంద:** అప్పుడు గాండీవి , తాను సవ్యసాచినని తెలుపుటకుం బోలె, మౌర్వి రింగుమని నిరంతరముగ మ్రోయుచుండఁ, జాపము గుడుసు విడువక యుండఁ, గురిపించిన సాంద్రశరపరంపరచే వృషసేనుడుగాని, రాధేయుడుగాని, వారి రథములుగాని, సారథులుగాని, చుట్టుప్రక్కల సేనలుగాని, కనఁబడవయ్యెను. అంత నా శరవర్షము వెలసిన మరు క్షణముననే యుభయబలమ్ములనుండి యు, వృషసేనుడు వడియె నను కేకలు పెల్లు రేగినవి.

**దుర్యో:** **(కన్నీటినాపుకొనుచు)** ఆ పైన?

**సుంద:** దేవా! హతసారథితురంగమంబును, లూనాతపత్రకేతు దండంబును నైన రథమున, మర్మభిదేకాశుగప్రగాఢ విద్ధహృదయుడై, స్వర్గభ్రష్టుడైన సురకుమారునివలె పడియున్న కుమారవృషసేనుడు గానఁబడియెను.

**దుర్యో:** **(కన్నీరు గార్చుచు)** ఇక వినఁజాలను. కుమారా! వృషసేనా! హతబంధుడనైన నాకు నీవు గూడ దూర మైతివా! వత్సా!

**అభినవయౌవనశోభం,**
**బభిరామవిశాలనయన, మబ్జోపమమున్,**
**శుభమగు నీ మోము నిజ**
**ప్రభ సెడి పడఁ గర్ణుడెట్లు భరియించెనొకో! 144**

సార: మహారాజా! సర్వజనమోహనకరపరాక్రమమున గాండీవినే వెగడు పరచిన కుమారుడు నిక్కపు ధన్యజీవి గదా! ఆ బాలుని గూర్చి యింతగా దుఃఖింప నేల?

దుర్యో: సారథీ! దుఃఖమా! అది పుణ్యశాలులకుఁ గలుగును. మనకు-

**కనుల ముందర బంధువర్గమ్ము గూలెఁ,**
**దరిగె మనసేన నానాటఁ, బరుల బలము**
**పెరుగు చున్న, దీ యవమాన భీకరాగ్ని**
**కాల్చుచున్నదింకేమి దుఃఖమ్ము,వ్యథయు 145**

**(మూర్ఛిల్లును)**

సార: మహారాజా! **(ఉపచారములొనర్చును)**

దుర్యో: **(తెలిసి)** సుందరకా! అప్పుడంగరాజేమి చేసెను?

సుంద: దేవా! అట్లైన కుమారునిఁ జూచి కర్ణుడు, కన్నీటితో , పుత్రశోకక్రోధమ్ము లుమ్మడిగఁ బెరుగ, శత్రుప్రహరణాభి ఘాతమ్ముల లెక్క గొనక, గాండీవిపై నడరినంత, భీమనకులసాత్యకిధృష్టద్యుమ్నాదిమహారథు లందరు ధనంజయున కెడజొచ్చిరి. శల్యు డంగరాజుతో, 'కర్ణా! శ్రాంతవాహంబును , భగ్నకూబరంబును నైన రథముతో క్షతదేహుడవగు నీ విప్పట్టున భీమార్జునులతో బోరఁ

దగద' ని చెప్పి యూరార్చి రథము మరల్చెను.

**దుర్యో:** తరువాత?

**సుంద:** ఆయన మిక్కిలి విలపించి, పరిజనోపనీతమైన రథము నాలోకించి, నన్నుఁ బిలిచి, శరీరక్షతస్రవద్రుధిరబిందు లిప్తశిలీముఖముఖమ్మున శీర్షపట్టికపై నీ సందేశమును లిఖించి నాకిచ్చి దేవర సన్నిధి కంపెను. **(ఇచ్చును)**

**దుర్యో:** **(అందుకొని చదువును)** . 'దుర్యోధనసార్వభౌమునకు, తమ బహిఃప్రాణమగు కర్ణుడు, సమరభూమినుండి , యపునస్సంభవముగాఁ గౌగిలించి, వ్రాసి పంపు, వినతి.

**వీడు మహాస్త్రవేత్త, భుజవిక్రమశాలియు, నీడు లేని మ**
**న్నీడు, సహోదరాధికుడు, నిక్కము పార్థులఁ గెల్చు నంచు, నన్**
**బోడిమి గౌరవించితివి, ముఖ్యుల నొక్కనిఁ గూల్చ నైతి, నీ**
**వాడిమిఁ జూపియో,నయనబాష్పము రాల్చియొ,దుఃఖమీగుమీ146**

నా యావచ్ఛక్తిని వినియోగించితిని గాని, కాలము ప్రతికూలమగుటచే నంతయు వ్యర్థమయ్యెను. క్షమింతువు గాక.' **(నిర్విణ్ణుడై)** కర్ణా! భ్రాతృవధ దుఃఖితుని నన్ను మరొక వచనశల్యముతో గారింతువా! సుందరకా! ఇపుడు కర్ణుని ప్రయత్నమేమి?

సుంద: దేవా! త్యక్తకవచుడై యాత్మపరిత్యాగమునకు సిద్ధపడి మరల ఫల్గుననితోఁ బోరి కాయత్తపడు చున్నాడు.

**దుర్యో:** **(ఉద్వేగముతో లేచి)** సారథీ! సత్వరముగ రథము నాయితముఁ జేయుము. సుందరకా! నీవేగి కర్ణునకు నా మాటగానిట్లు జెప్పుము.'మిత్రమా!ఇంత దుస్సాహసము

వలదు. శరీరపరిత్యాగాకాంక్షివి నీవొకడవే కాదు. మన
యిరువురి యుద్దేశ మొక్కటే. బంధుమిత్రభ్రాతృరహిత
మైన రాజ్యసుఖము లెవరికి రుచించును? కాని,

**పాండవులన్ వధించి, హత బంధులకింత జలమ్మొసంగి, య**
**ష్టుండెడు వారితో మనము నూరడుచున్, దుది గౌగిలింత నీ**
**మొండి శరీరముల్ విడచి పుచ్చకపోదుమె! మోదఖేదముల్**
**మెండుకొనంగ , నేల యనిమిత్తపుఁ జా వరిఁ జంపకుండనే?** 147

ఇక పుత్రశోకమునుగూర్చి నేనేమి చెప్పఁజాలుదును?
వృషసేనుడు తనకంటె ముందరిగిన లక్ష్మణకుమారునితోఁ
గ్రీడించుట కరిగె ననుకొనుము.

**అరయ దుశ్శాసనుండు నా కవరజుండు**
**గాడు, వృషసేనుడు సుతుండు గాడు నీకు,**
**అయిన నుభయుల కుభయులు నగుదురేమొ!**
**యెట్లు మనమొండొరులఁ దేర్చుటిపుడు చెపుమ!'** 148

అని తెలుపుము. శీఘ్రముగ బొమ్ము.

సుంద: చిత్తము. దేవర యానతి. **(నిష్క్రమించును)**

దుర్యో: సారథీ! త్వరగా రథముఁ దెమ్ము.

సార: ఆజ్ఞ. **(పోబోవుచు నాలించి)** దేవా! హయహేషామిశ్రితమై
రథనేమిధ్వానము వినఁబడుచున్నది. అది తమకై
పరిజనోపనీయమాన మగు రథ మనుకొందును.

దుర్యో: నీవేగి సన్నాహపరుచుము.

సార: చిత్తము.( **నిష్క్రమించి వెంటనే ప్రవేశించును)**

దుర్యో: రథమేది?

**సార:** దేవా! వృద్ధమహారాజుగారును, దల్లిగారు గాంధారీ దేవియు సంజయునితోఁ గలిసి వచ్చినారు.

**దుర్యో:** **(ఉలికిపడి)** ఏమీ! తల్లిదండ్రులా! ఎంత పనిఁ జేసిరి? సారథీ! నీవేగి త్వరగా మనరథమునుఁ దెమ్ము. నేనీ లోపలఁ దండ్రిగారి కగపడక యుందే యుందును.

**సార:** దేవా! త్వదేకబంధువులగు వీరి నోదార్పక పోవుట ధర్మమా!

**దుర్యో:** సారథీ! ఓదార్చుట మాట యటుంచుము. తొలుత వారికడ గేగుటకు మొగము జెల్లినఁ గదా! ఐనను నేమని యోదార్తును?

**తమ్ముడు నేను నేడు తలిదండ్రులపాలికి బోయి మ్రొక్కగం,**
**బమ్మిన ప్రేమ మూర్కొనుచు వారలు బంపగఁ బోరి కేగి యా**
**తమ్ముని వైరి చేత నిడి దారుణమృత్యువు పాలు సేసి, యి**
**ష్టమ్మనుఁ దండ్రినిం గని దయారహితాత్ముడ నేమి పల్కెదన్? 149**

అయినను, నీ వన్నట్లు, వచ్చిన తల్లిదండ్రులను దర్శింపక పోరాదు గనుక పోవుదము పద.

**(నిట్టూర్చును.)**

**(ఇరువురును నిష్క్రమింతురు.) (తెర పడును)**

**భట్టనారాయణుని సంస్కృతవేణీసంహారనాటకమునకు**
**బొడ్డుచెర్ల సుబ్బారావు, జోగాంబల పుత్రుడు**
**మార్కండేయప్రసాద్ చేసిన ఆంధ్రానువాదము నందు**
**ఇది చతుర్థాంకము. -*-**

# వేణీసంహారము

## పంచమాంకము

(పిదప రథస్థులైన గాంధారీధృతరాష్ట్రులును సంజయుడునుఁ బ్రవేశింతురు)

**ధృత:** సంజయా! కురువంశమహాభూరుహావశిష్టప్రవాళమైన నా కొడుకు సుయోధనుడెక్కడ నాయనా! ఇంతకు సజీవుడై యుండెనా?

**గాంధా:** జీవించియే యున్నచో యాతడున్న యెడకుఁ గొనిపోయి మా యారాటము నణపుము నాయనా!

**సంజ:** దేవా! ఇదే మహారాజీ న్యగ్రోధచ్ఛాయయం దొంటరిగఁ గూర్చుండి యున్నాడు.

**గాంధా:** ఒంటరిగా ననుచున్నావు, తన సోదరులెవ్వరుఁ బరివేష్టించి లేరా సంజయా!

**సంజ:** **(విననట్లు నటించి)** తండ్రీ! మెల్లగా దిగుడు.

**(ఇరువురు రథావతరణము నటింతురు)**

**(అంతట మొగము వాల్చుకొని కూర్చుండియున్న సుయోధనుడు ప్రవేశించును)**

**సంజ:** **(సమీపించి)** జయము మహారాజా! తమ జననీజనకులు విచ్చేసి యున్నవారు చూడుడు.

**దుర్యో:** **(లజ్జించుచు గన్నీటితో మొగముఁ ద్రిప్పుకొనును)**

**ధృత:** నాయనా! సుయోధనా!

**కంకటమూడ్చి, శల్యములఁ గంకముఖమ్ములఁ దీసి, శస్త్రఘా**
**తాంకములందు నౌషధములద్దుచు , వైద్యులు కట్లు గట్టఁ, గ**
**ర్ణాంకతలంబు దిండుగ జితావనినాథులఁ దేర్చుచుండు నిన్,**

**బంకిల చిత్తుడస్, గుశలమా యని యారయ నైతి పుత్రకా! 150**

**(ఇరువురును దడవికొనుచు సమీపించి కౌగిలింతురు.)**

**గాంధా:** తనయా! చెంతకుఁ జేరినఁ గూడ మాతో మాటలాడుట లేదు, శరప్రహారవేదన యెక్కువగా నున్నదా తండ్రీ!

**ధృత:** ఇతఃపూర్వము లేని యీ మౌన మేటికి వత్సా!

**దుర్యో:** (గద్గదస్వరముతో) తల్లీ! తండ్రీ!

**తమ్ముల బంధులస్, రిపులు దారుణభంగి వధింప, మారు సే**
**యమ్మొనకట్టనేరని వృథాగ్రజు, మీకిటువంటి పుత్రశో**
**కమ్మున కాద్యహేతువు, నగణ్యపవిత్రము భారతాన్వవా**
**యమ్మునఁ జీడపుర్వుఁ,గొడుకా యని పిల్చెదరేల యింకనుస్151**

**గాంధా:** నాయనా! ఈ పరివేదనము మానుము. మా దురదృష్టమువలన నెందరు సుతులు బోయినను నీవొకడవైనఁ జేయూతగా మిగిలి యుండుటయే యీ వృద్ధాంధదంపతులకుఁ జాలును. జయమును రాజ్యమును నేల? కనుక వారితో నిపుడైన సంధి గావించుకొని, నీవైనఁ బదికాలములపాటు వర్ధిల్లి మమ్మానందింపఁ జేయుము.

**దుర్యో:** తల్లీ! నీవనవలసిన మాటలేనా యివి?

**క్షత్రియవంశ్య కీ పగిది జాలియు దైన్యముఁ బూన నొప్పునే?**
**పుత్రుల నూర్వురస్ దలపఁ బోవు, నిరర్థకు నన్నుఁ గావగా**
**మాత్రము తల్లడిల్లెదవు, మాతరొ! ప్రేమమొ! శోకమౌఢ్యమో!**
**శత్రుభయంబొ! నే నెరుగఁ; జాలు వృథాననురూపవాక్యముల్. 152**

ఇప్పటి దాక యైనది గాక యవమానకరమగు సంధి

గావించుకొని యింకను నపయశస్సును మూట గట్టుకొందునా!

**సంజ:** మహారాజా! అట్లననేల? కుండ బావిలోఁ బడినదని త్రాటినిఁ గూడ యందే పారవేయరు గదా!

**దుర్యో:** ఇదంతయు వ్యర్థము. అనుభవాధికారులే లేనప్పు డనుభవోపకరణములతోఁ బని యేమి? **(దీర్ఘముగా నిట్టూర్చును)**

**ధృత:** **(కౌగిలించుకొని)** వత్సా! దిగులు పడకుము. మమ్మును, ముఖ్యముగా, యతిదీనముగా విలపించుచున్న నీ తల్లిని యొక్కింత యోదార్పుము.

**దుర్యో:** తండ్రీ! ఇప్పుడు మిమ్మోదార్పగల యదృష్టము నాకు లేదు గాని, కొద్దికాలములోనే,

**మన్నిహతపంచపుత్రకం బాండుపత్నిఁ**
**గూడి మీరును మీ కొడుకులనుఁ గూర్చి**
**పనవుకొందురుగాక, దుర్భరతనూజ ,**
**శోకమునఁగూడ మీ యొప్పు బోకయుండ. 153**

**గాంధా:** ఇట్టిదశలో నీ వొక్కడవు మిగులుటయే మా పాలికిఁ బదివేలు. నీకిది సమరానుకూల సమయము గాదు. కనుక యుద్ధము మానుము. నీకొక నమస్కారము నా మాట వినుము తండ్రీ!

**ధృత:** దుర్యోధనా! మీ తల్లి మాటయైన వినుము. పిలిచినఁ బలుకు చుట్టము లేని దీనుడనైన నా మతము గూడ యిదియే. మరియు,

**నమ్మిన తాత, యొజ్జయు, రణమ్మునఁ గూలిర కారె వారిచే,**
**సమ్ముఖమందు కర్ణు సుతుఁ జంపిన ఫల్గును పేరువిన్న లో**
**కమ్ము వడంకు, భ్రాతృశతకమ్ము నశించెఁ, ద్వదేకనిష్ఠశే**
**షమ్ము రిపుప్రతిజ్ఞ, యికఁ జాలభిమానము, ప్రోవు మంధులస్.154**

ఇప్పుడు పోరుట నీకు సర్వధా ప్రతికూలము గనుక యావహము మానిపించుటకే మా యీ రాక.

**దుర్యో:** సమరము మాని నన్నేమి జేయుమందురు?

**గాంధా:** మీ తండ్రిగాని విదురుడు గాని యుపదేశించినట్లు జేయుము.

**సంజ:** మహారాజా! ప్రకృతానురూపమైన మార్గ మిది యొక్కటియే.

**దుర్యో:** సంజయా! ఏమి నీ వెర్రి! ఇంకను నుపదేశములకుఁ గాలమేనా!

**సంజ:** ఎంతమాట మహారాజా! విజిగీషువులైనవారు యావజ్జీవము ప్రజ్ఞావంతుల యుపదేశములను వినవలసినదే కదా!

**దుర్యో:** **(రోషముతో)** అట్లయిన మాకుఁ బ్రకృతానురూపమైన యుపదేశమును ప్రజ్ఞాశాలివైన నీవే చేయరాదా!

**ధృత:** నాయనా!యథార్థవాదియైన సంజయునిపైననా కోపము! నీ వించుక నెమ్మదించిన నీకు నేనే బోధింతునుగదా!

**దుర్యో:** సరే, కానిండు.

**ధృత:** పలుమాటలేల! నీ కోరినరీతిగా ధర్మజునితో సంధిఁ గావించుకొనుము. చాలును.

**దుర్యో:** తండ్రీ! మూఢత్వమున సంజయుండును, బుత్రమోహ
కాతరత్వమ్మునఁ దల్లియు నిట్లాడిన నాడుదురు గాక!
మీకు గూడ యీ వ్యామోహమేమి? వోర నించుక క్రింది
చేయి యైనంతమాత్రమున సంధియా! దానికి మాత్రము
సమయాసమయము లుండవా!

**ప్రాపై నిల్చినవారిఁ జూచుకొని ధైర్యంబొప్ప, శ్రీకృష్ణు సా**
**మోపన్యాసము ధిక్కరించితిని యుద్ధోద్యోగవేళస్; రిపుల్**
**జాపాచార్యునిఁ, దాతఁ, దమ్ములను రాజన్యాళిఁ, గూల్పస్, శరీ**
**రాపేక్షంబడి సిగ్గుమాలి యిపుడభ్యర్థింతునే సంధికై? 155**

అంతేకాక, నీతివేదీ సంజయా!

**అరుల కంటెఁ దక్కు వైనప్పుడే కదా**
**సంధి సమ్మతంబు జనపతులకు,**
**దుస్ససేనుఁ ద్రుంచి, తురగలించెడి యేవు**
**రొకని తోడి సంధి కొప్పుటెట్లు? 156**

**ధృత:** నాయనా! నీకా సందియమే యక్కరలేదు. ఇంత
జరిగినను, ధర్మజుడు వినయశీలి యగుట నా మాట
కెదురు జెప్పడు. పైగా నేఁ జెప్పుటయే తడవుగా సంధికిఁ
గూడ తప్పక యంగీకరించును.

**దుర్యో:** ఎట్లు చెప్పగలరు?

**ధృత:** **(సంతోషముతో)** విను, చెప్పెదను. ఆతనికొక నియమ
మున్నది.

**తన తమ్ముం డొకడేని గూలినఁ, దనుత్యాగమ్ముఁ గావింపఁ బూ**
**నెను ధర్మాత్మజు; డందుచే వెరచెడిస్, నిత్యానుజప్రాణనా**

**శనశంకావహమైన యుద్ధమనినస్; సంసిద్ధుడైయుండు, నీ**
**కనురూపంబని తోచినప్పుడె రణం బాపంగ, సంధింపగస్.** 157

సంజ: అవును మహారాజా! మన కవకాశమదే.

గాంధా: నాయనా!యుక్తిసహమైన యీ మాటనైనఁ బాటింపుము.

దుర్యో: తండ్రీ! ఇదియే నిజమైన నిక సంధి మాటయే లేదు. ఏలందురా,

**ఉన్నసహోదరుల్ నలుగు; రొక్కడు జచ్చినఁ జచ్చునేని యా**
**యన్న; శతానుజుల్ నిహతులైన సుయోధను డుండనెట్లు గో**
**రుస్? నిజభ్రాతృ రక్తమును గ్రోలిన భీము, గదాప్రహార సం**
**ఛిన్న శరీరు జేసి యెగఁజిమ్మక , సంధికి దేబెరింతునే?** 158

దుశ్శాసన రక్తము వెలగా నా భీమాగ్రజుడిచ్చు తుచ్ఛ రాజ్యమునకు గక్కురితి వడి, నన్ను నగుబాట్ల పాలు గమ్మందురా!

గాంధా: ఏమీ! కుమారా! దుశ్శాసనా! ఇందరుండియు నీకా నికృష్టవధమును దప్పింపలేక పోయిరా! హా గాంధారీ! వీరపుత్రశతమును గాదు, ఘోరదుఃఖశతమునుఁ గంటివి గదా! **(రోదించును)**

సంజ: అమ్మా! మహారాజు నోదార్ప వచ్చిన మీరే యిట్లయిన నిక నెవరి నెవరోదార్తురు? నిగ్రహించుకొనుడు.

ధృత: నాయనా! విధివైపరీత్య మిట్లున్నను, నీవు నీ యభిమానమును వీడకున్న, నీవుదక్క మరి దిక్కులేని యీ చీకుటాలుమగల కేది దిక్కు? మేమేమి జేయుదుము?

దుర్యో: తండ్రీ! ఇప్పటికిఁ జేయదగిన దిది యొక్కటియే. వినుడు.

**సకలోర్వీతలజేతలుస్ బహుతరైశ్వర్యానుభోక్తల్, నృప**
**ప్రకరానమ్రశిరఃకిరీటమణిరుగ్రాజత్పదుల్, వీరపు**
**త్రకు లుగ్రాజి, రిపుఘ్నులౌచుఁ, దదరివ్రాతమ్ముచేఁ గూలి; రూ**
**రక దుఃఖింపక, పూనుడీ సగరుమర్యాదస్ ధరాభారముస్.** 159

కాదేని క్షాత్రధర్మము నుల్లంఘించిన వారగుదురు.

**(తెరలోఁ బెద్ద కలకలము)**

గాంధా: **(విని బెదరి)** తూర్యధ్వనులు , హాహాకారములు వినబడుచున్నవి. ఏమైనదో కదా!

సంజ: తల్లీ! స్వభావభీరువుల నింకను వెరపించు నిట్టి వాటి కీ చోటు కాణాచి గదా!

ధృత: అట్లు కాదు సంజయా! విను మా కోలాహలమెంత యుపద్రవముగ నున్నదో! దీనికేదో పెద్దకారణ ముండక పోదు.

దుర్యో: తండ్రీ! ఇక నన్ననుమతింపుడు. మొదటినుండియు దైవము వ్యతిరేకముగానే యున్నది. మరొక యప్రియ వార్త నేదో చెవిని వేయక మునుపే రణావతరణమున కనుజ్ఞ యిండు.

గాంధా: ఈ దీనురాలియొద్ద కొంచెము సేపుండుము నాయనా!

ధృత: కుమారా! నీ వంతగా యుద్ధమునకే నిశ్చయించు కొన్నచోఁ,జాటుమాటుగ శత్రువధోపాయ మన్వేషింపుము.

దుర్యో: రహస్యప్రతీఘాతమా? అది భీరువులకుఁ దగును గాని

దుర్యోధనునకుఁ గాదు. అంతియ కాక,

**ఎల్లరుఁ జూడ బంధుల ననేకుల జంపిన వారు చాటుగాఁ**

**ద్రెళ్ళగనేల? వారివలెఁ దెల్లము సేయని సేతలేల?**

గాంధా: వత్సా! ఏకాకినని నీవే యంటివే! ఎవరు తోడుండిరని నీకీ మొండి పట్టుదల?

దుర్యో: ..... నీ

**పిల్లలఁ గూల్చి నే నొకడ వెంగలిఁ జిక్కితి, వైరులెంద? రో**

**తల్లి! యపాండవంబ మహి, దైవము నేడు సమత్వ మూనినస్.160**

**(తెరలో మరల గోలాహలము. పిమ్మట)**

ఓ యోధులారా! ఈ నహాసంగ్రామఫలమునుఁ గౌరవేశ్వరున కెరిగింపుడు. అప్రియవార్తాశ్రావణమని జంకఁదగదు. తగిన ప్రతిక్రియఁ జేసితీరవలసిన సమయము గదా!

**(అందరును వ్యగ్రులై వినుచుందురు.)**

**(తెరలో)**

**అంగము లర్జునాశుగమయమ్ముగఁ, బ్రగ్గపుఁద్రాళ్ళు జారి వో**

**వంగఁ, దురంగమంబు లలవడ్డ పథంబున వట్టి తేరి నీ**

**డ్వంగ, జనాళి కంగపతి వార్తనుఁ జెప్పుచుఁ గంటినీటితో,**

**సంగరభూమినుండి యిదె శల్యుడు వచ్చె స్వపక్షశల్యమై 161**

దుర్యో: **(అనుమానముతో)** ఎవడది సందిగ్ధముగా నశని పాతములవంటి మాటలనుచున్నాడు? ఎవరక్కడ?

సార: **(ఏడ్చుచుఁ బ్రవేశించి)** మహారాజ! ఘోరము జరిగిపోయినది!

అందరు: ఏమైనది?

సార: దేవా! ఇప్పటివరకు దారుణమగు రణము జరిగినది.

**కలనఁ గలిసి యెదిరి కర్ణుండుఁ గవ్వడి**
**పోరి రంట సురలు బొగడ మింట.**

దుర్యో: మరి యా దారుణోద్ఘోషణ మేమి?

సార: మహారాజా! చెప్పుటకింకేమున్నది?

**రథిక శూన్యరథము రాధేయసారథి**
**దెచ్చె, మనబలమ్ము రిచ్చవడియె. 162**

దుర్యో: హా వయస్యా! కర్ణా! **(మూర్ఛిల్లును)**

**(సారథి యుపచరించును)**

ధృత: సంజయా! ఏమి యీ విపత్తు?

**పడియె భీష్ముండు, పడియెఁ గుంభజుడుఁ, దుదకు**
**సమరవారిధి దాటింప శక్తు డనుచుఁ**
**గొడుకు విజయాశలను నిల్పుకొన్న కూర్మి**
**సఖుడు, మేటి, రాధేయుడుస్ సమసె నకట!163**

ఛీ! పాడు దైవమా! ఇంత జేసినను నీకు మా పైఁ గరుణ రాలేదా!

**బంధువులెల్లఁ గూలి రరివర్గముచే, శతపుత్రనాశకు**
**క్స్రంధువులోనఁ గూలి దరిఁ జేరని మా కిక పుత్రమోహసం**
**బంధపు టల్పశేషమును, వార్ధక మందుఁ గరావలంబ మీ**
**యంధుల కీ తనూజు నొకనైననుఁ జేతికి దక్కనీయవా! 164**

దుర్యో: **(తెలిసి)** కర్ణా! నీవును నన్ను వదలిపోయితివా?

**పాయవు మున్ను నన్ను,నెడఁబాయను నేనును నిన్ను,నిప్పు డ**

న్యాయముగా వయస్యు, నకృతాప్రియునిన్, బ్రియు వీడిపోవఁ జ
న్నే! యికఁ గర్ణపేయములు నీ నుడులన్ వినలేని రీతిగాఁ
బోయితె నన్ దృజించి,సుతమోహము మత్ప్రణయాధికంబుగన్165

(దుఃఖించును )

ధృత: నాయనా! ధైర్యమూనుము. ఊరడిల్లుము.

దుర్యో: తండ్రీ!

ప్రాణసఖుడైన కర్ణుండు పడిన పిదప
చెనటి ప్రాణముల్ నిలుచుటే సిగ్గు నాకు,
ఇంక నూరడిల్లుట యన నెట్లు? మేను
మండుచున్నది యాపాదమస్తకమ్ము 166

అనుజుల దారుణమ్ముగ రణావనిఁ జంపిరి, శోచ్యులయ్యు నేఁ
బనవను వారికై; సకలబంధులుఁ జచ్చిరి, దానినైన నా
మనసు సహించు గాని; యిటు మత్ప్రియమిత్రునిఁ గర్ణు నాకుఁ బా
పిన రిపు వంశమున్ మునుము బెట్టి వధింపక తాపమారునే?167

గాంధా: వత్సా! క్షణకాలము కన్నీరాపుకొనుము.

సంజ: మహారాజా! సహజధీరులు మీరే విలపించిన నిక
వృద్ధులా నిబ్బరమూనువారు?

దుర్యో: ప్రియసఖా! రాధేయా!

నా కొరకుఁ బూని, యుగ్రరణమ్మునందు
నసువులనుఁ బాయ నెవడు నీకడ్డుపడడు,
నిన్ దలంచుచు రెండు కన్నీటి బొట్లు
రాల్చు నన్ను వారింత్రు వీరంద రకట! 168

(నిట్టూర్చి గద్గదముగ) సారథీ! అనూహ్యాము

నసంభవనీయము నగు నీ ఘోరము జరుగునంతటి
సంకటమేమి వచ్చి పడినది?

సార: మహారాజా! జనులిట్లు చెప్పుకొనుచున్నారు.

**మనబల ముబ్బ నర్జునుని మార్కొని పోరొనరించుచున్న క**
**ర్ణుని రథచక్రమొండు ధరఁ గ్రుంగెఁ, దదుద్ధరణప్రయత్నుఁడై**
**యనిపని మాని యున్న తరి, యాదవు ప్రేరణఁ జేసి యింద్రనం**
**దను డడరించినట్టి నిశితప్రదరంబులఁ జేరె స్వర్గమున్.** 169

దుర్యో: **(కోపముతో లేచి)**

**కర్ణముఖేందుసంస్మరణకారణఘూర్ణితమైన తీవ్రశో**
**కార్ణవ మింకుచున్నది క్రుధౌర్వమహాదహనోగ్రకీల...**

తండ్రీ! తడయక నన్నునుజ్ఞాపింపుడు.

**ని ష్కర్ణజగత్తునన్ బ్రదుకఁజాల, నవశ్యభవిష్యమైన య**
**భ్యర్ణవిపత్తుపట్ల రణమర్హతరంబని నిర్ణయించితిన్.** 170

ధృత: **(కౌగిలించుకొని దుఃఖముతో)** కుమారా! ఇంకను నీ పట్టుదల మానవా! ఇంచుక శాంతించి నా మాటఁ జెవినఁ బెట్టుము.

**తొలుతపితామహున్, బిదప ద్రోణునిఁ , బిమ్మటఁ గర్ణునిన్ సమ**
**ర్థులని జయాశఁ గొల్చితివి; దోర్బలశాలులు వారె కూలి; రి**
**వ్వలన నికెవ్వ రా తరము వారలు నిన్ గెలిపించు జోదు? లీ**
**కలనిక నేలనయ్య కొరగానిది , మానుము సంధి సేయుమీ.** 171

కేవలము ధైర్యమే సర్వకార్యకారి గాదు వత్సా!

**జయమొనఁగూర్చు నీ విధపు సాహసమే పతి కెప్డుఁ, గాని, దు**
**ర్జయుని వృకోదరున్ దలచి ప్రయ్యలు వారు నెడంద, వంచనా**

**మయమరి సంగరమ్ము, ఛలమన్న దెరుంగనివాడ, వేది యే**

**మయినను నిన్ను వీడదభిమానపిశాచ మికేమి చెప్పెదన్! 172**

**గాంధా:** **(భయముతో)** సుయోధనా! సకలారాతికృతాంతుడైన వృకోదరునితోనేనా మరలఁ బోరఁ గోరుచున్నావు?

**దుర్యో:** అమ్మా! వృకోదరుని మాట యటుంచుము. వాడెక్కడకుఁ బోగలడు?

**మన్మనోరథైకావలంబనము, మీకు**

**రెండవ సుయోధనునివోలెఁ బ్రియుడు నైన**

**కర్ణు నంతము సేసిన ఖలుడు గలడు.**

**వాని తలఁ గోయు దాక నా వగపు దిగదు.173**

సారథీ! ఆలసింపక రథము సిద్ధపరుపుము. పాండవులకు వెరచితిపేని నిలువుము. ఒంటరిగనే గదామాత్రసహాయుడనై పోవుదును.

**సార:** **(సంభ్రమముతో)** లేదు మహారాజా!ఇదె తెచ్చుచున్నాను. **(నిష్క్రమించును)**

**ధృత:** దుర్యోధనా! మమ్ము నట్టేట ముంచుటయే నీ పూనిక యైనచో, యీ మిగిలిన మహారథులలో నొక్కనిని సేనాపతిగ నైన నభిషేకింపుము.

**దుర్యో:** అభిషిక్తుడే కదా!

**ధృత:** **(ఆస్థతో)** ఎవరు? అశ్వత్థామయా! లేక శల్యుడా?

**సంజ:** మహరాజ! ఎంత యమాయికత్వము! ఎంత శోచ్యత!

**శాంతనవుడు, ద్రోణుం, డ**

**త్యంతాప్తుడుఁ గర్ణుడును, రణావనిఁ గూలన్,**

**గౌంతేయుల శల్యుండటె**

**యంతము గావించు!నాశ కంతము గలదే!174**

దుర్యో: తండ్రీ! అశ్వత్థామ యేల? శల్యునితో మాత్ర మేమి?

**అయిన నర్జునప్రాణాపహారి నగుదుఁ,**

**జాలనేని, కర్ణుని పరిష్వంగ మందఁ**

**జాలుదు నటంచు నెంచి, యశ్రాంతవిగళ**

**దశ్రుధారాభిషిక్తుండనయితి నేన. 175**

**(తెరలో గొడవ, పిదప)**

ఓ కౌరవయోధులారా! పారిపోకుడు. భయ మక్కర లేదు.

సుయోధను డెక్కడ నున్నాడో మాకుఁ దెలుపుడు .

**(అందరు సంభ్రమముతో వినుచుందురు. సారథి తత్తరపాటుతోఁ బ్రవేశించును.)**

సార: మహారాజా!

**అచ్చటచ్చట నీ జాడ నరసికొనుచు**

**దాపురించినా రేకరథస్థు లగుచు**

అందరు: ఎవరెవరు?

సార: **కర్ణహంత ఫల్గునుడు, నిష్కరుణబుద్ధి**

**క్రూరవిక్రముడైన వృకోదరుండు. 176**

గాంధా: **(భయముతో)** ఇప్పుడేది దారి?

దుర్యో: తల్లీ! రానిమ్ము.ఇదిగో గద చేతనే యున్నదిగా!

గాంధా: అయ్యో! ఏల యపాయముఁ గొనితెచ్చుకొందువు!

దుర్యో: తల్లీ! ఇది ధైర్యమున కదను గాని దైన్యమున కదను గాదు. సంజయా! వీరిని రథముపై శిబిరమునకుఁ

గొనిపొమ్ము. మనశోకమునుఁ బోఁగొట్టువాడు స్వయముగా రానే వచ్చినాడు.

**ధృత:** సుయోధనా! ఇంచుక తాళుము. వారి రాకలోని యాంతర్య మేమో కనుగొందము.

**దుర్యో:** దానితో మనకేమి?

**(అంత రథస్థులైన భీమార్జునులు ప్రవేశింతురు)**

**భీము:** ఓ సుయోధనానుచరులారా! మావలన భయము లేదు. ఏల బెదరి చెదరి పరువులు దీయుచున్నారు?

**జతుగృహదాహియుస్, ద్రుపదజావసనవ్యపనోదవాయువుస్,**
**శతసహజాగ్ర్యుడుస్, గపటశాలియుఁ, గర్ణసఖుండుఁ, దాతస**
**మ్మతుడును,దాసపాండవుడు, మానధనుండు, సుయోధనాఖ్యభూ**
**పతి యెట నున్నవా, డరయ వచ్చితి మాతని జూడఁ దెల్పరే. 177**

**ధృత:** సంజయా! వినుము, దుష్టుని యెత్తిపొడుపు లెంత దారుణముగా నున్నవో !

**సంజ:** తండ్రీ! క్రియారూపప్రతీకార మొనర్చిన పిమ్మట నిప్పుడు వాగ్రూపముగాఁ జేయుచున్నారు.

**దుర్యో:** సారథీ! నీవేగి నే నిక్కడ నున్నట్లు జెప్పుము.

**సార:** చిత్తము. **(వారినిఁ జేరి)** భీమార్జునులారా! సుయోధన మహారాజు తన తల్లిదండ్రులతోఁ గూడి యిదె యీ న్యగ్రోధ చ్ఛాయయందుఁ గూర్చుండి యున్నాడు .

**అర్జు:** **(భీమునితో)** అగ్రజా! మొదలే పుత్రశోకముతోఁ గ్రుంగి యున్న వారిని మనమగపడి మరింత కలవరపరచు టేల? రమ్ము పోవుదము.

భీము: మూఢా! పుత్రశోకమో! మిత్రశోకమో! పెద్దలకు నమస్కరింపక పోవచ్చునా! సముదాచార మెందుల కుల్లంఘింప వలయును? **(సమీపించి)** సంజయా! పెద తండ్రికి నా నమస్కృతినిఁ దెలుపుము. కాదు కాదు నీవాగుము. పెద్దలకు స్వయముగానే నామగ్రాహముగ నమస్కరింప వలయును.

**(ఇరువురు రథము దిగుట నటింతురు)**

అర్జు: **(సమీపించి)** పెదతండ్రీ! తల్లీ!

**ఎవ్వనిపై జయాశలు వహించిరి నీ సుతు , లెల్లవేళలన్**
**గవ్వగ నెంచ కెవ్వడు జగమ్ము సమస్తము ధిక్కరించె, నా**
**చివ్వలమారి కర్ణుని గ్రసించిన గాండివమున్ ధరించు మీ**
**కవ్వడి వీడు మీ పదయుగంబులకున్ బ్రణమిల్లు భక్తితో.** 178

**(నమస్కరించును)**

భీము: **కౌరవులనెల్లఁ గ్రోధాగ్నిఁ గాల్చి వైచి,**
**దుస్ససేనుని రక్తము దోయిలించి**
**త్రావి , దుర్యోధనుని తొడల్ వ్రక్కలింపఁ**
**దలచు భీముడు ప్రణమిల్లు తండ్రి మీకు.** 179

ధృత: ఛీ! నీచుడా! నీవొక్కడవేనా శత్రువులఁ బరిమార్చిన వాడవు? క్షాత్ర మున్నంతకాలము సమరము జయాపజయము లుండును, విజేతలు విజితులు నిహతులు నుందురు. స్వోత్కర్షమున నొడలు మరచి దుర్గర్వాలాపములతో మమ్ముడికింతువేల?

భీము: తండ్రీ! కోపింపకుము. ఇది దర్పము గాదు, స్వోత్కర్షము

గాదు.

నీవును లేవె నాటిసభ, నీ కొడుకుల్ దలబట్టి యీడ్వగా
ద్రోవది? నప్డు నీ కలుక దోపక మిన్నక యుండి, వారలస్
బావనిరోషవహ్ని శలభమ్ములఁ జేసితి విప్పు, డందుకే
యీ విధి నంటిఁ; దొల్లి యెవ రేమి యొనర్చిరొ నీవెరుంగవే? 180

దుర్యో: ఓరీ దుర్మదాంధ! వాయుపుత్ర! క్షత్రియానుచితమైన నీచపుఁ బనిఁ జేసినది చాలక వృద్ధమహారాజు ముందీ దురాలాపము లాడుదువా! పాంచాలీపరాభవమునఁ దండ్రిగారి కేమి ప్రసక్తి కలదు?

అంచితమౌ మదాజ్ఞమెయి నందరు జూడగ జుట్టుఁబట్టి యీ
డ్పించితి , ద్యూతదాసి యని పిల్చితి మీ సతి, నిందులోన నొ
క్కించుక యైన సేయని నరేంద్రులఁ జంపిన యంత నేల ద
ర్పించెద వుగ్రబాహుబలభీకరు నన్ను జయింపకుండనే! 181

భీము: (కోపమును నటించును)

అర్జు: (వారించుచు) అగ్రజా! కోపింపకుము.

ఏమి చేయుటకును శక్తి హీనుడగుట,
సోదరవినాశనమున నున్మాది యగుట ,
వాక్యశూరతఁ జూపుచు వదరు వీని
ప్రల్లదంబుల కేల కోపమ్ము నీకు? 182

భీము: (కోపముతో) ఓరీ చంద్రవంశ కళంకమా!

ఇచటఁ గనుక తండ్రియే లేనిచో నిస గ
దోగ్రఘాత చూర్ణితోరుఁ జేసి,
తోడు లేక చన్న దుశ్శాసనుని వెంటఁ

**బంపకుందు నొక్కి వదరుబోత! 183**

అంతే కాక వీరంమన్యా!

**నీ యెదుటస్ వధించెదను నీ యనుజుస్, రుధిరమ్ము ద్రావుదుస్**
**జూ యని యన్న పూనికల చొప్పున సాక్షిగ నుంచc గోరి ని**
**న్నీయెడ దాక నే బ్రదుక నిచ్చితిcగాని, యథార్థ మెప్పుడో**
**మాయక యున్నె నీ బ్రదుకు, మారుతికుంభికరాబ్జనాళమై. 184**

**దుర్యో:** అరే ద్యూతదాసా! పాండవపశువా! నేను నీ వలె వికత్థనాశూరుడనుగాను గాని,

**చేరు వయ్యెను, నిన్ను మీ వార లెల్ల**
**మద్గదాభిన్నవక్షోస్థిమాలికాతి**
**భీమభూషణబీభత్సవేషుడ వయి**
**కదన రంగానc బడియుండc గాంచు తరియు 185**

**భీము:** **(నవ్వి)** ఓహో! అట్లయిన నిన్నుపేక్షింపcదగదు. కాని నీవన్న దానిలోcగూడ కొంత సత్యము లేకపోలేదు. రేపు జరుగcబోవునది గూడ యదియేలే!

**బలవన్మద్బాహుదండభ్రమితగురుగదాపాతసంచూర్ణితోరు**
**స్థలునిం గావించి తత్రస్థ నృపతులు గనస్ ద్వచ్ఛిరంబందు పాదం**
**బవలీలస్ మెట్టి, కౌరవ్యహతకశతరక్తాక్తమై యానఖాగ్రం**
**బెలరారస్ దేహ,మెట్లుస్ వెలయుదు ననిలో భీమభూషానుషక్తిస్186**

**(తెరలో)**

ఓ భీమార్జునులారా! విజితసమస్తవిరోధిచక్రుడు, ప్రతాపసంతాపితదిఙ్మండలస్థాపితస్వజనుడు , విడంబితభార్గవరామయశుండును నైన శ్రీమదజాతశత్రు

యుధిష్ఠిర సార్వభౌములవారి యానతి.

ఇరువురు: ఏమని యగ్రజాజ్ఞ!

(మరలఁ దెరలో)

ఇట్లు.

బలములఁ ద్రిప్పు, డర్కుడును వైరులతో నదె యస్తమించెఁ; బు
ల్గులు చెడఁదిన్న జ్ఞాతితనుకోటి, నిభాశ్వనరాదిదేహసం
కులసమరక్షితిన్ వెదకుకొందురు గాక తదాప్తు, లగ్నిసం
కలనజలప్రదానముఖకార్యము లెట్టిటొ నిర్వహింపగన్. 187

ఇరువురు: అగ్రజాజ్ఞ. (నిష్క్రమింతురు)

(తెరలో)

ఓయీ! గాండీవాకర్షణబాహుశాలీ!ఇప్పు డెందుఁ బోఁగలవు?

నినునిర్జించు మదీయచాపమును నేనిన్నాళ్ళుఁ గర్ణాగ్రహ
మ్మునఁ జేపట్టమి, శూరశూన్యమగునీ పోరాటలో పెద్ద యో
ధుని చందమ్మున విఱ్ఱవీగితె? గురుద్రోహక్రుధన్ గ్రాగు ద్రౌ
ణి నిదే వచ్చితిఁ, ద్వచ్ఛమూవనదవాగ్నిన్, దుర్నివారుండనై.188

ధృత: (విని సంతోషముతో) సుయోధనా! అడుగో, పితృవధ
పరిభవోద్దీపితక్రోధమునఁ, దండ్రిని మించిన ధానుష్కుడు
మహాస్త్రవేత్తయు నైన యశ్వత్థామ వచ్చుచున్నాడు.

శరగురుడన్న నెట్లెడద జల్లుమనున్ రిపురాజి; కట్ల నీ
గురుసుతుడన్ననున్, రిపుల గుండెలు నీరగు; నీతనిన్, ధురం
ధరునిఁ బ్రసన్ను జేసికొను, తండ్రివిధమ్ముఁ దలంచి యుగ్రుడై,
యరులను రూపుమాపు,విజయంబు కరస్థము నీకు నమ్ముమీ189

కనుక నీవేగి యీ మహావీరునిఁ బూజించి తోడుకొని

రమ్ము.

**గాంధా:** అవును నాయనా! ఎదురేగి తోడుకొని రమ్ము.

**దుర్యో:** అహరహము కర్ణుని చావుఁ దప్ప వేరొకటి బలుకని యీ వృథాయౌవనశస్త్రబలభరునితో నేమగును?

**ధృత:** ఏమైనను సరియే. ఇట్టి విపత్సమయమున నిట్టి పరాక్రమసంపన్నులకు **మాటమా** త్రముగ నైన యప్రియముఁ జేయరాదు. కార్యకౌశలముఁ జూపవేమి?

**(అశ్వత్థామ ప్రవేశించును)**

**అశ్వ:** కౌరవేశ్వరునకు జయము.

**దుర్యో:** **(లేచి)** గురుపుత్రా! రార మ్మిటు కూర్చుండుము.

**అశ్వ:** మిత్రమా!

**కర్ణసుఖంబుగా బహువికత్థనవాక్కులు గ్రుమ్మరించి, నీ**
**కర్ణుడు జేసి చన్నపనిఁ గంటివి నీవ, యిదే ధనుఃకళా**
**పూర్ణుడు ద్రౌణి వచ్చె నికఁ బోరగ, నిన్ బ్రతికారసాగరో**
**త్తీర్ణునిఁ జేసి యీ దినమ తీర్చు భవద్వ్యథ, శత్రుశేషమున్. 190**

**దుర్యో:** **(అసూయారోషములతో)** ఆచార్య నందనా! నీ శక్తి సామర్థ్యములు ప్రఖ్యాతములగుటయే కదా నీకుఁ గావలసినది!

**అంగవిభుండు గూలిన యనంతరమే కద వచ్చితీవు పో**
**రం, గురురాజెవండు, కురురాజసఖుండగు కర్ణుడెవ్వ? డిం**
**కం గనుచుండు నేనుఁ బడు కాలముదాక, త్వదీయవిక్రమం**
**బుం గొనియాడు లోకము, రిపుప్రకరంబులఁ ద్రుంపు మప్పుడే! 191**

**అశ్వ:** **(తనలో)** ఓహో! వీని కిప్పటికిఁ గూడ గర్ణుని యెడ నదే

పక్షపాతము, మా యెడ నదే యనాదరమును!

**(ప్రకాశముగా)** రాజా! నీ కోరినట్లే యగును లెమ్ము!

**(నిష్క్రమించును)**

**ధృత:** కుమారా! ఏమి యీ వెర్రితనము! ఇంత పెనుకీడులోఁ గూడ గురుపుత్రునివంటి పరాక్రమవంతుని, శక్తిశాలిని, నీకుఁ దోడుపడఁ గోరు వానిని, దురుక్తులాడి నీయెడ నపరక్తుం గావించుకొంటివి గదా!

**దుర్యో:** ఇతని కప్రియమే యైననుఁ గానిమ్ము కాని, నేనన్న దానిలో నేమైనఁ గానిది గలదా!

**ఈ నృపజాతి మెప్పు లభియింపని మేటి, త్వదీయభాగ్యదో**
**షాన రణమ్మునం బడిన శౌర్యసముద్రుడు, నాకు మిత్రుడౌ**
**వానినిఁ గర్ణునిన్, బరుషవాక్కుల నెప్పుడు ధిక్కరించు దు**
**ర్మాని యితండు, నాకరయ మారట కవ్వడి గాక యేమగున్? 192**

**ధృత:** ఐనను, నీకింత నిర్లక్ష్యము దగదు. **(నిట్టూర్చి)**భరతకుల నాశనము తప్పదు గాఁబోలు. నిర్భాగ్యుడ నిప్పుడు నేనేమి జేయుదును? **(చింతించి)** ఇది మంచిపని. సంజయా! నీవేగి, భారద్వాజపుత్రునితో నా మాటలుగా నిట్లు చెప్పుము."గురుపుత్రా! సుయోధనుని మీదనా నీ కోపము?

**చిన్నతనంబునుండి గల పేర్మి, సహాసనభోజనాదిని**
**ష్పన్నసఖిత్వబంధ మది బాసెనె నీమది? వత్స! యీ దశన్,**
**నన్నయినం దలంచి , ప్రియనాశనదుఃఖితుడైనవీని యా**
**పన్నవచోవికారములఁ బాటిగఁ బట్టక వీనిఁ గావవే." 193**

**సంజ:** చిత్తము **(లేచును)**

**ధృత:** ఈ మాటఁ గూడ యనుము.

**"జగదాచార్యుడు, శౌర్యశాలి, కురురాజన్యప్రణామార్చితుం**
**డగు నీ తండ్రిని, వారు బొంఁకి, యని సంన్యస్తాస్త్రుఁ గావించియున్,**
**దెగఁగోయింపరె శీర్ష! మా యవమతిన్, నీ శక్తియున్ జూచి, నీ**
**పగ నీకున్ దగినట్లు దీర్చు, సఖివాక్పారుష్యమున్ సైపుమీ." 194**

అని చెప్పి మెల్లన యొడంబరచి రమ్ము.

**సంజ:** ఆజ్ఞ. ఇదే పోవుచున్నాను .**(నిష్క్రమించును)**

**దుర్యో:** తండ్రీ! ఇంత చెడిన వెనుక నీ బతిమాలుటలు
భంగపడుటలునా! తొలుతనుండియు, దైవానుకూల్యమే
యందని ఫ్రానిపండయ్యె నిక మానుషానుకూల్యమునకై
యేల వ్యథ పడియెదవు? దురదృష్టమే కాకున్నచో-

**సమరవిశారదుండు భుజశౌర్యసమగ్రుడు రాజు, వాహినీ**
**రమణు లటన్ననో, పరశురాముని శిష్యులు! గెల్వఁ జాలరే**
**యమునెదిరించి యైన? యొక యైదుగురన్ బరిమార్పలేక, స**
**ర్వముఁ జెడి పోయి యీ గతి పరాభవమందుట గల్గనేర్చునే! 195**

**ధృత:** వత్సా! గడచినదానికిఁ జింతింపకుము.

**నయమర్యాద నతిక్రమింపని గతిన్, గాలానుకూలప్రతి**
**క్రియఁ గావించుచుఁ, గూర్చు పోటరుల కంగీకార్యమౌ నట్లు జే**
**సి, యరిన్ రూపడగించిపైచి విజయశ్రీఁ గాంచు భూనాథు , డి**
**ట్టి యెడన్ గార్యవిధానముల్ దెలిసి పాటింపన్ శుభం బయ్యెడిన్196**

కనుక యికనైనను వృథా దురహంకారమున బోక, యీ
మిగిలియున్న యోధులనైన నారాధించి నీ కార్యమును

సాధించుకొనుము. అశ్వత్థామ తరువాత మనకు ముఖ్యుడు శల్యుడు. అతనిఁ బురికొల్పితిమా, మన పని యనుకూలము గాగలదు. పద, శల్యుని శిబిరమునకే పోవుదము.

**సార:** **(చేయి నందించి)** దేవా! ఇటు ఇటు రండు.

**(అందరు బరిక్రమించి నిష్క్రమింతురు.)**

**(తెర పడును)**

**భట్టనారాయణుని సంస్కృతవేణీసంహారనాటకమునకు**

**బొడ్డుచెర్ల సుబ్బారావు జోగాంబల పుత్రుడు,**

**మార్కండేయప్రసాద్ చేసిన**

**ఆంధ్రానువాదమునందు**

**ఇది పంచమాంకము.**

-*-

# వేణీసంహారము

## షష్ఠాంకము

(అంత నాసీనులైయున్న ద్రౌపదీయుధిష్ఠిరులును,

జేటియు ద్వారపాలకుడును బ్రవేశింతురు.)

యుధి: (ఆలోచించుచు నిట్టూర్చి)

తీర్ణంబయ్యెను బాహువిక్రమరసోదీర్ణం, బగాధంబు , భీ
ష్మార్ణోరాశి; మహాస్త్రశస్త్రనిచయోచ్చైర్జ్వాలికామాలికా
కీర్ణద్రోణదవానలం బడగె; నక్షీణాశుగాభీలదృ
క్కర్ణాశీవిషరాజు నుక్కడగె, వీకస్ వీడె శల్యో ద్ధతుల్. 197

జయము చేరువైన సమయాన, సాహస
ప్రియుడు భీముడన్న బిరుదు బాస
వలనఁ గలిగె మాకుఁ బ్రాణసంశయ, మిది
వాయు భంగి నరయ వలయు నిపుడు. 198

ద్రౌప: నాథా! పాంచాలివలన నని యనలేదేమి?

యుధి: దేవీ! అట్లయిన నావలన నని మాత్రము గదా యనవలసినది! (ద్వారపాలకునిఁ జూచి) బుధకా!

ద్వార: దేవా! ఆజ్ఞ యిండు.

యుధి: సహదేవునితో యిట్లు జెప్పుము. "క్రుద్ధుడైన భీము డొనర్చిన సాయంకాలావధికమైన దారుణప్రతిజ్ఞ నెరిగి భీతుడై డాగిన సుయోధనుని జాడ నరయవలసి యున్నది. కనుక విశ్వాసపాత్రులు, నిపుణులు, స్థల కాలజ్ఞులు నైన చారులను, సఫలత్వప్రతిశ్రుతభూరి బహుమానఘోషణపూర్వకముగ శమంతపంచకమున

కన్ని దెసలనుఁ బంపుము. మరియు,

పంకస్థలములందు వాలుకాభూములఁ
బాదముద్రలఁ గనిపట్టువారి,
సడిలేక పొదలలో నడగిన జంతువుస్
దీవత్రొక్కిడిఁబట్టి తెలియు వారి,
వ్యాఘ్రనాగాకీర్ణవనసీమలందు రం
ధ్రాన్వేషణాభిజ్ఞులైన వారి,
మునివాటికలనుండి జనపదమ్ములదాక
ప్రచ్ఛన్నవేషులై వరలు వారి,
వేగరుల, వేగ చారుల వెదకఁ బంపు;
వ్యాధవల్లవకైవర్తకాదిజనుల
నున్న చోట్లన కనుగల్గి యుండునట్లుఁ
దెలియ నియమింపు మీ కెలంకులఁ గుమార!"199

ద్వార: చిత్తము.

యుధి: ఆగుము. ఇదియుఁ జెప్పవలయును.

చాటునఁ జేరి మంతనము జల్పెడి వారలు, గాఢసుప్తులుస్,
బాటి యెరుంగ నట్టి మధుపాయులు, మూఢులు, రోగపీడితుల్,
బోటులు గూడియున్న నెలవుల్ . మృగపక్షికులాకులధ్వనుల్,
జోటులు గూఢభేదనకుఁ , జొన్పుము చారులఁ , బర్యవేక్షకై. 200

ద్వార: చిత్తము. దేవర యానతి. (నిష్క్రమించి మరల బ్రవేశించి, సంతసముతో) జయము దేవా! పాంచాలకుడు వాకిట నిలిచి యున్నాడు.

యుధి: త్వరగా రప్పింపుము.

**ద్వార:** **(పోయి పాంచాలకునితో వచ్చి)**వీరే మహారాజులు,రమ్ము.

**పాంచా:** జయము మహారాజా! దేవరకును , దేవేరికినిఁ బ్రియ వార్తనుఁ దెచ్చితిని.

**యుధి:** భద్రా! ఆ కౌరవాధముని జాడ దొరకినదా!

**పాంచా:** దేవా! జాడయే కాదు, రాజ్ఞీపరాభవకారయిత యగు నాతడే దొరకినాడు.

**యుధి:** మేలు మేలు. నిజముగఁ బ్రియవార్తనే తెచ్చితివి. కంటఁబడినా డన్నమాట!

**పాంచా:** మహారాజా! కంటఁబడినాడు , పోరికి దింపఁబడినాడు గూడ!

**ద్రౌప:** **(భయముతో)** ఏమీ! నా ప్రాణేశ్వరుడు సమర మొనరించుచున్నాడా?

**యుధి:** **(సాశంకముగా)** నిక్కముగా సమరగోచరుడైయుండెనా మారుతి?

**పాంచా:** నిజము దేవా! తమకన్యథా నివేదింతునా!

**యుధి:** దీనిచే నొక గండము గడచినట్లే! ఇక తమ్ముడా  నీచునిఁ బడఁగొట్టఁ గలిగినఁ గాని నిశ్చింతుడను గాను. సర్వము శ్రీకృష్ణకృప.

**భీము గదాయుధంబు రిపుభీమము, దోర్యుగవిక్రమంబరి**
**స్తోమబలక్షయావహము, శూరుల వీనికి సాటిలేడు సం**
**గ్రామములం, దెరుంగుదును, కాని యిదేమొ, యకారణంబుగా**
**నామది నేడు సందియమునంబడుచున్న దనూహ్యమూఢతస్**201

**(ద్రౌపదితో)** పాంచాలీ! చిరనిరీక్షితమైన దినము రానే

వచ్చినది.

**కురుసభలోన, ద్యూతపరికోపితులైన వృకోదరార్జునుల్ ,**
**గురువులు, బంధువుల్, నృపతికోటియుఁ జూడగఁ, బ్రాప్తమైన యా**
**పరిభవభార మీ దినమె పాయు మనస్ ద్వివిధావకాశమై;**
**కురుపతియో పృథాత్మజులొ కూలుటచేత నసంశయమ్ముగస్. 202**

**(తలయూచి)** నిస్సందేహముగా,

**ప్రతినఁ జెల్లించుకొన నలవాటు పడిన**
**యనుజు డీనాడు కృతకార్యు డగును జూడు;**
**చారు భవదీయకేశపాశమ్ముఁ దాన**
**సంహరించి తత్కర్షణక్షమునితోడ. 203**

పాంచాలక! ఆ నికృష్టుని జాడ యెట్లు దెలిసినది యెక్కడ గానిపించినది యిప్పుడేమగు చున్నదియు సవిస్తరముగఁ జెప్పుము.

**పాంచా:** చిత్తమవధరింపుడు. దేవా! మద్రరాజు మహారాజుల శక్తిచే శక్తిహీనుడై కూలి గాంధారపతియు కుమారసహదేవ శస్త్రానలశలభీకృతుండైన పిదప ననాథంబు విరళంబు నైన కౌరవబలము సాక్రందంబుగ బెదరి చెదరి పారె. అనివారణీయవిజృంభణులైన ధృష్టద్యుమ్నాద్యస్మ త్సేనాపతుల ఢాక కాగలేక,వెరచి, కృపకృతవర్మాశ్వత్థామ లెటకో యరిగిరి. అత్తరి , దినాంతావధికమ్మగు భీమసేనుని దారుణప్రతిజ్ఞ నెరిగి తిరోహితుడైన కౌరవ రాజెచట డాగెనో తెలియ రాలేదు.

**యుధి:** తరువాత?

**పాంచా:** తరువాత దేవా! కృష్ణసారథికులై భీమార్జునులు శమంత పంచకముఁజుట్టిరా వెదకినను నాతని జాడ దెలియలేదు. అప్పట్టున వాసుదేవుడు దైవకృతికి వగచుచుండ, భీముడు నిశాకాలతడిచ్చటులపింగళకటాక్షమ్ముల నెలయించుచుండ, బీభత్సుడు విచారనినిఃసృత నిఃశ్వసితుండై యుండ, మాదృశపరివారజనము కర్తవ్యమూఢమై యుండ,

**ద్రౌప:** ఏమైనది?

**పాంచా:** స్కంధన్యస్తమృగమాంసభారుండును,నూత్నవిశసితమృగ రక్తలోహితదేహవసనుండును, పూర్వసంవిదితుండును నగు నొక్క కిరాతుడు భీమసేనకుమారుని జేరి యవతీర్ణ భారుండై, గమనశ్రమపరుషీభవచ్ఛ్వాసగ్రస్తార్థజ్ఞాతోచ్చరిత పదమ్ములతో నిట్లనియెను.

**యుధి:** ఏమని?

**పాంచా:** 'కుమారా! ఈ చెంగట కృష్ణద్వైపాయనహ్రదము కడ రెండు కాలిజాడలు నీటిలోనికిఁ బోయి నట్లును, నొక్కటి మాత్రమే తిరిగి గట్టెక్కినట్లునుఁ గనబడినవి. పిమ్మటఁ గుమారుడు ప్రమాణము.' అని విన్నవించెను.

**యుధి:** **(తలయూచి)** తరువాత?

**పాంచా:** అపుడు దేవా ! మేమందర మాతడు దారిజూప నా సరస్తీరమున కరిగితిమి. సర్వశుభలక్షణయుక్తములైన తత్పదముద్రలం గని వాసుదేవుడు భీమునితో,' 'బావా! ఈ పాదచిహ్నములు సుయోధనునివే కాఁదగు. అతడు

జలస్తంభనవిద్యావేది యగుట నీ సరస్సులో దాగి యుండె నేమో!' యనియెను.

**యుధి:** లెస్సగా నూహించెను. తరువాత?

**పాంచా:** అంతట భీమసేనుడా మాటలు విని సరస్సులోనికి దుమికి సర్వజలచరశకుంతసంతానభయాస్పదంబుగఁ గలంచి, గట్టెక్కి నిలిచి, దిక్కుహరపూరణంబుగ గర్జించి యాతని నుద్దేశించి యుచ్చైస్స్వరమున నిట్లనియెను. "ఓయీ! వృథాభిమానఖ్యాపన! వధూకేశాంబరాకర్షణ మహాపాతకీ!

**జననంబందితి విందువంశమున, నిచ్చల్ బెన్గదస్ దాల్చుచున్,**
**నను, దుశ్శాసనకోష్ణరక్తమధుపానక్షీబునిస్ శత్రువం**
**చు, నిరస్తాఖిలదుష్టరాక్షసుని గృష్ణున్ సుంత లెక్కింప, కి**
**ష్టనిలో నుండక, నాకు జంకి, హ్రదపంకాంతఃస్థలిస్ డాగితే? 204**

ఓ దురభిమానాంధా! నేటికి నీకు నభిమానముమీద కంటె దేహముమీద ప్రేమ మెక్కువైనదా!"

**జడల ముడుల్ విడస్, మగలు సచ్చిన కౌరవకాంత లేడ్చిన**
**ప్పుడ, చిరమన్యుపావకసముద్భవదుర్వ్యథ తీరెఁ గృష్ణకున్,**
**వడముడి దుస్ససేను నెద వ్రచ్చుచు రక్తముఁ ద్రావఁ జూచియున్**
**మడువున డాగితే!దురభిమాన మకాలమునస్ ద్యజించుచున్ 205**

ఇంతకంటె, పాంచాలీపతిని శరణు వేడిన మేలు గదా' యని యధిక్షేపించెను.

**ద్రౌప:** తదీయదురభిమానభిత్తికాశనిపాతములైన యీ మాటలే నా మనోవ్యథను సగము బోగొట్టినవి. ఇక నా నాథుని

క్షేమముగాఁ జూడఁగలిగినఁ జాలును.

**యుధి:** దేవీ! ఇట్టి సమయమున సందిగ్ధాలాపము లాడకుము. పాంచాలకా! తరువాత!

**పాంచా:** దేవా! అంత గురురాజెంతకును రాకుండుటచే విసివి గదాపాణియై యా విశాలసరస్సులోనికి మరల దుమికి జలచరమ్ము లెగిరిపడ, జలపక్షు లెగిరి పార, జలమ్ము లొడ్డు దాటి పొరల, సర్వజంతూపద్రవమ్ముగ నుద్ధతమ్ముగఁ గలగుండు పెట్టెను.

**యుధి:** ఐనను వెలువడలేదా?

**పాంచా:** దేవా! వెలువడ కెట్లుండఁగలడు!

**రోధోమధ్యచరన్మరుత్సుతముహుర్ధోర్మందరోన్మంథనస్,**
**గ్రోధాగ్నిస్ఫుటవిస్ఫులింగసమదృగ్ఘోరాకృతిస్, క్షీరపా**
**థోధిప్రోత్థహలాహలాగ్నిశిఖకుస్ దోడై సరోమూల మా**
**యోధుండంతట వీడివచ్చె,మనవా రుత్సాహులై యార్వగస్.** 206

**యుధి:** సాధు! క్షత్రియుడనిపించుకొనినాడు. తరువాత!

**పాంచా:** అట్లు వెలువడి గదసారించుచు మారుతితో "నోయీ! మీకు బెదరి దాగితి ననుకొంటివా? మిమ్మింకనుఁ బరిమార్పకునికికి లజ్జించుచు నిట విశ్రమించితిని గాని నాకు మీవలననే కాదు మరి యెవరివలన నైనను వెరపేమి ? " యని పలికెను.

**యుధి:** అదిగో!అభిమానమింకను చేవతోనే యున్నది.తరువాత!.

**పాంచా:** దేవా! అంతట బరస్పరాధిక్షేపవాక్యములతో నచటనే యుద్ధసంనద్ధులైన వారిరువురను కృష్ణార్జునులు

వారించి యొద్దనకుఁ దెచ్చిరి.

**యుధి:** తరువాత!

**పాంచా:** అంతఁ గురుప్రభువు, నానాపక్షిసమూహభక్ష్యమాణ నిహతనరవాజిగజశరీరసమ్మర్దంబును,విశీర్ణరథసహస్ర భరితమ్మును, అపగతస్వబంధుమిత్రమ్మును, నిష్కారవమ్మును, సముద్ధతప్రతిబలయోధమ్మును నైన రణరంగమ్ము నొకసారి పరికించి దీర్ఘముగ వెచ్చ నూర్చెను.

**యుధి:** అపుడైన విదురగాంగేయకృష్ణాదుల బోధనలు జ్ఞప్తికి వచ్చి యుండును. తరువాత?

**పాంచా:** అట్లు విషణ్ణుడై యున్న యాతనితో భీమసేనుడు , "దుర్యోధనమహారాజ! పూర్వపరిజ్ఞాతమే యైన బంధు నాశమునకు నేడు వగవనేల? పాండవులు ససహాయు లనియు, నీ వేకాకి వనియుఁ జింతింపకుము.

> **కొనుము కవచమ్ము, నివిగో, కైకొనుము నీకు**
> **వలయు శస్త్రముల్; మా భ్రాతృపంచకమున**
> **నెవరితోఁ బోర సులువని యెంతు వీవు,**
> **వానితో సమసమరపర్వమ్ము నీకు."** 207

అని చెప్పెను.

**యుధి:** క్రోధవశుడయ్యును తమ్ముడు ధర్మము నేమరలేదు. తరువాత?

**పాంచా:** దేవా! ఆ మాటలు విని ధార్తరాష్ట్రాగ్రజుడు సాసూయముగ భీమార్జునులను మార్చి మార్చి చూచుచు-

**అనుజహంత యొక్కడు మిత్రహంత యొక్క**

**డగుట, మీ యిర్వురం దెవ్వడైన నొకటె,**

**కాని సాహసప్రియుడవు గాన నాకు**

**నప్రియుడవయ్యుఁ, బ్రియుడవీ వాజి సలుప.'208**

అని తన నిశ్చయమును బ్రకటించెను.

**యుధి:** అది తమ్ముని ప్రతిన కనుకూలమే. తరువాత?

**పాంచా:** అంతట వారిరువురు గృతపరికరులై పరస్పరోపాలంభ వాక్యపూర్వకమ్ముగ గడగి, బహువిధపరిభ్రమిత గదాదండులగుచు, నానావిధ సంచారమ్ముల, వివిధచంక్రమణమ్ముల బరస్పరజిగీషతో దిదృక్షుచక్షు ర్భీకరమ్ముగఁ బోరసాగిరి. శ్రీకృష్ణులంతట నన్ను దేవర కడకు సందేశహరునిగాఁ బంపిరి.

**యుధి:** ఏమని భగవానుని సందేశము?

**పాంచా:** యుధిష్ఠిరమహారాజా! ఆసన్నావధికమైన మన భీమసేనుని దారుణప్రతిజ్ఞయుఁ, దిరోహితుడైన సుయోధనుడును మనకు నిక్కముగఁ జింతాహేతువులే యైనవి. కాని, యిప్పటికా దుష్టుడు భీమబాహుపంజర గ్రస్తుండగుట మన మనఃఖేదంబు వాసె. నీవిక సకల మహీచక్రంబు నిర్వైరిచక్రంబుగ నెంచుము. మంగళా రంభములఁ బ్రవర్తింపఁ జేసి నిశ్చింతముగా నుండుము.

**తరియయ్యెస్ సమకూర్ప వస్తువులఁ ద్వద్రాజ్యాభిషేకార్థమై,**

**చిరకాలోజ్ఝితకేశబంధమమరుస్ సింగారమై కృష్ణకుస్,**

**ధరణీశద్రుమభంక్తృశాతపరశూద్దండుండు రాముండు, దు**

**ర్భరకోపాంధుడు భీముడున్,రిపులఁద్రుంపన్ సందియంబుండునే!** 209

అని మీకు విన్నవింపు మనియెను.

**ద్రౌప:** త్రిజగన్నాథుడే యిట్లు పలుకగా నన్యథా యగునా!

**పాంచా:** అమ్మా! ఇది కేవలము భగవానుని సందేశమే కా దాదేశము గూడ.

**యుధి:** భగవద్వాక్యము నెవడు మాత్రము వికల్పించును? ఎవరక్కడ?

**(కంచుకి ప్రవేశించును)**

**కంచు:** జయము మహారాజా! ఏమి యానతి?

**యుధి:** దేవకీనందనప్రసాదమున మన భీమసేనుడు విజయియై రానున్నాడు. తదుచితమంగళాచరణముల సిద్ధము జేయింపుము.

**కంచు:** **(ఉత్సాహముతో పరిక్రమించి)** ఓహో!పురోహితప్రధాను లారా! అంతఃపురనియుక్తులారా! తూర్యవాదకులారా! భుజబలప్లవోత్తీర్ణధార్తరాష్ట్రకల్పితపరాభవసాగరుడును, దుర్వహప్రతిజ్ఞాభారనిర్వహణవిరాజితుండును ,ధార్తరాష్ట్ర శతతరూన్మూలన ప్రభంజనుడును, దుశ్శాసనవక్షో విదారణనరసింహుడును,దుర్యోధనోరుభంగనిర్ధారిత పరిపూర్ణవిజయుండును, నగు చిరంజీవి భీమసేనునకు సమ్మానమంగళాచరణములకై యుధిష్ఠిరమహారాజుల వారు సాదరముగా నానతి యిచ్చినారు. కనుక యాయా కృత్యములనుఁ గావించుకొని సిద్ధముగా నుండుడు.**( చెవి యొగ్గి)** ఏమంటివి? అంతటను సర్వసంసిద్ధముగాఁ

జేయించియే యున్నాము, చూడలేదా యనియా!
మంచిది, నాయనలారా! చెప్పక మునుపే సరి యైన
పనులు జేసి యుండుటయే నిక్కపు రాజభక్తి గదా!
**(మరలి వచ్చి)** దేవా! అంతయు సిద్ధముగానే యున్నది.

**యుధి:** మంచిది.జయంధర!

**కంచు:** దేవ! ఆజ్ఞాపింపుడు..

**యుధి:** ప్రియవార్తాశ్రావకునీ పాంచాలకునిఁ బారితోషికమునఁ
బరితుష్టునిఁ గావింపుము.

**కంచు:** చిత్తము. దేవర యానతి. **(ఇరువురును కంచుకితో
నిష్క్రమింతురు.)**

**ద్రౌప:** మహారాజా! ఆ దుష్టకౌరవునకు మీలో నొక్కరితో
మాత్రమే పోరినఁ జాలని యవకాశమిచ్చుటలో
భీమసేనుని యాంతర్యమేమై యుండును! ఆత డొకవేళ
కవలలో నొకరినిఁ గోరుకొని యున్నచోఁ గీడు గదా!

**యుధి:** స్వపక్షము రథికత్రయావశిష్టమగుటఁ జేసి శరీరమాత్ర
విభవుడై మిగిలిన ధార్తరాష్ట్రుడు రణమ్ముఁనే వీడినను,
బిత్రుముఖమున సంధినే వేడినను, సర్వరిపువధప్రతిజ్ఞ
వ్యర్థమై మిగులును గనుకయు, మా యేవురలో నొక్కని
యెదుట నైన సుయోధను డొక్క నిముస మైన నిలిచి
పోరలేమి ధ్రువం బని దెలిసియుంటచేతను, వాని కీ
జయలోభమును గల్పించుటకై జరాసంధవైరి యిట్లు
నియమించి యుండును. ఐననుఁ జచ్చువరకు
దురభిమాన ముడుగ నేరని సుయోధనుడు తప్పక

భీమునే, యందును గదారణమునకే కోరుకొనును. నాకిట్లనిపించుచున్నది.

**మారుతి కీడు లేరు నరమాత్రులలోన గదారణమ్మునన్,**
**సీరిని బోలు కౌశలము చేత సుయోధనుడున్ బ్రశస్తుడే!**
**వీరిక యుద్ధమంచుఁ దలపించుచునున్నది యంతరాత్మ, త**
**త్కౌరవపద్మమత్తకరికల్పునకున్, శుభమౌను గావుతన్.** 210

**(తెరలో)**

అయ్యా! దాహార్తుడను. అలసితిని. ఎవరైన నీరిప్పించి నీడకుఁ జేర్చి కాపాడుడు.

**యుధి:** **(విని)** ఎవరక్కడ?

**(కంచుకి ప్రవేశించును)**

**కంచు:** దేవా! ఏమి యానతి?

**యుధి:** ఎవరో చూచి రమ్ము.

**కంచు:** చిత్తము. **(పోయి మరలి వచ్చి)** దేవా! శ్రాంతుడైన యతిథి వాకిట నున్నాడు.

**యుధి:** త్వరగాఁ గొనిరమ్ము.

**కంచు:** చిత్తము. **(నిష్క్రమించును)**

**(పిదప మునివేషములో నున్న చార్వాకుడను రాక్షసుడు ప్రవేశించును.)**

**రాక్ష:** **(తనలో)** సుయోధనస్నేహమువలనఁ బాండవులకుఁ గీడుఁ జేయఁగోరి చూచుచున్న నాకు నేటికీ యవకాశ మొదవినది. ఈ చార్వాకరాక్షసుని మాయాకల్పన కీ పాండవు లెట్లు నిలిచెదరో చూచెద గాక. **(పరిక్రమించి, ప్రకాశముగా)** అయ్యా! దప్పిగతో నున్నాను. ఎవరైన

పానీయ మిప్పించి సేద దీర్చగలరా! **(సమీపించును**

**(అందరు లేచి నిలిచి యుందురు ).**

**యుధి:** మునీ! నమస్కారము.

**రాక్ష:** రాజా! ఇది శిష్టాచారములకు సమయము గాదు. ముందు నాకు కొంచెము నీరు దెప్పింపుము.

**యుధి:** అట్లే.ఇదె యాసనము. కూర్చుండుడు.

**రాక్ష:** **(కూర్చుండి)** మీరును గూర్చుండుడు.

**(అందరు గూర్చుందురు)**

**యుధి:** ఎవరక్కడ? మహర్షికి మంచినీరు దెచ్చి యిమ్ము.

**కంచు:** **(కలశముతో బ్రవేశించి)** మహారాజా! ఇదిగో సురభిశీతలజలకలశమును పానపాత్రమును.

**యుధి:** ఆర్యా! దాహముఁ దీర్చుకొనుడు.

**రాక్ష:** **(ఆచమింపఁ బోవుచు)** అయ్యా! నీ తీరుఁజూడ క్షత్రియుని వలె నున్నావు!

**యుధి:** సరిగా యూహించితిరి. క్షత్రియుడనే.

**రాక్ష:** అట్లయిన, నిత్యసంగ్రామప్రవర్తులగు మీకు స్వజన మరణాశౌచ మత్యంతసులభము. కనుక మీ చేతి నీరు ద్రావ రాదు. సరియే,యీ నదీపరిప్రసారశీతలవాయువులే మా శ్రమఁ దీర్చును లెమ్ము.

**ద్రౌప:** బుద్ధిమతికా! మహర్షికిఁ దాలవృంతముతో వీచుము.

**(చేటి విసరును)**

**రాక్ష:** అమ్మా, మునిజనులకు మా కీ రాజోపచారములు దగునా?

**యుధి:** మహర్షీ! ఏ కారణమున మీరింతటి శ్రమఁ గలిగించుకొంటిరి?

**రాక్ష:** కౌతుకాధీనమానసుడనై, యీ శమంతపంచకమున జరుగుచున్న క్షత్రియవీరుల ద్వంద్వయుద్ధముల నాలోకించుచు బెక్కుదినములనుండి తిరుగుచుండుట చేత మిగుల నలసితిని. అందుచేతనే నేడీ శరదాతపము న కోర్వలేక తుదివరకుఁ జూడక, సగములోనే సుయోధ నార్జునుల గదాయుద్ధమును వీడి వచ్చితిని.

**(అందరు ఖిన్నులై యులికిపడుదురు.)**

**కంచు:** మహర్షీ! కాదు కాదు. సుయోధనభీమసేనులకు గదా!

**రాక్ష:** ఏమీ ! చూడకయే మాటలాడుచుంటివి? అట నుండి వచ్చినవాడను నేనా, నీవా?

**యుధి:** మహర్షీ! చెప్పుడు చెప్పుడు.

**రాక్ష:** ఒక్క క్షణకాలము విశ్రమించి యంతయు నీకుఁ దెలుపుదును గాని యీ ముదుసలికిఁ జెప్పను.

**యుధి:** ఏమంటిరి? సుయోధనార్జునులకనియా?

**రాక్ష:** వారికనియే కదా ఇంతకు మునుపు జెప్పితిని?

**యుధి:** కాని, భీమునితోఁ గాదన్న మాట!

**రాక్ష:** అది ముందే జరిగిపోయినది.

**(రాజును ద్రౌపదియు మూర్ఛిల్లుదురు. కంచుకియుఁ,జేటియుఁ దేర్చుదురు)**

**యుధి:** **(తేరుకొని)** మునివరా! ఏమంటిరి? భీమసుయోధనుల యుద్ధ మింతకు ముందే జరిగిన దనియా?

**ద్రౌప:** **(దుఃఖముతో)** స్వామీ , ఎమి జరిగినదో పూర్తిగాఁ

దెలుపుడు.

**రాక్ష:** కంచుకీ! ఏల వీరిట్లు కలవరపడుచున్నారు? ఎవరయ్యా వీరు?

**కంచు:** వీరు యుధిష్ఠిరసార్వభౌములును, వారి దేవేరి పాంచాల రాజదుహితయు.

**రాక్ష:** అయ్యో! ఛీ ఛీ! క్రూరుడను. తెలియక దారుణమైన పనిఁ జేసితినే!

**ద్రౌప:** హా నాథా! భీమసేనా! **(మూర్ఛిల్లును. చేటి మరల దేర్చును.)**

**కంచు:** దేవా! ఈ వార్త యేమి?

**యుధి:** **(కన్నీటితో)** విధి ప్రతాపము!

**మునివర! సందిగ్ధార్థము**
**వినినప్పుడ దుఃఖభరము పెల్లయ్యె, ధ్రువం**
**బని యే తెలిసిన నాక్షణ**
**మునఁ బ్రాణత్యాగసుఖముఁ బొందుదు సుమ్మీ!211**

**రాక్ష:** **(సంతోషముతోఁ దనలో)** నా యత్నము గూడ దానికేలే! **(ప్రకాశముగా)**ఇది జెప్పినందుకే నేను జింతించుచుంటిని. మీరంతగాఁ జెప్పుమన్న సంక్షేపముగాఁ జెప్పెదను. బంధువ్యసనవార్తను విస్తరింపరాదు గదా!

**యుధి:** **(డగ్గుత్తికతో)** మహర్షీ!

**విస్తరంబొ, సంక్షేపమొ, విశదపరపు,**
**మిచ్చ మెయి, వానిఁగూర్చి యేదేని వినగ**
**సిద్ధపడినాడఁ బాషాణచిత్తుడను ని**

**తాంతపీడితానుజుడఁ గర్తవ్యజడుడ.** 212

రాక్ష: అయిన వినుడు.

**కురుపతియుస్ వృకోదరుడు ఘోరవిధమ్ముగనఁ బోరుచుండ,**

ద్రౌప: **(సంభ్రమముతో)** ఏమి జరిగెను?

రాక్ష: **.... సత్వరుడయి వచ్చె .**

యుధి: ఎవరు?

రాక్ష: **.....సీరి.**

యుధి: **(సాలోచనముగా)** సీరియా! వచ్చి?

రాక్ష: **.... యటు వచ్చి కనుంగొనుచుండి యుండి, త**

**త్కురుపతి మీది కూర్మిమెయి గూఢపు సంజ్ఞ యొనర్ప, నాత డ**

**వ్వైరవున భ్రాతృహంత యగు భీమునిపైఁ బగనీగె భూవరా!** 213

యుధి: వత్సా! వృకోదరా! **(మూర్ఛిల్లును)**

ద్రౌప: నాథా భీమసేనా! సౌగంధికాహరణప్రియకారణా!

నాపరాభవమునకు ప్రతీకారమొనర్చు నేకాధారమవు

నీవు గూడ లేకపోయితివా! **(మూర్ఛిల్లును)**

కంచు: హా కుమారా! నీ విజయవార్త లప్పుడే విపర్యయము

లైనవా! మహారాజా! శోకింపకుడు . మహర్షీ! వీరినించుక

యోదార్పుడు.

రాక్ష: **(తనలో)** ఓదార్తును, పిదప నుసురును బాపుదును.

**(ప్రకాశముగా)** భీమాగ్రజా! వృత్తాంతశేష మున్నది. ఒక్క

క్షణము సహింపుము.

యుధి: **(తెప్పరిల్లి)** ఏమా శేషము?

ద్రౌప: **(తెలిసి, యాశతో)** స్వామీ యేమది?

రాక్ష: **అమ్మెయి జన్మయోగ్యమగు నంతము నందిన యన్నఁ గాంచి, దుః
ఖమ్మున నర్జునుండు దన గాండివ మవ్వల పైచి, రక్తసి
క్తమ్మగు భీమసేను గదఁ గైకొని కౌరవుఁ దాకెఁ, గృష్ణు డ
డ్డమ్మయి యేమొ చెప్పగ నొడంబడకుండఁ బ్రచండవేగియై. 214**

సుయోధనుండును విజయసంభ్రమమహోద్ధతగదా
భ్రమణపద్ధతుల సముద్ధురాహ్వానమ్మున నాతని
మార్కొనియెను. అంత గదాయుద్ధమున వారల
తారతమ్యము నెరింగిన బలరాముడు కిరీటి యోటమి
నూహించి, స్నేహవశమునఁ గదలలేకున్న కృష్ణుని
బలవంతముగా రథ మెక్కించుకొని ద్వారకకుఁ బోయెను.

**యుధి:** అర్జునా మేలు మేలు. గాండీవమును విడిచినప్పుడే
భీమానుసారివైతివి. మరి నేనే రీతి నీ పాదు ప్రాణములఁ
ద్యజింతును?

**ద్రౌప:** **(దుఃఖించుచు)** నాథా! గదాపరిశ్రమమెరుగని నీ తమ్ముని
దారుణుడైన రిపుని ముందు డించి పోవుట నీకుఁ
దగునా? **(మూర్ఛిల్లును)**

రాక్ష: రాజా! అంతట నేను ....

**యుధి:** చాలు చాలు, ఇంకను వినవలయునా! వత్సా, భీమ
సేనా! నాడు కాంతారవాసమున నిన్ను జూచుకొని కదా
మేమన్ని యాపదల గడచితిమి!ఇక యీ కష్టకాలమున
నీవులేని మా కెవ్వరు దిక్కు? ఏ యపరాధమునకుఁ
గినిసి నన్ను వీడి పోయితివి తండ్రీ!

**అపుడు దురోదరవ్యసనినొచు గజాయుతసత్త్వ, నిస్, గత**

**త్రపుడఁ, బణీకరించితిని, దాసత సైచితి వీవు భక్తి మై;**
**యపకృతి సేసినానె యిపు డంతకు మించి? యిటుల్ దృజించి న**
**న్నపగతబంధుఁ జేసితివె? యంతటి భక్తియు నేడు బోయెనే? 215**

ద్రౌప: **(తెలిసి)** మహారాజా! ఏమైనది?

యుధి: ద్రుపదపుత్రీ! ఏమైనదేమి!

**బకకిమ్మీరహిడింబసారసలతావన్యేభముస్, దుష్టకీ**
**చకదావానలకీలికావళిఘనాసారంబు, లోకైకబా**
**ధకబార్హద్రథిభూరిభూధరభిదాదంభోళి, త్వద్వాంఛితా**
**ర్థకృతిస్థేముడు భీముడే మనకు దూరంబయ్యె సాధ్వీమణీ! 216**

ద్రౌప: హా నాథా! నీవుగదా నా వియుక్త కేశములను ముడువ వలసిన వాడవు! ఈ రీతిఁ బ్రతిజ్ఞ నిర్వర్తింప కుండుట నీ వంటి సుక్షత్రియునకుఁ దగునా! అట్లయిన నిదే నేనును నీ వెంట వచ్చెదను.**(మరల మూర్ఛిల్లును)**

యుధి: తల్లీ, కుంతిభోజపుత్రీ! నీ సుతుని చేతల వింటివా? నన్ననాథుని జేసి తా నొంటరిగా నేగెనట! నాయనా జరాసంధఘాతీ! నీ వింత యల్పాయుష్కుఁడ వని తెలుపు విపరీతనిమిత్తము నొక్క టైనను జూచిన వా డెవ్వడును లేడే! కాదు కాదు. నేనే చూచితిని. కాని, మూఢుడనై గురుతింపక పోయితిని. వత్సా!

**కరదీభూతనృపాఖిలావనిని నా కర్పించియున్ బొంగిపో,**
**వరికిన్ గింకరుగా నొనర్చుతరి నా యందున్ గ్రుధన్ బూన, వ**
**వ్విరటున్ గొల్చితి వయ్య! పాచకత దుర్భేద్యమ్ముగా శాంతిమై,**
**యెరుగన్ ద్వద్విపరీతలక్షణములం చివ్వెల్ల నే మూఢతన్. 217**

మహర్షీ! ఏమంటిరి? బలరాముడు రహస్యముగఁ జేసిన సన్న నెరిగి సుయోధనుడు భీమునిఁ గూల్చె ననియా!

**రాక్ష:** అవు నంతే.

**యుధి:** కృష్ణాగ్రజుడేమి! ఇట్లొనరించుట యేమి! ఇంతకును మా కర్మ మిట్లున్నది గాబోలును! దేవా!కామపాల! సుభద్రా భ్రాత! సర్వధర్మజ్ఞుడవు నీవేనా యిట్లుఁ జేయవలసినది?

**జ్ఞాతిప్రీతి గణింప వించుకయు; మా కౌంతేయులుస్ గృష్ణుడుస్**
**జేతోమోదదసఖ్యబద్ధులగుటస్ జింతింప వింతేని; యీ**
**రీతిస్ క్షత్రియధర్మముస్ విడిచి, దుర్నీతిస్, భవచ్ఛిష్యునం**
**దే తప్పుల్ బొనరింప, నే మునుపు నీ కే కీడు గావించితిస్? 218**

**(ద్రౌపదినిఁ జూచి)** దేవీ! యూరడుము. అతిమాత్ర దుఃఖితుడనైన నన్నింకనుఁ గ్రుంగఁదీయకుము.

**ద్రౌప:** **(తెలిసి)** నాథా భీమసేనా! దుశ్శాసనదుర్యోధనరుధిరార్ద్ర హస్తములతో నా వేణి ముడువుము. చేటీ! నీ యెదుటనే కదా నాథుడు ప్రతిజ్ఞ చేసి యుండెను?**(కంచుకితో)**ఆర్యా! ఇంతకు మునుపే కదా వాసుదేవుడు కేశబంధ మహోత్సవమున కాయితము గమ్మని తెలిపెను? అది మిథ్యయేనా! కానిమ్ము, ఆలసింపక నా నాథునే యనుసరింతును. మహారాజా! దయదలచి నాకు జితిఁ బేర్పింపుము. నీవు క్షత్రియోచితవృత్తిని భ్రాతృహంత పైకేగుము. లేదా, నీ యిష్టమైన రీతినిఁ జేయుము.

**యుధి:** దేవీ! నిజము జెప్పితివి. కంచుకీ! ఈమెకుఁ జితారోహణము తాపోపశాంతినే కలిగించుగాక. నా

ధనుర్బాణము లందిమ్ము. **(కొంచెమాగి)** ధనుర్బాణము లెందుకు ? జయించి యేమి యొరగించుకొందును?

**పాతితపూర్వజక్షతజపాటలఘోరగదాజిఘ్నుకుపై**
**చేతి ధనుస్సు వీడి , తన చేతలఁ గ్రీడియ దారిఁ జూపె నా,**
**కా తెరగొప్పు, భ్రాతృయుగ మట్లయినప్పుడు గెల్చి, కొన్న యీ**
**భూతల మేల , కాల్పనె? రిపుస్ బొరిగొందునొ లేక చత్తునో ! 219**

**రాక్ష:** రాజా! నీ కంత జయేచ్ఛయే లేనిచో నటకేగుట వృథాశ్రమము. ఎచటనో ప్రాణత్యాగముఁ జేయుము.

**కంచు:** ఛీ! ఛీ! మహర్షీ! మీ మనసు రాక్షససదృశము.

**రాక్ష:** **(ఉలికిపడి)** ఈ ముదుసలి నన్ను గురుతింపలేదు కదా! **(ప్రకాశముగా)** ఓయీ కంచుకీ ! అది కాదు. సుయోధనార్జునుల గదాయుద్ధమును బ్రత్యక్షముగా జూచితిని గదా! దాన వారి భుజసారతారతమ్య మెరింగిన వాడను గనుక నీ రాజర్షికి మరొక దుర్వార్తాశ్రవణ వ్యసనము గలుగరాదని యిట్లు చెప్పుచుంటిని.

**యుధి:** మహర్షీ! అప్రియమైనను, సుస్నిగ్ధముగ బలికితిరి. అదియే మేలనిపించుచున్నది.

**కంచు:** మహారాజా! దేవకల్పులు తమరు గూడ శోకాంధ్యమున క్షత్రధర్మము నుజ్జగింతురా?

**యుధి:** జయంధరా! ఇతడు చెప్పినది మాత్రము సత్యము గాదందువా! నిజ మారసినను,

**ఉన్నత బాహుయుగ్మకుల, నుత్తరపూర్వదిశావిజేతలస్,**
**సన్నుతశీలురస్, ధనదశక్రపురప్రతిదృష్టశౌర్యసం**

**పన్నులఁ, జూడఁజాల నటు కష్టదశన్ బడియున్న తమ్ములం,**
**బన్నిదమాడి వారిఁ బరిమార్చి చెలంగు నరాతి నేనియున్.   220**

కావున బ్రాణత్యాగమే సర్వోత్కృష్టమార్గము. దేవీ! చితి రగులునంతలో నిరువురము గలిసియే బంధుజనుల వీడుకొందము.

**ద్రౌప:** ఆర్యా! దారుసంచయము గావించి యగ్ని రగిలింపుము. నా నాథుని జేర నా మది తొందరపడు చున్నది. **(పరికించి)** ఇదేమి? ఎవ్వరును మా యాజ్ఞఁ బాలింప కున్నారు? నాథా భీమసేనా! నీవు లేని యీ కురు కులము నేడు పరిజనులకు గూడ జులుకన యైనది గదా1

**యుధి:** అయ్యా! తాపసా! ఎవరును మా మాట వినుట లేదు. తమరైన ననుగ్రహింపరా?

**రాక్ష:** రాజా! ఇది మునిజనులకుఁ దగని పని. **(తనలో)** ఇప్పటికి నా యత్నము ఫలింపఁ బోవుచున్నది.ఇక కనుచాటుగా నుండి కథ నడపెదను.( **ప్రకాశముగా)** రాజా! నే నిక్కడ  నిలువలేకున్నాను.**(నిష్క్రమించును)**

**యుధి:** దేవీ! ఒక్కడును విధేయుడుగా లేడు . సరే, నేనే స్వయముగాఁ జితిఁ బేర్చెదను.

**ద్రౌప:** త్వరపడుడు మహారాజా!

**(నేపథ్యమున గలకలము)**

**ద్రౌప:** **(విని భయముతో)** మహారాజ! ఎవనిదో విషమభీషణ మగు శంఖారావము వినవచ్చుచున్నది. మరియే పాడు

వార్త వినవలసి యుండుటచే జాగగుగుచున్నదో కదా?

**యుధి:** జాగేమియును లేదు లెమ్ము.

**(పరిక్రమింతురు)**

**యుధి:** పాంచాలీ! శ్వశ్రూసపత్నీజనముల కేదైన సందేశముఁ బంపి యీ పరిజనమును వీడుకొలుపుము.

**ద్రౌప:** బుద్ధిమతికా! అత్తగారితో నిట్లు జెప్పుము.
"బకజటకికిమ్మీరహిడింబసింహబలజరాసంధాదియోధ
విజయమల్లుడు నీ మధ్యమసుతుడు దుర్భాగ్యవతినైన
నాకారణముగఁ బరలోకగతు డయ్యెను,దద్వియోగభీతనై
నేను ననుగమించుచున్నాను." అని.

**యుధి:** మాతల్లితో నా మాటగా యిట్లు జెప్పుము.

**"తగులఁబడు లక్కయింటిలోఁ దగులఁబడక,**
**పుత్రసహితవై యే పుత్రు భుజబలమునఁ,**
**బ్రదికితివో, వానిఁ గూర్చి దుర్వార్తఁ జెప్ప**
**వలసె నా, కిట్టివాడింకఁ గలడె తల్లి!"** 221

జయంధరా! నీవు సహదేవుని కడకేగి యా యపర
బృహస్పతితో, సకలకురుకులలలితవన దవానలుడైన
యుధిష్ఠిరుడు నీకిట్లు జెప్పు మనియె నను ము.
'సహదేవా! ఒక్కమాట.

**అనుజుడ వయ్యుఁ, దుల్యుడవె యౌదువు జ్ఞానమునందు,బుద్ధి లో**
**న నరయ నీవ జ్యేష్ఠుడవు నాకు, మనీషితచే గురుండవున్,**
**గనుక నినున్, లలాటఫలకమ్మునఁ బాణియుగమ్ము మోడ్చి ప్రా**
**ర్థనమొనరింతు నన్న! పితృతర్పణముల్ నెరవేర్చుచుండుమీ.'222**

జయంధరా! మరియు నకులునితో నిట్లు జెప్పుము.
"తమ్ముడా! హృదయసారమున మాకంటె నెక్కుడు
వాడవు. మా మార్గము నీ కనుసరణీయము గాదు.

**ఇక విడనాడు మా యెడల నిప్పటి దాకఁ గలట్టి కూర్మిఁ, దం**
**డ్రికి నుదకప్రదాన మొనరించుటకై సహదేవుఁగూడి కా**
**చికొనుడు మిమ్ము మీరు, వనసీమల కేగియొ, యాదవాళి చెం**
**తకుఁ జనియో, పరస్పరకృతప్రణయాపగతాత్మఖేదులై."** 223

అని తెలుపుము పొమ్ము, నా పై యాన.

**ద్రౌప:** బుద్ధిమతికా! సుభద్రకిట్లు జెప్పెదవా! 'అంతర్వత్ని
యైన యుత్తర కిప్పుడు నాల్గవ నెల. ఆ గర్భస్థుడే
యుత్తరత్ర నిరువంశములవారికిని జలప్రదాత
కానున్నాడు. కనుక సర్వధా నామెను సంరక్షించు
కొనుము ' అని.

**యుధి:** **(నిట్టూర్చి)** ఔరా! ఎంత దైన్యము! దగ్ధవృక్షమును నీడకై
యాశ్రయించినట్లున్నదీమె యవస్థ!

**బహుధావిస్తృత భూరిశాఖల, ధరాప్రచ్ఛాదనచ్ఛత్రమై ,**
**సహితస్కంధమహాలవాలతలపైశద్యమ్మునం బొల్చు భూ**
**రుహమున్ బోలు మహాన్వయంబు, విధి పారుష్యమ్మునన్ నష్ట మ**
**య్యె; హతాశన్ బునరుద్ధరించు నొకొ యింకీ యంకురం బీమెకున్** 224

ఇక పూర్వనిశ్చితవిధిం బ్రవర్తింతును గాక. జయంధరా!
ఇంకను నీవు బోనేలేదా! శపథపూర్వకముగాఁ
జెప్పినను గదలవా!

**కంచు:** **(దుఃఖముతో)** దేవా! పాండుమహారాజా! నీ పుత్రులకా

యీా దురవస్థ! అమ్మా, కుంతిభోజకులపతాకా!

పృథాదేవీ! నేటికిని నీ కష్టములు ముగియలేదా!

**సకలమహీతలమ్ముఁ, దన చల్లని నీడ సుఖింపఁజేయు తా**
**వకసుతకాననమ్ము, బలభద్రుడు త్వత్ప్రియసోదరాత్మజుం**
**డకరుణుడో, దురాత్ముడో, పెడంగో, గదారణమందు భీము దే**
**శికుడఁ, గిరీటి బావనని, చింత యొనర్పక, యిట్లు గాల్చెనే!** 225

**(రోదించుచు పోఁబోవును.)**

**యుధి:** **(స్మృతి నభినయించి)** జయంధరా!

**కంచు:** దేవా!

**యుధి:** **(నిర్వేదముతో)** మనకంతపాటి యదృష్టము లేదు గాని, చెప్పవలసినది గనుక చెప్పుచున్నాను. ఒక వేళ యర్జునుడే విజయియై వచ్చినచో నా మాటలుగా నిట్లు జెప్పుము.

**'హలియే హేతువు భీముడిట్లగుట, కట్లైనన్ సరే వానిపై**
**నలుగం బోకు, మతండు జూడ మన కత్యంతాప్తుడున్ బావయున్**
**జెలి యౌ కృష్ణున కన్నయే కనుక; మన్నింతేని నన్నీవు, కా**
**నలకైనం జను, గాని, నిష్కరుణ మూనం బోకుమీ క్షాత్రమున్.** 226

**కంచు:** దేవా అట్లే. **(నిష్క్రమించును)**

**యుధి:** పాంచాలీ! ప్రజ్వలితపావకదేవు డడుగో కీలికాకరములతో మనల నాహ్వానించుచున్నాడు. ఇదే ప్రవేశింతును.

**ద్రౌప:** మహారాజా! మన్నింపుడు. ముందు నేనే చొరగా ననుజ్ఞ యిండు.

**యుధి:** అటులైన గలిసియే చొత్తము రమ్ము.

**చేటి:** అయ్యో! సకలదేవతలారా! సోమవంశరాజర్షి యుధిష్ఠిరుడును, యజ్ఞవేదీసంజాత ద్రుపదపుత్రియు బంధువ్యసనార్తులయి యగ్నిలోఁ బడుచున్నారు. కాపాడరా! (వారిపాదములపై బడి) దేవా! ఏమి యీ దారుణనిర్ణయము!

**యుధి:** ప్రియసహజుడు గతించినప్పుడు జేయవలసినదే. **(స్మృతినభినయించి)** భద్రా! జల మిటు దెమ్ము.

**చేటి:** **(జలపాత్రముఁ దెచ్చి యిచ్చును)**

**యుధి:** **(ఆచమించి, నీటిని దోసిలితో వదలుచు)** ఇది ప్రపితామహుడు శంతనునకు. ఇది పితామహుడు విచిత్రవీర్యునకు. ఇది **(గద్గదముగా)** జనకుడు పాండు రాజునకు. **(వదలి)**

**చలిపియుంటి నీ కిన్నాళ్ళు సలిల కర్మ,**
**కలుగఁ బోదింక నేనిచ్చు జలము నీకు,**
తుట్టతుదిగ, మాద్రీమాతతోడఁ గూడఁ
గలిసి కైకొను **మీ జలాంజలిని తండ్రి!** 227

ఇక తమ్మునకు. **(కన్నీటిని దుడిచికొని, నీటిని దోసిట బట్టి )**

**నీరమిదే లసజ్జలజనీలవిలోచనసుందరాస్య , యో**
**మారుతి, నీకు! నొక్క క్షణమాగు, పిపాస యడంపు మయ్య, నిస్**
**జేరుచునుంటి సత్వరమ నేను నిదే, మన మిర్వురం బొకే**
**సారిగఁ ధ్రావవచ్చు ననుజా! తుదికోరిక దీనిఁ దీర్పవే!** 228

ఐనను, సుక్షత్రియగతినందిన తమ్ముని గతులకు ,

నికృష్టుడను నేనెట్లు పోఁజాలుదును? అనుజా! నేటికి నీ యన్న యెడ గౌరవముఁ దప్పించితివా!

**జననీస్తన్యము ముందు గ్రోలితిని వత్సా, వెన్కనే త్రావి తీ;**
**వనుభుక్తమ్ములు నీకు నా పిదపనే యాహారపానీయముల్;**
**మనకీ చందమె చెల్లె యజ్ఞముల సోమప్రాప్తిలోఁ గూడ; కా**
**ని, నివాపాంజలి కీవు ముందయితివే,నీ కిట్లు రాఁ బాడియే? 229**

దేవీ! నీవును జలాంజలి విడువుము.

**ద్రౌప:** చేటీ! నీరందిమ్ము.

**(చేటి తెచ్చి యిచ్చును)**

**ద్రౌప:** **(అంజలి నింపి)** మహారాజా! ఎవరికని దీనినిత్తును!

**యుధి:**
**తనయశతకార్తిఁ గ్రుంగు గాంధారితోడ**
**సరిగఁ దనతల్లిఁ గూడ వందురగఁ జేసి,**
**కాని కాలాన స్వర్లోకగామి యైన**
**ప్రాణనాథున కిమ్ము నివాప జలము. 230**

**ద్రౌప:** **(వదలి, డగ్గుత్తికతో)** నాథా భీమసేనా! నీ పాదదాసి నీ కొసగు నీ జలము స్వర్గగామివగు నీకు పాదోదకమగు గాక!

**యుధి:** నాయనా! ఫల్గునాగ్రజ!

**ప్రతినఁ జెల్లించుకొనెడి లోపలనె నిన్నుఁ**
**బాడు దైవమ్ము మాకెడఁ బాపఁబట్టి,**
**కృష్ణఁ జూడు మసంహృత కేశ యగుచు**
**నే యొసంగు జలమ్ములు నీకు వత్స! 231**

**ద్రౌప:** నాథా! ఆలసింపకుడు, మీ తమ్ము డెడ మగు నేమో!

**యుధి:** **(అభినయించి)** పాంచాలీ! కుడిక న్నదరుచున్నది! భీముని తప్పక కలసికొందుమని తోచు చున్నది.

**ద్రౌప:** సర్వథా యట్లే యగు గాక!

**(కంచుకి భయోద్విగ్నుడై ప్రవేశించును)**

**కంచు:** మహారాజా! రక్షింపుడు. ఆ కౌరవాధముడు రక్తసిక్త శరీరాంబరుడై యుద్యతకాలదండుడైన యమునివలె నుద్ధృతభీషణగదాపాణియై, పాంచాలి నరయుచు నిటే వచ్చుచున్నాడు.

**యుధి:** దైవమా! నీ పంతమే నెగ్గెనా! **(మూర్ఛిల్లును)**

**ద్రౌప:** హా మత్స్యయంత్రభేదీ! నీవును నీ చిన్నన్ననే యనుసరించితివి గాని, మహారాజునుఁ గాని యీ దీనురాలినిఁ గానిఁ దలపపైతివా!

**యుధి:** **(తెలిసి)** వత్సా, సవ్యసాచీ! ముక్కంటి నెక్కటి కయ్యమ్మున స్రుక్కించితివే! నివాతకవచ కాలకేయాది మహారక్షోగణసంహారకుడవే! గంధర్వులబారినుండి నీవు విడిపించి బ్రదికించిన వాని చేతనే చిక్కితివా!.. కాదు కాదు ఈ నెపమున నీవే స్వేచ్ఛమై యిట్లు జేసి యుందువు.

**కొడుకులఁ జూచు కోరికయొ, కూర్మిగురుం గను నిచ్ఛయో, యనిం**
**బడిన నిజాగ్రజుస్ గలియు వాంఛయొ కల్గిన దేమొ! లేనిచో,**
**నడలుచు నున్న నన్నును, స్వయంవర లబ్ధను వీర్యశుల్క నీ**
**పడతిని , మాతృమూర్తిఁ, బరిపాటిగ వీడ్కొనకే గమింతువా!** 232

**(మరల మూర్ఛితుడగును)**

**కంచు:** అయ్యయ్యో! ఆ కౌరవాధముడు నిర్నివారుడయి యిటే వచ్చుచున్నాడు! దేవి గారికి జితాప్రవేశకాలము, నేనీ పని గావింతును. **(చేటితో)** నీ వేగి యే ధృష్టద్యుమ్ననో యే కవలనో శరణు జొరుము. భీమార్జునులు లేమి, యీ మహారాజిట్లైన నిక యిక్కడ రక్షకు లెవరు?

**(తెరలో మరల గలకలము, పిదప)**

శమంతపంచకసంచారులారా! నష్టవీరరణరంగావశిష్టవిరళ సైనికులారా! నన్నుఁ జూచి భయపడకుడు. యాజ్ఞసేని యెక్కడ?

**"దాసివి రమ్మిటంచుఁ దొడఁ దట్టుచుఁ బిల్చెఁ బతుల్ గనంగ ము**
**న్నే సతినిస్ సగర్వముగ, నేసతి వల్వల నొల్వఁ జేసి , నో**
**త్ప్రాసముగా హసించెను సభాస్థలిఁ, దమ్ములతో సుయోధనుం,**
**డా సతి , పంచపాండవకులాంగన యెక్కడ నుండె దెల్పుడీ!" 233**

**యుధి:** **(అవష్టంభముతో)** పాంచాలీ! భయపడకుము. ఎవరక్కడ! ధనుర్బాణములు దెమ్ము. రమ్మురా దుర్యోధనహతకా! నీ గదారణకౌశలమును శిలీముఖాసారముచే నడగింతును. ఓరీ కురుకులకళంకమా! నాకు భీమార్జునులపైఁ బ్రేమ కలదు గాని నీ పైఁ గరుణ యనుకొంటివా?

**మగధక్ష్మాపమదేభయూథపతిసింహంబైన భీముండు, భూ**
**తగణాధీశభుజాబలప్రతినియుద్ధప్రౌఢుడౌక్రీడి, దృ**
**గ్యుగతుల్యప్రియసోదరుల్ సనిన నే గ్రూరుండగా నుండ నీ**
**పగిదిస్, గాని మదాశుగప్రతతి నీ ప్రాణంబుఁ బోకార్పనే? 234**

**(అంత రక్తసిక్తశరీరముతో గదాపాణి యగు భీముడు ప్రవేశించును.)**

**భీము:** **(రౌద్రముగా బరిక్రమించుచు)** ఓయీ! సైనికులారా! ఏల మీకీ యావేగము! భయపడవలదు.

**ఓ సమరావశిష్టనృపయోధసమూహములార! యేల యీ**
**త్రాసము నన్నుఁ జూచి? నిహతద్విపవాజిశరీరరాశులం**
**దోసరనేల? రాక్షసుడనో! పెనుభూతమనో! విరోధ్యసృ**
**గ్భాసితసర్వగాత్రుడను క్షత్రియుడన్** సఫలప్రతిజ్ఞుడన్. 235

యాజ్ఞసేని యెక్కడ? **(సమీపించును)**

**ద్రౌప:** **(తేరుకొని)** మహారాజా రక్షింపుము.

**కంచు:** అమ్మా! ఇక రక్షణము కేవల మలభ్యము. సత్వరచితా ప్రవేశమే యేకైకరక్ష.

**ద్రౌప:** ఏమీ! నేనింకనుఁ జితియొద్దకే పోలేదా! **(లేచును)**

**యుధి:** ఎవరక్కడ? ధనుస్సు దెమ్ము. ఓహో! పరిజనమే లేరా! కానిమ్ము. బాహుయుద్ధముననే యా నీచు నెత్తి యీ యగ్నికుండమున బడవైచెదను. **(పరికరము బంధించును)**

**కంచు:** అమ్మా! యాజ్ఞసేనీ! ఇక బ్రతీకారాశయే లేదు. కనుక చూపుల కడ్డము బడుచున్న యీ కేశముల నిక ముడిచి వేయుము. సత్వరముగ జితిఁ జేరుము.

**యుధి:** ద్రౌపదీ! ఆ యధముడు చావకుండగనే కేశముల ముడిచెదవా!

**భీము:** **(సమీపించి)** నేనుండగా దుశ్శసనకరాకృష్టములైన యీ కేశములను ముడువగా నీవేల? నేనే సంహరింతు

నాగుము.

**(ద్రౌపది భయముతో దూరముగ జరుగును.)**

**భీము:** నిలువుము నిలువుము. ఆ భయమెందుకు? ఇప్పు డెచ్చటకుఁ బోయెదవు? **(కేశములను బట్టుకొనఁ బోవును)**

**యుధి:** **(అడ్డుపడి వేగముగ భీముని బాహువులలో బంధించి)** ఓరీ! భీమార్జునహంతా! దుర్యోధనహతకా! ఇప్పుడు నీవెచ్చటకుఁ బోయెదవు రా!

**ఆది నుండియు మాకు నిత్యాపకారి,**
**విప్పు డనుజయుగ్మము సమయించి, మిడిసి**
**పడుచుఁ, బడితి వస్మద్బాహుపంజరమున,**
**ఒక్క యడుగైనఁ బోజాల వుసురుతోడ! 236**

**భీము:** ఏమిది! అగ్రజుడు నన్ను జూచి సుయోధనుడనుకొని భ్రమించి దండింపఁ బోవుచున్నాడు!

**కంచు:** **(పరిశీలించి, సంతోషముతో)** దేవా! మోసపోయితిమి! ఇతడు ధార్తరాష్ట్రుడు గాడు. భీముడు. నీ తమ్ముడు. దుర్యోధనరక్తసిక్తారుణితశరీరాంబరుడగుట దెలియ రాకున్నాడు. సందేహము లేదు.

**చేటి:** **(ద్రౌపదిని గౌగిలించుకొని)** దేవీ, మానుము మానుము. వీడె నీ పతి భీమసేనుడు కృతప్రతిజ్ఞాతకార్యుండై, వేణీసంహారముఁ జేయుటకు నీకై వచ్చినాడు.

**ద్రౌప:** చేటీ! వట్టిమాటలతో నన్నోదార్చుచున్నావా!

**యుధి:** జయంధరా! ఏమందువు! ఇత డనుజద్వేషి

సుయోధనుడు గాడా? మన భీముడేనా!

భీము: దేవా అజాతశత్రుమహారాజా! ఇక నెక్కడి

సుయోధనుడు? నేడు నేనా పాండవపరిభావినిఁ బట్టి,

**తనువుఁ జెండితి, నూరువుల్ విరచితిన్, ధాత్రిం బడం గూల్చి; చం**
**దనపుం బూతవలెన్ మెయిన్ బులిమితిన్ దద్రక్తమున్, చండభం**
**డనకుండమ్మున మండి మాడె రిపుతండం బెల్ల, నీవన్న దు**
**ష్టుని పేరే మిగిలెన్, యశోవిభవముల్ శోభిల్లు నీపై యికన్.** 237

యుధి: **(నెమ్మదిగా భీముని వదలి కన్నీరొత్తుకొనును)**

భీము: **(నమస్కరించుచు)** అన్నగారికి జయమగుఁ గాక!

యుధి: **(లేవనెత్తి)** వత్సా! బాష్పరోధముచేఁ జూడలేకున్నాను.

నీవునుఁ గిరీటియు సుఖులే కదా!

భీము: సర్వరిపుసంహారంబున జయశోభితులైన మీ కృపచే

నేను నర్జునుడు నిరువురము కుశలులమే.

యుధి: **(భీమునిఁ గౌగిలించుకొని)**

**వైరులకేమి, తన్నిధనవార్తలకేమి యటుండనిమ్ము, వే**
**మారు వచింపుమయ్య, నిజమా యిది! నీవు బకారివే కదా!**

భీము: అవును.

యుధి: **...దారుణవిక్రమాఢ్యమగధప్రభుదేహసరోంతరాళసం**
**చారవినోదినక్రమవె సత్యముగా?**

భీము: అవును, నేను నిక్కముగా భీముడనే.

యుధి: **....ఇది చాలు నాకికన్.** 238

భీము: అగ్రజా! ఒక్క క్షణకాలమాగుడు.

యుధి: ఇంకేమి మిగిలియున్నది?

భీము: ముఖ్యకార్యమే మిగిలి యున్నది. సుయోధనరక్తసిక్తము లైన యీ చేతులతో యాజ్ఞసేని వేణిని ముడువవలసి యున్నది.

యుధి: కానిమ్ము. పాపము! దీనురాలు చిరదీర్ఘనిరీక్షితమైన వేణీసంహారోత్సవానందము ననుభవించుఁ గాక!

భీము: **(ద్రౌపదితో)** దేవీ! సకలరిపుక్షయమున శాశ్వత సౌభాగ్యవతి వైతివి.

ద్రౌప: సర్వకాలములందును తమకిట్లే విజయమగును గాక!

భీము: పాంచాలీ! బెదరకుము, ఇటుచూడుము.

**నిండుసదస్సులోన నిను నీచత నీడ్చిన వాని గుండియల్**
**జెండుకత్రావఁ జిక్కె నిది చిక్కనిరక్తము హస్తసక్త; ము**
**ద్దండత మేనిపూత యనఁ దాల్చితి, నిస్ దన యూరుసీమఁ గూ**
**ర్చుండగ బిల్చి నవ్విన కురుప్రభు రక్తము తాపశాంతికై.** 239

బుద్ధిమతికా!పాండవపత్ని నపహసించిన యా భానుమతీరాజ్ఞి యిపు డెక్కడ? దేవీ! యాజ్ఞసేనీ!

ద్రౌప: సెలవిండు.

భీము: నేనన్న మాటలు జ్ఞప్తిలో నున్నవా!

**ఉద్దామప్రతియోధయూథహననోద్యోగప్రతాపాఢ్యభా**
**స్వద్దోర్దండసముద్ధృతభ్రమితవిస్ఫాయద్గదాఘాతపా**
**తొద్దండ్యాసహచూర్ణదూరురిపురక్తక్లిన్నదుర్లక్ష్యమూ**
**ర్త్యుద్దీప్తుండగు భీముడీ కురుల సంయోజించు శీఘ్రమ్ముగన్.** 240

ద్రౌప: ఆర్యపుత్రా! జ్ఞప్తిలోనుండుటయె కాదు, తమ దయచే ననుభవించుచున్నాను గూడ.

భీము: **(కేశములు దూసి సవరించి)** దేవీ! కౌరవుల పాలిటి కాలసర్పములం బోలిన నీ కేశముల నిక సంహరింపుము.

ద్రౌప: నాథా! చిరకాలమగుట నీ ప్రక్రియను మరచితిని. తమ దయచే తమచేతులమీదుగా మరల నభ్యసింతును.

**(భీముడు వేణీసంహార మొనర్చును. అందరు హర్షింతురు.)**

**(తెరలో)**

**యద్వేణీభరమోక్షహేతువుగఁ, బ్రత్యాశాక్షమానాథయో**
**షిద్వేణీభరనాశనమ్మగుచుఁ, బొల్చెస్ గ్రుద్ధకుంతీసుతో**
**ద్యద్విక్రాంతి , తదీయవేణి యిదె బద్ధం బయ్యె, నాగుస్, ధరా**
**భృద్వంశక్షయ మింక, లోకులకు మేల్ పెంపొందు గా కెల్లెడస్. 241**

యుధి: దేవీ! నభస్సంచారులగు సిద్ధగణములు నీ వేణీసంహారము నభినందించుచున్నారు.

**(అంత కృష్ణార్జునులు ప్రవేశింతురు.)**

కృష్ణు: నిహతసకలారాతికులుడు యుధిష్ఠిరచక్రవర్తికి జయము.

అర్జు: అగ్రజునకు జయము.

యుధి: **(చూచి)** ఓహో! కృష్ణార్జునులు! కృష్ణా! అభివాదము. వత్సా రమ్ము. **(అర్జునుని కౌగిలించును.**

**( అర్జునుడు నమస్కరించును.)**

యుధి: **(లేవనెత్తుచు)** అర్జునా! ఇంత యలజడి దీరిన వెనుక నిన్నుఁ జూచుటచేత నా మనస్సు కలక దేరినట్లున్నది. **(కృష్ణునితో)** వాసుదేవా! నీ యనుగ్రహము బడసినవారికి జయము గాక మరే మగును! లీలానరమూర్తీ!

**అజునిన్ నిత్యు నచింత్యు నాదిభవు సర్వాధీశు నేతజ్జగ**
**త్ప్రజనిస్థానవినాశహేతువును నిన్, ధ్యానింపగాఁ జాలు న**
**ట్టి జనుండే తరియించు దుఃఖముల , ని ట్లేవేళ సాక్షాత్కృతి**
**వ్రజనాథ్యున్ ననుఁ జెప్ప నేల? యిది సర్వంబున్ భవల్లీలయే.242**

**కృష్ణు:** మహారాజా!

**అవధూతాఘులు వారె వచ్చి రిట పూజ్యశ్రేష్ఠులౌ ధౌమ్యసా**
**త్యవతేయాదిమునుల్, విధేయులగుమిత్రక్షత్రియుల్, మత్స్యయా**
**దవపాంచాలముఖాత్మబంధువులు, త్వద్రాజ్యాభిషేకార్థవి**
**ప్రవరానీతపవిత్రతీర్థజలకుంభశ్రేణితో భూవరా! 243**

అంతట మీరు సుయోధనమిత్త్రుడైన చార్వాకరాక్షసునిచే వంచితులరైరని విని యర్జునునితోఁ ద్వరితముగ నిటు వచ్చితిని.

**భీము:** **(కోపముతో)** ఏమీ! సుయోధనునకు ఇంకను మిత్త్రుడొకడు మిగిలెనా! వీరికీ వ్యసనముఁ గల్పించిన యా రాక్షసాధముడెక్కడ?

**కృష్ణు:** వాడు నకులుని చేతఁ జిక్కినాడులే పోనిమ్ము. మహారాజా! ఇంకను నీ యభిమత మేమి?

**యుధి:** అనుగ్రహించిన భగవంతుడు దేనినిమాత్ర మీయకుండును? నేను మాత్రము పురుషసహాజ బుద్ధిచేత సంతుష్టుడనగుచున్నాను. ఇంకనుఁ గోరఁ దగినదేది?

**దారపరాభవాంబుధిని దాటి, యజేయవిరోధులన్ భవ**
**త్కారుణికాత్మతన్ గెలువఁగంటిమి, కైవసమయ్యె భూమి, నా**

వారికి సేమమయ్యె, భగవంతుడ వీవిటు లాదరింతు, వే
కోరిక దీరకుండు? మరి కోరెడిదేమి ప్రసన్ను నిన్నికన్? 244

అయినను, దేవర దయచేత నిట్లగుఁ గాక,

ధరణీశుండు గుణజ్ఞుడై, సకల విద్వద్వంద్యుడై, విశ్వశం
కరుడౌనట్లు, సమస్తలోకులును నైకశ్రీవిరాజుల్, హృద
తరసంచింత్యభవత్పదుల్, గతరుజుల్, దాంతాత్ము, లాయుష్యభా
సురు లౌనట్టు లనుగ్రహింపఁగదవే , సూరిప్రశస్తా హరీ! 245

అంతే కాక,

ధరణిన్ బుట్టుచు నుండ్రుగా కెపుడు కాంతామానసంరక్షకై
గురువిక్రాంతులు శుద్ధచిత్తులగు లోకుల్, భీమతుల్యుల్; నిరం
తర మీర్ష్యావశులైనవారు కురుభర్తన్ బోలి తామే నశిం
తురు గా, కీకథ గూర్చు కైత బుధసంతోషం బిడున్ గావుతన్. 246

కృష్ణు: తథాస్తు.

(అందరు బరిక్రమించి నిష్క్రమింతురు.) (తెర పడును)

భట్టనారాయణుని సంస్కృతవేణీసంహారనాటకమునకు

బొడ్డుచెర్ల సుబ్బారావు జోగాంబల పుత్రుడు,

మార్కండేయప్రసాద్ చేసిన

ఆంధ్రానువాదమునందు

ఇది షష్ఠాంకము.

వేణీసంహారనాటకము సమాప్తము.

-*-

## ఉపసంహారః

అల్పజ్ఞానాం ప్రథమగణనార్హస్య మందస్య, విజ్ఞాః !
విద్వద్యోగ్యే పథి మమ  పదన్యాసయత్నో౽యమాద్యః .
మందా ౽౽క్రాంతా మమ మతి రియం సాహసేన, క్షమధ్వం,
గ్రంథో౽యం స్యాత్, బుధజనముదే, బాలభాషేవ పిత్రోః

ఉచ్యతే కవివృత్తాంతం గ్రంథస్యాంతే సమాసతః
ప్రపంచవ్యవహారాయ జిజ్ఞాసూనాం కృతే ౽థవా

ఆంధ్రః కుత్ససగోత్రో
జోగాంబాసుబ్బరాయయోః పుత్రః
నందవరవిప్రవంశ్యో
మార్కండేయప్రసాదనామాహమ్ .

**ఇతి శమ్.**

-***-